1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 8
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



రెండు వందల ఏళ్ళు
మన దేశాన్ని పాలించిన బ్రిటన్‌కు
ఇప్పుడు భారత మూలాలున్న
**రుషి సునాక్** ప్రధానమంత్రి.
తన సాంస్కృతిక అనుబంధాన్ని
పదిలంగా ఉంచుకొంటూ ముందడుగు
వేస్తున్నాడు. రుషి సునాక్‌కు
జయం కలుగుగాక !



**రాచకొండ విశ్వనాథ శాస్త్రి (రావి శాస్త్రి)**
కనువెలుగు: 30 జూలై 1922
కనుమరుగు: 10 నవంబరు 1993

రావిశాస్త్రిగారు వారి వ్యాసాలలో, తన ఆవేశాన్ని, ఉద్వేగాన్ని, ఎపుడూ దాచుకోలేదు. చెప్పాలనుకున్న సాహితీ విషయాలను నిక్కచ్చిగా చెప్పడం కనిపిస్తుంది. ప్రత్యేకమూ విశిష్టమూ, స్వతంత్రమూ అయిన శైలి వీరిది. కద్రువ సంతానం వ్యాసంలో హాస్పిటల్‌లోని స్త్రీని దేశ ప్రధాని ఇందిరాగాంధీని పోల్చారు. చదువురాని, నిరక్షరాస్యురాలైన స్త్రీని, దేశప్రధానిని పోల్చుతూ చదువుకున్న వాళ్ళకి పుస్తకాలుంటాయి, చదువలేని వాళ్ళు చదవాలంటే వారికి జీవితం తప్ప మరేదీ ఉండదు. దానిని వాళ్ళు చదువుకోకపోతే వారికి దినం వెళ్ళదు. బతుకు, బరువు మోసే మనుష్యుల మాటలకి పదును ఎక్కువ వుంటుంది అని అభిప్రాయపడతాడు.

సమగ్ర జాతీయ భాషావిధానాన్ని ప్రకటించాలి

# ఒకానొక చేతికర్ర



**ఒ**కానొక చేతికర్ర ఇవాళ మా వాకిట్లోకి
నెమ్మదిగా నడుచుకొంటూ వచ్చి
బోసినోటితో పలకరించింది
ఎన్నో కవితలల్లావు గానీ
నా గురించి ఒక్క ముక్కైనా రాయలేదేం అన్నది
సిగ్గుపడిన ఒక తరుణం –

ఆ చేతికర్రే
కల్లోల వైరి సముద్రం దాటటానికి
ముప్పై అయిదు కోట్లమందికి
మహానావ అయ్యింది గదా
తన బోసినోరు మౌన మహా వక్తృత్వం ప్రదర్శించింది కదా
తన రెండు పాదముద్రలు ఆసేతు హిమాచలం
వందలు వేలు లక్షలుగా పరివృద్ధి చెందాయి కదా
ఆ బాటలో నడిచిన పిరికిపందలు సైతం
ఆయుధం అక్కర్లేని మహాయోధులయ్యారు
అది ఉప్పునుంచి నిప్పును పుట్టించింది
ఆ అర్ధ నగ్నత
సూటు బూటుల తెల్ల మేనుల
వల్లమాలిన మిడిసిపాటుని
సిగ్గుతో తల వంచుకొనేలా చేసింది
ఆ చేతికర్ర స్వాతంత్ర్య పరతంత్రాల మధ్య
స్పష్టమైన ఎల గీసింది
నిరాయుధ హస్తాలతోనే
(కాకుంటే నిర్భయత్వంతో)
దేన్నైనా ఎవర్నైనా ఎదిరించవచ్చని చెప్పింది
తనలాంటి నిలువెత్తు కటకటాల మధ్య
కటకటబడుతూనే
దేశమంతా వ్యాపించే ప్రభంజనం
సృష్టించవచ్చని చూపించింది

అదెప్పుడూ నేలనే ముద్దాడినది గానీ
మబ్బుల గద్దెమీద రాజసం ప్రదర్శించలేదు
ఆడంబరాంబరాలు దాల్చలేదు

కరుడు గట్టిన కాలం గదా
ఇద్దరు మనుషుల మధ్య
మూడు ముళ్లూ ఆరు కత్తులూ
వికసించే కాలం గదా
విద్వేష విషవాయువుల్లో నిలబడలేక
విలవిలలాడుతున్న దేశం గదా
నిజానికి
ఒకప్పటికంటే ఇప్పుడే
నూట పాతిక కోట్లమందికి ఊతంగా
ఆ చేతికర్ర అవసరం ఎంతో ఉంది

పాపినేని శివశంకర్
89780 12323

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





నవంబరు 2022


## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4.** హామీపత్రం తప్పనిసరి: **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **ఇవీ సంగతులు** | | | **05** |
| **సంపాదక హృదయం:** | సమగ్ర జాతీయ భాషావిధానాన్ని ప్రకటించాలి | | **07** |
| **షా కమిటీ:** | షా కమిటీ సిఫార్సులపై... | **కరణం కళ్యాణకృష్ణకుమార్** | **08** |
| **తెలుగులో న్యాయపాలన:** | న్యాయపరిభాష తెలుగులో... | **కరణం కళ్యాణకృష్ణకుమార్** | **10** |
| **సాంకేతిక కోణం:** | భాషకు, లిపికి ఉన్న బంధం ఏమిటి?-3 | **రహ్మానుద్దీన్ షేక్** | **11** |
| **రాయలసీమ వ్యవసాయం:** | రాయలసీమ-వ్యవసాయానికి... | **చింతకుంట శివారెడ్డి** | **14** |
| **గిడుగు:** | గిడుగు 'బాలకవిశరణ్యం'-పరిశీలన | **వెలమల సిమ్మన్న** | **18** |
| **ప్రసార దినోత్సవం:** | నవంబరు12 భారతదేశ ప్రజాసేవా... | **శివయ్య రాజులపాటి** | **24** |
| **చేనేతరంగ పరిరక్షణ:** | సరికొత్త డిజైన్లు చేనేత రంగానికి... | **శ్రీరాములు గోసికొండ** | **26** |
| **శ్రద్ధాంజలి:** | నిలువెత్తు పుస్తకం నిజాం వేంకటేశం | **బి. నర్సన్** | **29** |
| **అమ్మనుడి:** | ప్రాంతీయ సంస్కృతుల ప్రభావం | **దేవులపల్లి రామానుజరావు** | **31** |
| **వ్యాస రచన:** | వ్యాస రచనలో భాషా వినియోగం | **చంద్రయ్య.ఎన్** | **35** |
| **సాహిత్య రంగం:** | సాహిత్య శిల్పి బాపిరాజు | **పసుపులేటి నాగమల్లిక** | **38** |
| **సాహిత్య రంగం:** | రావిశాస్త్రి వ్యాసాలు-సాహిత్యదృక్పథం | **ఏటూరు జ్యోతి** | **39** |
| **వారసత్వ సంపద:** | ఎడింబరో నేర్పిన పాఠాలు | **మధురాంతకం నరేంద్ర** | **40** |
| **వారసత్వ సంపద:** | కంప్యూటర్‌కు తెలుగు నేర్పలేమా? | **పి. శివరామకృష్ణ 'శక్తి'** | **42** |
| **ధారావాహిక:** | పడమటి గాలితో నివురు తొలిగిన... | **గుజ్జర్లమూడి కృపాచారి** | **45** |
| | మన చదువుల కథలు | **సి.వి.క్రిష్ణయ్య** | **48** |
| **కవిత:** | చేతికర్ర | **పాపినేని శివశంకర్** | **02** |
| | ఉద్యమించు తెలుగోడా | **వెంకటేశ్వరరావు కట్టూరి** | **30** |


| ముఖచిత్రాలు, రేఖాచిత్రాలు | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| **చిదంబరేశ్వరరావు** | **సరసి** | **బండారు రఘురాం** |

ammanudi.org **వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు**

**రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్సయాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

## గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ**

# ఇవీ సంగతులు...

### నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ విడుదల

జాతీయ విద్యావిధానం అమలుకు కావాల్సిన అమలుచేయదగ్గ అంశాల వైపు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ప్రీ-స్కూల్(ఒకటవ తరగతికి ముందు రెండు సంవత్సరాలు), ఒకటవ, రెండవ తరగతులకు సంబంధించిన నమూనా పాఠ్యాంశాలను, బోధనా సూచనలను సమ్మేళించి నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ను అక్టోబర్ మూడవ వారంలో విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ బడులలో మాతృభాషా మాధ్యమంలోనే విద్యార్థికి 8 ఏళ్ళ వరకూ చదువులుండాలని ఈ ఫ్రేమ్‌వర్క్ సూచిస్తున్నది. ఈ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆసక్తికరమైన వ్యాఖ్య చేరు. పిల్లలు తాము పుట్టిన నాటి నుండి నేర్చుకున్న మాతృభాష స్థానంలో ఒకవేళ పరాయి భాషను బడిలో చేరిన తొలినాళ్ళలో ప్రవేశ పెడితే అది పిల్లలు నేర్చుకునే క్రమాన్ని గజిబిజి చేసి, చదువులను కష్టతరం చేస్తుందని అన్నారు.

### హిందీమాధ్యమంలో ఎంబిబిఎస్ వైద్యవిద్య పాఠ్యపుస్తకాల విడుదల

అక్టోబర్ రెండవ వారంలో కేంద్ర గృహశాఖ మంత్రి అమిత్ షా మూడు వైద్యవిద్య సంబంధిత పాఠ్య పుస్తకాలను విడుదల చేశారు. ఇవి అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ పాఠ్యాంశాల పరిచయ పుస్తకాలని తెలుస్తోంది. ఇవి ప్రస్తుతం హిందీ అనువాదాల రూపంలో మాత్రమే విడుదల అయ్యాయి. ఈ మూడు పుస్తకాల్లోనూ పారిభాషిక పదాలను ఇంగ్లిష్ లో యథాతథంగా ఉంచి, కేవలం లిప్యంతరీకరణ చేశారు. పారిభాషిక పదాలను హిందీలోకి తేలేదు.

### మరో ఎనిమిది తెగలకు మాతృభాషా బోధన యోగం

ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ముందు నుంచి కూడా అక్కడి అడవి జాతుల, తెగలవారికి వారి మాతృభాషల్లోనే చదువులు అందిస్తోంది. కొత్తగా మరో ఎనిమిది భాషలకు సరిపడా పాఠ్య సామగ్రిని రూపొందించి, బడులలో ఆ భాషల్లో బోధన జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. జువాంగ్, ముండా, బొండా, సౌర, షంతాలి, కుయి, కువి, కోయ, కిసన్, ఒరన్ భాషల్లో ఈ పాఠ్య సామగ్రి తయారయింది.

### నైజీరియాలో ముప్పుగా మారుతున్న ఇంగ్లిష్

నైజీరియాలో ప్రజలు 500 భాషలను తమ మాతృభాషలుగా కలిగి ఉన్నారు. అక్కడి ప్రభుత్వం అన్ని భాషలను గుర్తించి, మూడు భాషలను అధికారిక భాషలుగా ప్రకటించుకుంది. అయితే ఆంగ్లం మోజు వలన ప్రస్తుతం విద్యార్థి దశలో ఉన్న ఈ తరం పిల్లలు తమ మాతృభాషలను విడిచి కేవలం ఇంగ్లిష్ ని మాత్రమే నేర్చుకుంటున్నారు. గత రెండు దశాబ్దాలలో ఈ పోకడ మరింత విస్తృతమైంది. అందువల్ల చాలామంది నైజీరియన్లు తమ మాతృభాష ఇంగ్లిష్ అని చెప్పుకునే పరిస్థితి ఉంది. నైజీరియా ప్రభుత్వం ఇంగ్లిష్ ను అధికార భాషగా ప్రకటించేంతగా ఇంగ్లిష్ చొచ్చుకుపోయింది.

### భాషా వైవిధ్య సర్వే

ఐఐటీ జోధ్‌పూర్ ప్రతి ఏడాది కొత్తగా చేరిన విద్యార్థుల భాషా విజ్ఞానాన్ని తెలుసుకునేందుకు భాషా వైవిధ్య సర్వే జరుపుతుంది. విద్యార్థులకు తెలిసిన భాషల గురించి తెలుసుకోవడం ఈ సర్వే లక్ష్యం. ఈ ఏడాది జరిపిన సర్వేలో అక్కడి విద్యార్థులు 20భాషలు అర్థం చేసుకోగలరని, 16 భాషల్లో మాట్లాడగలరని, 12 భాషల్లో రాయగలరని తెలిసింది.

### సంవత్సరాంతానికి న్యాయ విద్యకు సంబంధించిన మాతృభాషా మాధ్యమ పుస్తకాలు సిద్ధం

ఏడాది చివర్లో న్యాయ విద్యకు సంబంధించిన మొత్తం 75 పుస్తకాలు 13 ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు ఏఐసీటీఈ సిద్ధమయింది. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఇవి విద్యార్థులకు అందుబాటులో వస్తాయి.

### మనీలాలో మాతృభాషా చదువుల తొలగింపుపై నిరసనలు

మనీలాలో మాతృభాష మాధ్యమంలో చదవని విద్యార్థులకు మాతృభాష ఒక విషయంగా ఉండేది. ఇటీవలే ప్రభుత్వం మాతృభాష మాధ్యమంలో చదవని ఇంగ్లిష్ మాధ్యమంలో చదివే విద్యార్థులకు అదనంగా చదవాల్సిన మాతృభాష సబ్జెక్టును తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిరసనల వలన రెండు రోజుల్లో ఆ ఉత్తర్వులను వెనక్కు తీసుకుంది.

### సంస్కృతం మాతృభాషగా ఉన్న జనాభా కేవలం 24,821

ఇటీవలే ఒక వ్యక్తి ఆర్‌టీఐ ద్వారా దేశ జనాభా లెక్కల సంస్థకు సంస్కృతం మాతృభాషగా కలిగిన జనాభా వివరాలు కోరగా, దేశ జనాభాలో వీరి సంఖ్య 0.002 శాతం కన్నా తక్కువ అని తెలిసింది.

### పిల్లల మాతృభాషల్లో పుస్తకాలను అందించనున్న సింగపూర్ సర్కారు

సింగపూర్ ప్రభుత్వం అక్కడి పిల్లలకు మాతృభాషల్లో చదువులను ఆసక్తికరం చేసేందుకు బొమ్మలతో కూడిన కథల పుస్తకాలను అక్కడి గ్రంథాలయాల్లో, ప్రభుత్వం నడిపే మొబైల్ ఆప్ లో అందుబాటులో ఉంచతుంది.

### పాకిస్తాన్ ఆర్మీ పాఠశాలల్లో పశ్తో భాష బోధనను తొలగించిన పాకిస్తాన్ ఆర్మీ

పాకిస్తాన్ ఆర్మీ వారు తమ ఆర్మీ పాఠశాలల్లో పశ్తో భాషను పూర్తిగా తొలగించే దిశగా తాజాగా ప్రకటన చేసింది. విద్యార్థులు ఇకపై పశ్తో భాషను బడుల్లో చదవకూడదని, పశ్తో భాషలో మాట్లాడకూడదని ఉత్తర్వులు జారీ చేసింది.


ఇంగ్లీషు దేశంలో పుట్టి పెరిగి మాతృదేశమూలాలు, సంస్కృతీ
మరిచిపోనంటున్నాడు - మనం ఇక్కడ పరాయిభాషకి జైకొట్టి
మాతృభాషని తొక్కేస్తున్నాం!!
RISHI SUNAK


తెలుగు మీడియం ఉన్నన్నాళ్లు అన్నం పప్పూ కూరా
తిన్నారు కదా - ఇప్పుడింక ఇంగ్లీషు మీడియం కాబట్టి
బ్రెడ్డూ శాండ్విచ్చీ నూడుల్సే తినాలి అంటోందమ్మా మా టీచరు!!

సంపుటి : 8 సంచిక : 8

**అమ్మనుడి**

నవంబరు 2022

సంపాదకీయం

# సమగ్ర జాతీయ భాషావిధానాన్ని ప్రకటించాలి

**రెం**డేళ్లక్రితం నూతన జాతీయ విద్యావిధానం వెలువడి, ఎన్నో చర్చోపచర్చలకు దారితీసింది. పార్లమెంటులో దీనికి సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టినపుడు కూడా అందరి ఆమోదాన్ని ప్రభుత్వం ఏకగ్రీవంగా పొందలేకపోయింది. పాలకపక్షానికున్న తిరుగులేని సంఖ్యాబలంతోనే దాన్ని ఆమోదించారు. అప్పటి నుంచీ కేంద్రప్రభుత్వం తన ధోరణిలో తాను ముందుకు సాగిపోతున్నది.

విధాన ప్రకటనలు ఆచరణకు సంబంధించిన అన్ని అవసరాలను తీర్చవు. స్థూలంగా, రేఖామాత్రంగా అందులో చెప్పిన విషయాలు వాటి అమలుకు సంబంధించిన చట్టాలు, ఉత్తర్వులు వెలువడినప్పుడు మాత్రమే స్పష్టతను ఇస్తాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 'జాతీయ పాఠ్య ప్రణాళికాచట్రం'(నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్)ను విడుదల చేయడంతో, సరైన దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తున్నది. దీని ప్రకారం పాఠశాల పూర్వవిద్య రెండేళ్ల బ్రిడ్జి కోర్సుకూ, ఆ తర్వాత ప్రాథమిక విద్యకు సంబంధించిన వివరాలు క్రమంగా ముందుకు వస్తాయి. ప్రాథమిక విద్యను మాతృభాషలో(మాధ్యమంలో) నేర్పాలనే శాస్త్రీయ, ఆచరణాత్మక విధానాన్ని త్రోసిరాజని, ఇంగ్లీష్ మాధ్యమ ఉబలాటంతో రెచ్చిపోతున్న పాలకవర్గాలకు, విద్యారంగ వ్యాపారులకు, ఆ మాయలోపడి దారి తప్పుతున్న తల్లిదండ్రులకు సరియైన దిశానిర్దేశం చేయడానికి జాతీయ పాఠ్యప్రణాళికాచట్రం(ఎన్.సి.ఎఫ్)దోహదం చేస్తున్నది. ఇక కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కూడగట్టుకొని, జాతీయ విద్యావిధానాన్ని పాఠ్యప్రణాళికాచట్రాన్నీ వారిచేత ఆమోదింపజేసి ముందుకు సాగవలసి వుంటుంది. అప్పుడే విద్యారంగంలో జాతీయస్థాయిలో వారనుకొంటున్న విధంగా ముందుకు సాగగలుగుతారు.

అయితే, ఇందుకు కొన్ని అవరోధాలున్నాయి. ముఖ్యంగా విద్యారంగ నిర్వహణ రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో ఉంది. మొదట్లో ఉన్న విధంగా దీనిని పూర్తిగా రాష్ట్రాల జాబితాలోకి చేర్చాలని, వివిధ భాషాజాతుల సంగమంగా ఉన్న భారతదేశంలో భాషా, విద్యా సంస్కృతులపై కేంద్ర ఆధిపత్యాన్ని అంగీకరించబోమన్న వాదం కూడా బలంగానే ఉన్నది. దేశ ఐక్యత కోసం ఈ రెండు వాదాల మధ్య ఒక అంగీకృత విధానాన్ని చేపట్టాలి. భాష, విద్య, సంస్కృతి వంటి అంశాలపై మొండిగా, ఒంటెత్తు పోకడలను కేంద్ర ప్రభుత్వం చేపడితే అది జాతీయ ఐక్యతకు, శాంతికీ ప్రగతికీ విరుద్ధమైన పరిణామాలకు దారితీస్తుంది. కనుక ఇప్పుడు కేంద్రపాలకులు ఈ విషయంలో తమకున్న పూర్తి మెజారిటీని అడ్డుపెట్టుకొని తొందరపడకూడదు. సమన్వయం సాధిస్తూ, భాషాజాతుల ప్రత్యేకతను, వైవిధ్యాన్ని కాపాడుతామనే నమ్మకాన్ని అందరిలో కలిగించాలి. ఇప్పుడు హిందీ విషయంలో కేంద్రప్రభుత్వం చాలా దూకుడుగా ప్రవర్తిస్తున్నది. ఈ విషయంలో అందరినీ మభ్యపెట్టవచ్చుననుకొంటే అదొక పెద్ద రాజకీయ విస్ఫోటనానికి దారితీస్తుంది. రాజ్యాంగంలోని 22 భాషలనూ జాతీయ భాషలుగా అధికారికంగా గుర్తించడానికి తిరస్కరిస్తున్నది. 'ప్రాంతీయభాషలు అనే' మాటనే వాడుతున్నారు తప్ప, వాటిని జాతీయ భాషలుగా గుర్తించడానికి కేంద్ర పాలకులకు మనసొప్పడం లేదు. సాంకేతికంగా సాధించిన అభివృద్ధిని పూర్తిగా ఉపయోగించుకొంటూ 22 భాషలనూ సమాన ప్రతిపత్తి కలిగిన జాతీయ భాషలుగా ప్రకటించేవరకు నేటి కేంద్రపాలకుల మాటలను నమ్మడానికి ఎవరూ సిద్ధంగాలేరు.

కొత్త జాతీయ విద్యావిధానానికి సంబంధించి ఇప్పుడు వచ్చిన జాతీయ పాఠ్యప్రణాళికాచట్రం కొంత స్పష్టతను, ఆశను కలిగిస్తున్నప్పటికీ, సమగ్రమైన భాషావిధానాన్ని కేంద్రం స్పష్టంగా ప్రకటించేవరకూ అసమ్మతిని, ఆందోళనలను పాలకులే ప్రోత్సహిస్తున్నట్లవుతుంది.

దేశం బలంగా ఉండాలి. సమైక్యంగా ఉండాలి. ఎవ్వరూ కాదనరు. అందరూ కోరుకొనేది ఇదే. అయితే మన రాజ్యాంగంలోనే స్పష్టంగా పేర్కొన్నట్లు మనది రాష్ట్రాల మేలు కలయికతో ఏర్పడిన దేశం. వారందరి సమగ్ర అభివృద్ధితోనే దేశ అభివృద్ధి ఉంటుందిగాని, పక్షపాత ధోరణితో సాగించే పాలన వల్ల మాత్రం కాదు. ముఖ్యంగా విద్యారంగాన్ని అందరి ఆమోదంతో, అందరి వికాసానికి తోడ్పడే విధంగా తీర్చిదిద్దాలి. ఇందుకై సమగ్ర జాతీయ భాషా విధానాన్ని కూడా పాలకులు స్పష్టంగా ప్రకటించాలి.

సామల రమేష్ బాబు

29-10-2022

# షా కమిటీ సిఫార్సులపై ఆంధ్రుల ఆగ్రహం

*'ఆంధ్రప్రదేశ్‌లో ఎంబిబిఎస్‌ను తెలుగు మాధ్యమంలో కానీ, హిందీ మాధ్యమంలో గానీ అమలు చేయడం సాధ్యం కాదు, దానికి కనీసం మరో ఐదేళ్ళ సమయం అవసరం'* –డాక్టర్ శ్యామప్రసాద్ పిగిలిం, ఉపకులపతి, డా. ఎన్‌టిఆర్ యూనివర్శిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్.

ఇప్పుడు దేశం మొత్తం ఎంబిబిఎస్ బోధనా మాధ్యమంపై విస్తృత చర్చ మొదలైంది. అధికారిక భాషపై అధ్యయనం చేయడానికి కేంద్ర మంత్రి అమిత్ షా నేతృత్వంలో ఏర్పడిన కమిటీ సిఫార్సులపై వ్యతిరేక గళం మిన్నంటింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో వ్యతిరేకత అధికమైంది. ఆది బిజెపి ఐక్యతా నినాదం పై ప్రభావం చూపే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

**ఇంతకీ అమిత్ షా నేతృత్వంలోని కమిటీ ఏం చెప్పింది?**

అధికార భాషల చట్టం, 1963లోని సెక్షన్ 4 ప్రకారం 1976లో అధికార భాషపై పార్లమెంటు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కేంద్ర హోం మంత్రి అధ్యక్షత వహిస్తారు. ఈ కమిటీలో 1963 చట్టంలోని నిబంధనల ప్రకారం, 30 మంది సభ్యులు ఉన్నారు. అందులో లోక్‌సభ నుండి 20 మంది ఎంపీలు మరియు రాజ్యసభ నుండి 10 మంది ఎంపీలు.

షా కమిటీలోని ఇతర సభ్యులు సెప్టెంబర్ 9న రాష్ట్రపతి ముర్ముకు సమర్పించిన నివేదికలోని అంశాలు పబ్లిక్ డొమైన్‌లో లేవు. రాష్ట్రాల్లోని ఐఐటీలు, ఐఐఎంలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో హిందీ, బోధనా మాధ్యమంగా ఉండాలని, దానితో సహా దాదాపు 100 సిఫార్సులు చేసినట్లు కమిటీకి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్యానెల్ లో మెజారిటీ సభ్యులు అధికార పార్టీకి చెందిన బిజెపి వారితో పాటు బిజెడి, కాంగ్రెస్, జెడి(యు) , శివసేన, ఎల్‌జెపి, ఆప్ మరియు టిడిపి కి చెందిన ఎంపీలు ఉన్నారు.

హిందీ మరియు ప్రాంతీయ భాషలను బోధనా మాధ్యమంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో సహా అన్ని సాంకేతిక మరియు సాంకేతికేతర విద్యాసంస్థల్లో తప్పనిసరి చేయాలని సిఫార్సు చేస్తూ కమిటీ తన 11వ సంపుటిలో నివేదించింది. దీనిలో భాగంగా హిందీలో ప్రచురితమైన పుస్తకాలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించగా, భోపాల్ లో అక్టోబర్ 16 న షా విడుదల చేశారు. కాగా,ఈ కమిటీ సిఫార్సులను ప్రధానంగా దక్షిణ భారత రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై తెలంగాణ, కేరళ, తమిళనాడు తీవ్రంగా స్పందించాయి.

**ఎవరేమంటున్నారు?**

భారతదేశానికి ప్రత్యేకమైన భాషా వైవిధ్యం ఉందని సీపీఎం విడుదల చేసిన వీడియోలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. కానీ భారతీయ భాష హిందీ ఒక్కటే అన్న భావజాలాన్ని భారతీయులపై రుద్దేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, మొత్తం 22 భాషలకు సమానంగా ప్రచారం కల్పించాలని అన్నారు.

**దేశంలోనే తొలిగా మధ్యప్రదేశ్‌లో హిందీలో ఎంబిబిఎస్**

షా కమిటీ సిఫారసుల కొనసాగింపుగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా తమ రాష్ట్రంలోని మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థుల కొరకు హిందీ భాషలో పాఠ్యపుస్తకాలను ముద్రించింది. దీంతో దేశ వ్యాప్తంగా వైద్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. దేశం తిరోగమనంలో పయనిస్తుందంటూ విమర్శలు గుప్పించారు. అనేక ఉత్తర భారత రాష్ట్రాలు మధ్యప్రదేశ్ అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.

**ఆంధ్రప్రదేశ్‌లో మెడిసిన్ తెలుగులో బోధించడం సాధ్యమా?**

సాధ్యంకాదని తేల్చి చెప్పారు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (డాక్టర్ ఎన్‌టిఆర్‌యుహెచ్‌ఎస్), వైస్ ఛాన్సలర్ మరియు జాతీయ వైద్య మండలి సభ్యులు కూడా అయిన డాక్టర్ శ్యామ ప్రసాద్ పిగిలిం. ప్రస్తుతం హిందీ లేదా తెలుగు బోధన జరగాలని ఆదేశాలు వచ్చినా అమలు చేయడానికి తమకు కనీసం 5 సంవత్సరాల సమయం కావాలని అన్నారు.

మధ్యప్రదేశ్‌లో ఎంబిబిఎస్‌లో హిందీ మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఆందోళన కలిగించే అంశం. కనీస సమయం లేకుండా ఆంగ్ల మాధ్యమంలోని ఎంబిబిఎస్ పాఠ్యాంశాలని హిందీలోకి తర్జుమా చేయడం నెలరోజులలో అసాధ్యం అని, దీనికి కనీసం ఏడాది ముందుగానే వారు సిద్ధమయ్యుంటారని అనుమానం వ్యక్తం చేశారు. జాతీయ మండలి ఏ సమావేశంలోనూ దీనిపై చర్చ జరగలేదని ఆ మండలి సభ్యునిగా చెబుతున్నానన్నారు. భవిష్యత్ లో విదేశాల్లో పని చేయాలనుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, చైనా, రష్యా, జర్మనీ దేశాలు మాతృభాషను బోధనా మాధ్యమంగా అమలు చేస్తున్నాయని, అయితే అనేక భాషలున్న భారత్ వంటి దేశంలో అది సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నప్పుడు ప్రతి కళాశాల సీనియర్లు, నిపుణులు, విద్యావేత్తలతో చర్చించాల్సి ఉందని, అయితే మధ్యప్రదేశ్‌లో అలా జరగలేదన్నారు. మెడికల్ కాలేజీల్లో అధ్యాపకులకు హిందీలో బోధన కూడా కష్టతరంగా మారుతుందని అన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ప్రాంతీయ భాష లేదా హిందీలో బ్రిడ్జ్ కోర్సును ప్రారంభించి రాబోయే సమస్యలను అధిగమించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ మాట్లాడుతూ ప్రాంతీయ భాష లేదా హిందీలో బోధన స్థానిక విద్యార్థులకు సహాయపడుతుందని, అయితే పరిశోధన విషయానికి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ప్రాథమిక పరిశోధన విశ్లేషణలు ఆంగ్లంలో ఉన్నాయని అన్నారు. షా కమిటీ సిఫార్సులు అమలు చేస్తే,

# వైద్యవిద్యను భారతీయ భాషల్లో అందించడం - పాఠ్యపుస్తకాల, రిఫరెన్స్ పుస్తకాల అనువాదం యొక్క సాధ్యాసాధ్యతలు

ఉదాహరణకు జనరల్ మెడిసిన్‌లో పీజీ చేసే విద్యార్థులు చదివే పాఠ్య పుస్తకం మరియు రిఫరెన్స్ పుస్తకమైన "హారిసన్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్" ఇంగ్లీషులో ఉంటుంది. 3,855 పేజీలు గల ఈ పుస్తకం 19 భాషలలోకి అనువదించబడింది. ప్రతీ 4-5 సంవత్సరాలకు ఒకసారి, ఈ పుస్తకం ఎడిషన్ మారుతుంది. ఈ ప్రామాణికమైన పుస్తకం స్థానిక భాషలలో చదివే దేశాల జనాభా సంఖ్యను, తెలుగు రాష్ట్రాల జనాభా సంఖ్యతో పోల్చి చూడండి.

1. వియత్నాం ( 9,81,86,856), 2. టర్కీ ( 8,64,20, 807) 3. మెక్సికో ( 13, 20, 40, 023), 4. సెర్బియా ( 86,56,620) 5. రొమేనియా (1,89,43,654), 6. పోర్చుగల్ (1,01,28,486) 7. మేసిడోనియా ( 20,83,178), 8. పోలాండ్ ( 3,77,51,594), 9. దక్షిణ కొరియా ( 5,13,10,000), 10. జపాన్ (12,50,50,000), 11. ఇటలీ ( 5,92,40,329), 12. గ్రీస్ (1,04,45,365), 13. జర్మన్ ( 8,39,00,000), 14. జార్జియా (37,44,385), 15. ఫ్రాన్స్ ( 6,54,30,000), 16. క్రొయేషియా (40,60,135), 17. చైనా ( 141 కోట్లు ), 18. అల్బేనియా (28,70,605), 19. సిరియా ( అరబిక్ ) ( 1,96,96,882)

మరి మన తెలుగు రాష్ట్రాల లోని జనాభా 9,34,02,465 మంది.

**ప్రభుత్వం పాత్ర**: ప్రామాణికమైన పాఠ్యపుస్తకాలు, రిఫరెన్స్ పుస్తకాలను స్థానిక భాషలలోకి అనువదించడానికి ప్రచురణకర్తలకు ప్రభుత్వాలు కొన్ని ప్రోత్సాహకాలు తప్పనిసరిగా ఇవ్వాలి. మొదటి దశలో అనువాదం చేయడానికి సాంకేతిక సహాయం మరియు మానవవనరుల సహాయం కూడా అందించాలి.

**విద్యార్థుల వైపు నుండి:** 1. ఉదాహరణకు తెలుగు మీడియంలో ఎంబీబీఎస్ చేస్తే, తదుపరి PG తమిళనాడులో వస్తే.... అక్కడ తమిళ మీడియంలో ఉంటే ఎలా?? అన్నది చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులలో ఉన్న సందేహం.

**పరిష్కారం:** మెడికల్ పదాలను వివిధ భాషలలోకి transcript మాత్రమే చేయాలి, అనువదించకూడదు (translation చేయకూడదు).

అప్పుడు మూడు నుండి ఆరు నెలల్లో భాషను నేర్చుకొనే విధానం ఉంటే సరిపోతుంది. ఒకప్పుడు రష్యా వెళ్లిన మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, అక్కడి భాష నేర్చుకొని మెడిసిన్ చదివేవారు. ఇది కష్టమైనది కాదు.... కానీ అసలు మారాల్సింది విద్యార్థులకు భాషలను బోధించే విధానం, పరీక్షలు నిర్వహించే విధానంలో మార్పు.

ప్రముఖ సోషలిస్టు మేధావి, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన రామ్ మనోహర్ లోహియా కూడా జర్మనీలో అర్థశాస్త్రం చదవడానికి వెళ్ళి, మూడు నెలల్లో జర్మన్ భాష నేర్చుకున్న తర్వాతే "అడ్మిషన్ తీసుకొని.... జర్మన్ భాషలో అర్థశాస్త్రం చదివారు".

చైనాలోని విద్యార్థులు వారి మాతృభాషలో సాంకేతిక విద్యను అభ్యసిస్తారు. అయినా 2002-03 నుండి అన్ని రకాల గ్రాడ్యుయేషన్ విద్యార్థులు విధిగా ఇంగ్లీష్ పరీక్ష ( నేషనల్ ఇంగ్లీష్ టెస్ట్ )ను పాస్ అవ్వాలని నిబంధన తెచ్చారు. ఆ పరీక్ష U.Kలోని IELTS పరీక్ష స్థాయిలో ఉంటుంది. మనం కూడా అటువంటి నిబంధనలు తీసుకురావాలి. అప్పుడు మన విద్యార్థులకు వివిధ దేశాలలోని అవకాశాలకు ఎటువంటి అవరోధాలు ఉండవు.

**- డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్**
93948 10088

భారతదేశంలోని విద్యార్థులు తమ థీసిస్‌ను గ్లోబల్ ప్లాట్‌ఫారమ్‌లో సమర్పించలేరని ఇతర దేశాల పరిశోధకుల థీసిస్‌ను వారు అర్థం చేసుకోలేరని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దీర్ఘకాలిక సమస్యలను సృష్టిస్తుందని, ఎమ్‌బిబిఎస్ కి ఇంగ్లీష్‌లో బోధనా మాధ్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మెడిసిన్ స్థిరమైన శాఖ కాదని, నిత్యం అభివృద్ధి చెందే శాఖ అని, అకస్మాత్తుగా హిందీలో లేదా ప్రాంతీయ భాషల్లో బోధించడం కూడా సాధ్యం కాదన్నారు.

పీడియాట్రిక్ డెంటల్ సర్జన్ మరియు పీజీ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రాంతీయ భాషలో మెడిసిన్ నేర్చుకోవడం వల్ల విద్యార్థులు తమను తాము అప్‌డేట్ చేసుకునే ప్రయోజనాన్ని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వారు హిందీలో గ్రాడ్యుయేట్ అయితే వారి PG భవిష్యత్తు అంధకారంలో పడవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. నీట్ పిజి జాతీయ పూల్ పరీక్ష అని, పిజి సీటు వారి మాతృ రాష్ట్రం వెలుపల ఎక్కడైనా కేటాయించవచ్చని అలాంటి సమయంలో విద్యార్థి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. ఉత్తర భారత దేశంలో భాష వల్ల సమస్య ఎదుర్కొనే వారికి ఆంగ్లం నుంచి అనువాదంతో కూడిన పాఠ్యపుస్తకాలను అందిస్తే సరిపోతుందని, దానికోసం బోధన ఆంగ్లం నుంచి మార్చాల్సిన అవసరం లేదన్నారు.

*-కరణం కళ్యాణ కృష్ణకుమార్*
98484 28978.

# న్యాయ పరిభాష తెలుగులో అసాధ్యమా?

*"భాష కక్షిదారులను గందరగోళానికి గురిచేయకూడదు, తీర్పుల ఫలితంగా కక్షిదారుల జీవితాలు, వ్యవహారాలు ప్రభావితమయ్యేలా అర్థవంతంగా ఉండాలి"*

-జస్టిస్ డివై చంద్రచూడ్ , జస్టిస్ ఏఎస్ బోపన్నల ధర్మాసనం

ఇప్పుడు దేశం యావత్తూ విద్యా బోధనా భాష ఎందులో ఉండాలి అనే దానిపై విస్తృత చర్చ నడుస్తోంది. ఇప్పటికే కేంద్రమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని కమిటీ ఉన్నత విద్య హిందీ లేదా ప్రాంతీయ భాషల్లో జరగాలని సూచించడంతో దేశ వ్యాప్తంగా దానిపై వాద, ప్రతివాదాలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో న్యాయభాష సరళమైన ప్రాంతీయ భాషలో ఉండాలనే వాదన దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు, తెలుగు రాష్ట్రాల్లో అధికమైంది. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర , గుజరాత్ వంటి రాష్ట్రాల్లో హిందీ లేదా ప్రాంతీయ భాషల్లో న్యాయ భాష కొనసాగుతుండటం గమనార్హం.

ఢిల్లీకి చెందిన సుభాష్ విజయన్ అనే లాయర్ 2016లో లా స్కూల్‌ను ప్రారంభించిన సమయంలో అతను కేసులకి సంబంధించిన పదజాలంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. పరిమిత ఆంగ్ల నైపుణ్యాలు కలిగిన వ్యక్తిగా, లాటిన్-ఫ్రెంచ్-ఇంగ్లీష్ పదాల మిశ్రమ భాష అతనికి కొరకరాని కొయ్యగా మారింది. దీంతో అతను కోర్టులో, ప్రభుత్వ పరిపాలనలో సరళీకృత భాష కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశాడు. 'పూర్తి చట్టపరిధిలోని పరిభాషలో ఆయా పత్రాలను చదువుతున్నప్పుడు మొదటగా తారసపడే లాటిన్ పదాలను చూస్తే తీవ్ర భయాందోళనలకు గురవ్వాల్సివస్తుంది అని విజయన్ తన పిటీషన్‌లో పేర్కొన్నాడు.

ఓపి జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీకి చెందిన లా ప్రొఫెసర్ అనూజ్ భువానియా మాట్లాడుతూ ఇప్పుడు 500 పేజీలకు పైగా ఉన్న తీర్పులు పెండింగ్ న్యాయస్థానంలో ఉంటున్నాయని, సరళీకృతం చేయడానికి ప్రయత్నాలు మృగ్యమయ్యాయి అన్నారు.

ఇటీవలి హిజాబ్ తీర్పులో వాడిన సరళీకృత భాష ఒక మైలురాయనే చెప్పాలి. వివాదాస్పద అంశం కారణంగా తీర్పుపై తీవ్ర చర్చ జరిగినప్పటికీ, ఆ తీర్పులోని పదాల సరళత చాలా కొత్తగా, సులభంగా అర్థమయ్యేలా ఉందని చాలా మంది అంగీకరించారు, లాయర్ జుమా సేన్ తను చేసిన ట్వీట్‌లో "ఈ తీర్పు దశాబ్దాల భారత న్యాయచరిత్రలో ఓ ప్రత్యేకత సంతరించుకున్నదని, బెంచ్ సభ్యులు సులభ భాషా ఉద్యమానికి బాటలు వేసారని" వ్యాఖ్యానించడం విశేషం.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ లాయర్, మాజీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు సంపర శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలుగును న్యాయ భాషగా అమలు చేయడం అత్యవసరమని, అది సాధ్యమయ్యే పనే అని అన్నారు. కోర్టు భాష ప్రధానంగా ఆంగ్లంలో ఉండటం వల్ల జనాభాలో ఎక్కువ మందికి అందుబాటులో ఉండటంలేదు అని అన్నారు. కోర్టులో సాక్ష్యం రికార్డు చేసే సమయంలో ఎవిడెన్స్ యాక్ట్స్ ప్రకారం, అతనికి తెలిసిన భాషలో నమోదు చేయాల్సిన అవసరం ఉన్నదని, కానీ అలా జరగకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కేవలం ఇంగ్లీష్ టైప్ మిషన్లు ఉన్నకాలం నాటికి, ఇప్పటికీ సాంకేతికతలో విస్తృత మార్పులొచ్చాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతతో కోర్టు పరిభాషను తెలుగులో న్యాయవాదులు, న్యాయమూర్తులు అందిపుచ్చుకుంటారని అభిప్రాయపడ్డారు. న్యాయ భాష తెలుగులో ఉండటం వల్ల సుప్రీంకోర్టులో తప్ప మరెక్కడా సమస్య రాదన్నారు.

**కోర్టులు,న్యాయవాదులు మిశ్రమ భాషని ఎందుకు కొనసాగిస్తున్నారు?**

విజయవాడకు చెందిన సీనియర్ లాయర్ విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "న్యాయభాషా బోధన తెలుగులో జరగడంలేదు. ఒకవేళ బోధన స్థానిక భాషలో మొదలెట్టినా అనేక సమస్యలు ఎదురౌతాయి. పైగా, అరెస్ట్, కన్విక్షన్, వారెంట్ అనే అనేక న్యాయ భాషలోని పదాలు దాదాపూ ఇంగ్లీషులోనే స్థానికంగా కూడా చలామణీ అవుతుండటం గమనించాల్సిన అంశం. న్యాయభాషలోని అరెస్ట్, కన్విక్షన్ అనే రెండు వేరువేరు పదాలకి తెలుగులో ఖైదు అనే ఒక పదం మాత్రమే అందుబాటులో ఉంది. స్థానిక భాష అమలైతే సాక్ష్యం నమోదు ఏ భాషకీ స్పష్టంగా కాకుండా పోతుంది. పైగా న్యాయవాదులు దాదాపు 50 శాతం మంది తెలుగులోనే వాదిస్తున్నారు. 60 శాతం మంది న్యాయమూర్తులు సాక్ష్యాన్ని నమోదు చేసుకోగలుగుతున్నారని, ప్రస్తుత న్యాయ భాషవల్ల కేవలం 40 శాతం మంది న్యాయమూర్తులు మాత్రమే సమస్యని ఎదుర్కొంటున్నా"రని అభిప్రాయపడ్డారు. కోర్టు భాష ఆంగ్లమే అనుకుంటే పొరబాటే అని అన్నారు. పైగా హైకోర్టులలో స్థానిక భాష ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన న్యాయమూర్తులకు సమస్యగా పరిణమించవచ్చన్నారు. సరళమైన భాషా ఉద్యమం అనేది పరిగణనలోకి తీసుకోవడం చిన్న విషయం కాదన్నారు.

**పొరుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ భాష అమలులో ఉండగా తెలుగు రాష్ట్రాల్లో సమస్య ఎందుకు?**

విజయవాడకే చెందిన సీనియర్ లాయర్ బూదాల సూర్యప్రకాశ రావు మాట్లాడుతూ, తాము తమిళనాడు వెళ్ళినప్పుడు అక్కడ తమిళంలో సాక్ష్యం నమోదు చేస్తున్నారని, అదే విధంగా కర్ణాటకలో కూడా కన్నడంలోనే కోర్టు పరిభాష, పత్రాలు ఉన్నాయని, దానివల్ల వాదికి ప్రతివాదికి, సాక్షికి తాము వింటున్నదే కోర్టులో నమోదవుతున్నదనే నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సాక్ష్యం తెలుగులో చెప్పగా, న్యాయమూర్తి ఆంగ్లంలో నమోదు చేస్తారని, టైపిస్ట్ తప్పులు లేదా సాక్ష్యం నమోదులో తప్పులు ఉన్నప్పటికీ ఆ పత్రాలు ఆంగ్లంలో ఉండటం వల్ల సాక్షి తన సాక్ష్యం వివరాలు చదువుకునే ఆస్కారం లేకుండానే సంతకం పెట్టాల్సివస్తుందని, అది వారి హక్కుకు కచ్చితంగా భంగమే అని అన్నారు. పొరుగు రాష్ట్రాల్లో న్యాయ వ్యవస్థ ప్రాంతీయ భాషల్లో కొనసాగుతుండగా, ఆంధ్ర ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో సమస్య ఎందుకు ఉంటుందని ఆయన ప్రశ్నించారు.

భారత్‌కు సంబంధించిన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను వారసత్వంగా అందించిన యూఎస్ 2010లో దాని చట్టాలను, ప్రభుత్వ సమాచార వ్యవస్థను యుఎస్, కెనడాలా సరళీకృతం చేసుకుంది.

సెప్టెంబరులో న్యూజిలాండ్ పార్లమెంటులో సాధారణ భాషా బిల్లును తీసుకువచ్చింది. ఇటీవల భారతదేశపు సుప్రీంకోర్ట్ కూడా కోర్టు తీర్పులలో ఉపయోగించిన "అపారమయిన భాష"పై ఆందోళన వ్యక్తం చేసింది.

ఎఫ్ఐఆర్‌లలో ఉర్దూ, పర్షియన్ భాషలను తగ్గించాలని 2019లో ఢిల్లీ హైకోర్టు తన ఆదేశాలలో సూచించింది. ఎఫ్ఐఆర్‌లలో 'మజ్‌రూరియా' (గాయపడిన స్త్రీ) మరియు 'హస్ బజాబ్తా' (సిఆర్‌పిసి ప్రకారం) వంటి 383 ఉర్దూ పదాలు, పదబంధాలను ఈ ఉత్తర్వు లెక్కించింది.

*-కరణం కళ్యాణ కృష్ణకుమార్*
98484 28978.

సాంకేతిక కోణం

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

## భాషకు, లిపికి ఉన్న బంధం ఏమిటి?-3

# దక్షిణ భారత లిపులన్నిటికీ మాతృక లిపి భట్టిప్రోలు లిపే!

**గత** సంచికలో(సెప్టెంబర్) భారతదేశంలోని వివిధ లిపులను, వాటి పరిణామక్రమాన్ని గురించి సంక్షిప్తంగా తెలుసుకున్నాం. అయితే దక్షిణ భారతదేశపు ప్రస్తుత ద్రావిడ భాషలకు లిపులైన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, తుళు(తిగలారి) – ఈ ఐదు వేటికవే స్వతంత్ర లిపులన్నట్టు స్ఫురించేలా రాసానేమో అనిపించింది. కానీ అది నిజం కాదు. భట్టిప్రోలులో లభ్యమైన ధాతుపేటికలపై కనిపించే లిపి మన దక్షిణ భారత భాషలను నేడు రాసే లిపులకు మాతృక లిపి అయ్యే అవకాశాలే ఎక్కువ. ఉత్తర భారత లిపులకన్నిటికీ మాతృకగా భావించే బ్రాహ్మీ లిపికి దగ్గరగా ఉంటూనే కొన్ని భిన్న ఆకారాలతో భట్టిప్రోలు లిపి ఉంది. అందుకని దీనిని దక్షిణ బ్రాహ్మీ లిపిగా భావిస్తారు. మిగతా అన్ని భాషల మూల లిపులకన్నా ముందు ఉండిన లిపి ఈ భట్టిప్రోలు లిపి. అంటే తమిళ మలయాళ లిపుల మాతృక లిపి గ్రంథ లిపిన్నూ, తెలుగు-కన్నడ లిపుల మాతృక లిపి విజయ లిపిన్నూ ఈ భట్టిప్రోలు లిపి నుండే పుట్టి ఉండాలి.

భట్టిప్రోలు గుంటూరు జిల్లా తెనాలి రెవెన్యూ విభాగంలోని ఒక గ్రామం. 1904లో ప్రచురితమైన అప్పటి భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ వారి కొత్త ఇంపీరియల్ శ్రేణిలో 15వ వాల్యూము సౌత్ ఇండియన్ బుద్ధిస్ట్ ఆంటిక్స్ పుస్తకంలో అప్పటి కృష్ణా జిల్లాలోని భట్టిప్రోలు, గుడివాడ, ఘంటసాల మొదలగు ప్రదేశాల బౌద్ధ వారసత్వ సంపద గురించి రాసారు ఆనాటి పాశ్చాత్య చరిత్రకారులు. ఈ పుస్తకంలోనే భట్టిప్రోలు లిపిని కనిపెట్టిన వివరణ ఉంది. ఈ పుస్తకం ప్రకారం భట్టిప్రోలు లిపి క్రీస్తు పూర్వం రెండవ శతాబ్ది కన్నా పాతది.

అయితే అశోకుడి శిలాశాసనాల్లో కనిపించే ఉత్తర భారత బ్రాహ్మీకి భిన్నంగా ఈ లిపి అక్షరాలున్నాయని గుర్తించారు.

భట్టిప్రోలు లిపి గురించి చెప్పుకునే ముందు ఇక్కడ కాస్త వేరే సంగతులు చెప్పుకోవాలి. తెలుగు నేలలపై సాంస్కృతిక వారసత్వం గురించి సాధారణ ప్రజ దృక్పథం అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి అన్నట్టుంటుంది. పొలంలో పని చేసేటప్పుడో, ఇల్లు కట్టడం కోసమో, రహదారి వేయటం కోసమో తవ్వకాలు చేసినప్పుడు ఒకవేళ పొరపాటున ఏదైనా శిలాశాసనం బయట పడిందంటే, ఆ శాసనంలో దైవ సంబంధ చిత్రాలు కనిపిస్తే, ఆ శాసనానికి పసుపు రాసేసి, కొబ్బరి కాయలు కొట్టేసి పూజలు చేసేస్తారు. ఎలాంటి దైవ సంబంధ చిహ్నాలు లేని పక్షంలో అప్పుడే కాకతాళీయంగా మరెవరికో ఏదైనా చెడు జరిగితే ఈ శాసనం బయట పడటం వలన జరిగిందని ఆ శాసనాన్ని నాశనం చేసేస్తారు. రెండు సందర్భాలలోనూ శాసన పాఠ్యాన్ని కనుగొనటం గానీ, ఆ శాసన కాలాన్ని అంచనా వేయటం గానీ చాలా కష్టమై పోతుంది. లిపి కలిగి ఉన్న శాసనం – అది తాళపత్రమైనా, రాయయినా, నాణెమైనా, ధాతురేకైనా – అన్ని రూపాలలో మన చరిత్రకు, సంస్కృతికి అదొక ప్రతీక. భద్రపరిచి, ఆ శాసనంలోని పదాలను గుర్తించగలిగితే మన భవ్యమైన చరిత్రకు మరింత పూర్ణత చేకూరే అవకాశం ఉంటుంది. కొన్ని దేవాలయాల్లో ఆధునికీకరణ పేరుతో శాసనాలను నేలమట్టం చేయటం, సిమెంట్ పూత పూసి నాశనం చేయటం పెద్ద చదువులు చదువుకున్న వారు చేస్తున్న పనులు.

ఆ విధంగా మనకు తెలీకుండానే ఎన్నో విలువైన శాసనాలను మనం ఎక్కడ ఎలా కోల్పోయామో మనకే తెలీదు. అక్కడక్కడా బిందువుల్లా భట్టిప్రోలు లాంటి ఆనవాళ్ళు దొరుకుతాయే గానీ ఆ బిందువులను కలిపే రేఖలను మనం కాలగతిలో కోల్పోయాము.

ప్రతి అక్షరాన్ని అపురూపంగా భద్రపర్చుకోవటమే మనం మన చరిత్రకు, సంస్కృతికి ఇవ్వగలిగిన కనీస గౌరవం.

భట్టిప్రోలులోని బౌద్ధ స్తూపం 132 అడుగుల గుమ్మటం (dome) అడుగు భాగం 148 అడుగుల వ్యాసంతో ఉంది. పూర్తిగా ఇటుకలతో కట్టిన స్తూపం ఇది. ఇటుకలను అప్పటివారు చాలా శ్రద్ధతో నాణ్యంగా తయారుచేసారు. కనుగొన్న నాటికి భట్టిప్రోలు స్తూపంలో ఐదడుగుల గోడ భాగం మాత్రమే దొరికింది. మిగతా స్తూప భాగం శిథిలమై దిబ్బగా మారి ఉంది. భట్టిప్రోలు గ్రామానికి దక్షిణంగా ఈ స్తూపం ఉంటుంది. బ్రిటిష్ వారు ఈ స్తూపాన్ని పరిశీలించడానికి వచ్చే నాటికి ఈ స్తూపం ఒక పెద్ద మట్టి రాసి కొండ రూపంలో కుప్ప పోసినట్టు ఉండింది. అక్కడి ప్రజలు స్తూపపు ఆ దిబ్బ రూపాన్ని లంజదిబ్బ అని వ్యవహరించేవారు. 1870 నాటి బొస్వెల్ నివేదికలో ఈ స్తూపం ప్రస్తావన మొదటగా కనిపిస్తుంది. సర్ వాలటర్ ఇలియట్ ఈ స్తూపం గురించి మరింత వివరంగా 1871 నాటి ప్రభుత్వ పత్రాల్లో ముద్రించాడు. ఆ ఏడాది ఈ బ్రిటిష్ అధికారుల మధ్య దిబ్బను ధ్వంసం చేసి అందులోని చారిత్రక వస్తువులను పరిశీలించడం గురించి ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. అప్పుడు బయటపడిన ఇటుకలతో రోడ్లు వేసారు. పాలరాయిని వండి వచ్చిన సున్నపురాయితో కృష్ణా కెనాల్‌కు తూములు వేసారు అప్పటి బ్రిటిష్ అధికారులు. అయితే కొన్నేళ్ళ తరువాత వచ్చిన బ్రిటిష్ అధికారి నారిస్ ఈ దిబ్బ అస్తవ్యస్తంగా ఉందని గుర్తించి, రోడ్డు వేయటం కోసం తొలగించిన ఇటుకలు లేని భాగాన్ని అంచనా వేసి, అక్కడి కట్టడం గుండ్రంగా ఉండేదని అంచనా వేసాడు. రెండడుగుల పొడవు, అడుగున్నర వెడల్పున్న ఇటుకలు ఇక్కడ లభ్యమయ్యాయి. 14 అడుగుల ఎత్తున్న దిబ్బ, దగ్గర దగ్గర 1700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. దిబ్బకు పైన గుండ్రటి రంధ్రమొకటి ఉంది. ఆ రంధ్రానికి చుట్టూ పైనుంచి కిందకు ఎనిమిదేసి ఇటుకల


300 BC
Ashoka 265 - 232 BC
Maurya 321 - 185 BC
Bhatiprolu
Sunga 187 - 75 BC
2° BC - 1° AD
Kushana 1° BC - 3° AD
1° - 3° AD
Kshatrapa 2° - 3° AD
Gupta 320 - 540 AD
rock writing
other
లల

వలయం ఉంది. వివిధ కాలాల్లో ఈ స్తూపపు ఇటుకలను, మట్టిని తొలగించినట్టుగా ఆనవాళ్ళు కనిపించాయి. మొత్తానికి స్తూపం దాదాపు 66 అడుగుల ఎత్తుండవచ్చని నారిస్ అంచనా వేసాడు. కొన్నేళ్ళకు మరొక బ్రిటిష్ అధికారి స్వెల్ స్తూపపు ప్రదేశాన్ని పరిశీలించి అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రభుత్వ హయాంలో పత్రాన్ని ప్రచురించాడు. అతడి ప్రకారం స్తూపం పూర్తిగా నాశనం చేయబడింది. అక్కడ ఎలాంటి చెక్కిన శిల్పాలు లభ్యం కాలేదు. అప్పటి అక్కడ ప్రజల కథనం ప్రకారం స్తూపం చాలా ఎత్తైనది. బ్రిటిష్ అధికారులు ఇటుక, మట్టి, పాలరాయి కోసం స్తూపాన్ని ధ్వంసం చేయక ముందు చాలా ఎత్తుగా ఉన్నట్టు, స్తూపం చుట్టూ నాలుగడుగుల పాలరాతి గోడతో ప్రదక్షిణ మార్గం ఉన్నట్టు ఇతనికి చెప్పారట. ఈ పాలరాయిలో కొంత భాగం సున్నం కోసం కాల్చగా, కొన్ని పాలరాతి శిలలను వెల్లటూరు తూముకు వినియోగించినట్టు చెప్పారు. అయితే ఇదే అధికారికి మరొక పబ్లిక్ వర్క్స్ అధికారి మరొక రకంగా వివరాలను ఇచ్చాడు. అతని వివరణ ప్రకారం వెల్లటూరు తూము కోసం పాలరాయి శిలలను వినియోగించినా, సున్నం కోసం మాత్రం వినియోగించలేదట. స్తూపానికి ముందు భాగంలో పదిహేను అడుగుల స్తంభం ఒకటి ఉండేదని, ఆ స్తంభానికి ఇవతల పది అడుగుల పల్నాడు పాలరాయి గోడ స్తూపం చుట్టూరా ఉందని. ఆ అధికారి చెప్పిన మరొక ఆసక్తికరమైన విషయం పాలరాతి గోడ మీద చెక్కిన శిల్పాల సంగతి. అప్పటి వరకూ ఇతర  అధికారులు ఆ పాలరాతి శిలలపై ఎలాంటి కళాకృతులు లేవన్న నెపంతో పాలరాతి శిలలను తూములుగా, రహదారులకు రాతి కోసం వినియోగించారు. స్వెల్ పరిశీలించగా వెల్లటూరు తూములలో వాడిన పాలరాతి శిలలపై శిల్పాలు కనిపించాయి. ఇవి అమరావతిలో బయల్పడిన శిల్పాల లాగానే ఉన్నా, అమరావతి శిల్పాలలో ఉన్న నైపుణ్యం ఈ శిల్పాలలో లేదట. జంతువుల, మనుషుల, దేవతల శిల్పాలు ఆ పాలరాతి శిలలపై అతను గమనించాడు. నారిస్ ప్రకారం స్తూపం మధ్యలోని రంధ్రం నిజానికి ఒక కలప గొడుగుకు కాడ అయి ఉండవచ్చు. కొన్ని అంగుళాల వ్యాసార్థంతో 14 అడుగుల ఎత్తుతో ఈ గొడుగు స్తూపానికి పైన ఉండి ఉండాలని నారిస్ ఆలోచన.

బొస్వెల్ నివేదిక ప్రకారం భట్టిప్రోలు స్తూపాన్ని మట్టి, ఇటుక, పాలరాయి కోసం తవ్వినపుడు రాతి పేటికలు దొరికాయి. ఈ రాతి పేటికల లోపల ధాతు పేటికలు, కొన్ని గింజలు, ముత్యాలు, రత్నాలు ఉన్నాయి. స్థానికుల ప్రకారం ఐదు తలల సర్పశిల, మరొక రాతి కలశం విరిగిపోయిన స్థితిలో దొరికాయి. ఈ విరిగిపోయిన కలశంలో ఏదైనా ధాతువును బంగారంగా మార్చే మహిమగల పరుసవేది ద్రవముందని స్థానికుల నమ్మకం. అయితే తవ్వకాలలో విరిగిపోయిన ధాతుపేటికలు, రాతిపేటికలు మిగిలాయి.

స్తూపం పై భాగం నుండి 14 అడుగుల 6 అంగుళాల లోతుకు తవ్వగా మొదటి పేటిక దొరికింది. ఈ రాతి పేటిక దక్షిణవైపున్న గోడకు ఇటుకల మధ్యలో దొరికిన రాతి వస్తువు. ఇది 2 అడుగుల 11 అంగుళాల పొడవు, 2 అడుగుల 6 అంగుళాల వెడల్పు కొలతలతో ఉంది. మధ్యలో బావి ఆకారంలో ఉంది. బహుశా ఇది ఆ రాతిపేటికకు మూత అయి ఉండవచ్చు. రాతి పేటిక ఈ మూత కింద నునుపైన ఉపరితలంతో 11 అంగుళాల పొడవు, 8 అంగుళాల వెడల్పు, అర అంగుళం లోతుతో ఉంది. కింద గుండ్రంగా పైన చతురస్రాకారంలో ఖాళీ ఉంది. మౌర్య లిపికి దగ్గరగా ఉన్న ఒక లిపిలో గుండ్రటి ఈ పేటిక చుట్టూరా రెండు వరుసలలో అక్షరాలు చెక్కి ఉన్నాయి. ధాతుపేటికతోపాటుగా రాగి ఉంగరం, రాగి ధాతువు ముక్కలు కొన్ని, చిన్న పూస, రెండు వరసల ముత్యాల పేరు, వక్క రంగు చిప్పలు రెండు కూడా ఈ పేటికలో దొరికాయి. ఈ రెండు చిప్పలు ఒక స్తూపాకారపు పాత్రగా కలుస్తున్నాయి. వీటికిపైన బంగారపు పూస ఒకటి ఉంది. ఇంకా వివిధ రకాల అలంకరణ వస్తువులు, త్రిశూలాలు, కూడా ఈ ధాతు పేటికలో దొరికాయి. మరిన్ని వివరాలు బొమ్మలో చూడవచ్చు.

1892లో ఈ ధాతుపేటికలలోపల స్ఫటిక పేటికలు ఉన్నట్టు, వాటిలో బుద్ధ భగవానుని అవశేషాలున్నట్టు అలగ్జాండర్ రియా కనుగొన్నారు. బుద్ధుని శరీరధాతువు భట్టిప్రోలు లోని మహాచైత్యం మధ్యలో దొరికింది.

బుద్ధుని ఈ ధాతుపేటికకు చుట్టూరా మనకు లిపి అక్షరాలు కనిపిస్తాయి. కొందరు భాషాశాస్త్రవేత్తల ప్రకారం క్రీస్తు పూర్వం మూడవశతాబ్ది నాటికి మౌర్య బ్రాహ్మీ లిపి నుండి ఒక లిపి విడివడి భట్టిప్రోలు చేరిందట. భట్టిప్రోలు లిపిలో 23 గుర్తులు ఉన్నాయి. ఇందులో “గ” మరియు “స” అక్షరాలు ఉత్తర భారత బ్రాహ్మీ లిపిని పోలి ఉన్నప్పటికీ, మిగతా అక్షరాలు భిన్నంగా ఉండటం వలన ఈ లిపిని బ్రాహ్మీ లిపికి దక్షిణ భారత రూపాంతరమని చరిత్రకారులు, భాషావేత్తలు నమ్ముతారు. భట్టిప్రోలు స్తూపంలో మొత్తం తొమ్మిది శాసనాలు ప్రాకృత భాషలో భట్టిప్రోలు లిపిలో రాసినవి లభ్యమయ్యాయి. పదవ శాసనం ఉత్తర భారత మౌర్య బ్రాహ్మీకి దాదాపు సమానంగా ఉన్న అక్షరాలు కలిగినది కూడా లభ్యమయింది. భట్టిప్రోలు లిపి క్రమంలో తమిళ గ్రంథ లిపికి మాతృకగా కనిపిస్తుంది. లిపి పరిణామక్రమంలో నేరుగా ఎలాంటి లంకె దొరక్కపోయినా అతిప్రాచీన తమిళ బ్రాహ్మీ కన్నా భట్టిప్రోలు లిపి పురాతనమైనది.

చాలా మంది చరిత్రకారుల ప్రకారం భట్టిప్రోలు లిపి తరువాతి కాలంలో కదంబ లిపిగా పరిణామం చెంది. ఆ కదంబ లిపి నుంచి నేటి తెలుగు-కన్నడ లిపులు పుట్టుకొచ్చాయి.

మరిన్ని వివరాలు వచ్చే సంచికలో...

మాతృభాష ఆ  భాషీయుడి సంప్రదాయ, సంస్కార మూలాల్ని నిత్యం తడుపుతూ, శుభ్రపరుస్తూ నవనవోన్మేషంగా పల్లవింపజేసే అంతఃస్రోతస్విని. అది జలజలా నిత్యం పారుతుండకపోతే ఆ భాషీయుడి జీవనం శుష్కించిపోవటమేకాదు, ఏ చిన్న జీవన విషాదానికైనా గజగజవణికి కుప్పకూలుతుంది. అట్లాంటి అంతశ్శక్తినిచ్చే సహజ పౌష్టికాహారం తల్లిభాష! -సి. ధర్మారావు

డా. చింతకుంట శివారెడ్డి
94408 59872

# రాయలసీమ-వ్యవసాయానికి సంబంధించిన పదాలు

**రా**యలసీమ వ్యవసాయ నేపథ్యానికి చెందిన ప్రాంతం. ముంగారు పంటలు పండించే సారవంతమైన నేలలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అరటి, బత్తాయి, నిమ్మ, మామిడి వంటి తోటలు కూడా అధికంగానే కనబడతాయి. బెంగుళూరు ప్రాంతానికి ఎక్కువగా ఎగుమతి అయ్యే 'తమలపాకు' కూడా రాయలసీమలోని కడప ప్రాంతంలో పండిస్తారు. ఈస్ట్ ఇండియా ఉద్యోగిగా కడపకు వచ్చిన సి.పి.బ్రౌన్ కడపలోని ఎర్రముక్కపల్లెలో ద్రాక్షను పండించినట్లు బ్రౌన్ లేఖలు ద్వారా మనకు తెలుస్తోంది.

ఒకప్పుడు ముంగారు తోటలు పండించే ఈ ప్రాంతం కరువు రక్కసిని ఎదుర్కొనలేక దానిముందు మోకరిల్లిపోయింది, పోతూవుంది కూడా. ఎక్కడ చూసినా బీటలు వారిన నేలలు, మోడైన చెట్లు నేడు రాయలసీమలో దర్శనమిస్తున్నాయి. భవిష్యత్తు తరాలవారికి వ్యవసాయమన్నా, వ్యవసాయానికి వినియోగించే వస్తువులపై ఏమాత్రం అవగాహన ఉండదు అనడంలో అతిశయోక్తి లేదు. ఇటువంటి తరుణంలో వ్యవసాయానికి సంబంధించిన వస్తువులను, ఇతర పదాలను సేకరించి, వాటిని వ్యవసాయం చేసే సమయంలో ఏవిధంగా రైతులు వినియోగిస్తున్నారో వివరిస్తూ ఈ వ్యాసం ద్వారా మీకు తెలియజేస్తున్నాను.

**అక్కిలికట్టె** - పొడవాటి బొంగుకర్రకు పైన రంధ్రం ఉన్న వెడల్పాటి చెక్క అమర్చబడివుంటుంది. విత్తనం విత్తే సమయంలో చేనులో అక్కడక్కడ ఒక సాలు కంది విత్తడానికి ఉపయోగించే కట్టె.

**అచ్చుగట్టె** - పొడవాటి వెదురుకట్టెకు చివరిలో ఒక ఇనుపరేకును రెండడుగుల వెడల్పుతో అమర్చిన సాధనం. ఈ అచ్చుగట్టెను వేరుశెనగ విత్తిన తరువాత మట్టిని ఎత్తుగా వేయడానికి ఉపయోగిస్తారు.

**అరక** - బండికి ముందు వైపుకు బరువు ఎక్కువగా ఉంటే, అరకగా ఉంది కొంచెం వెనుకకు కూర్చోండి రా! అని అంటుంటారు.

**ఆమదాలమేక** -ఒకేసారి రెండు పిల్లల్ని ఈనే మేకను ఆమదాల మేక అని పిలుస్తారు.

**ఆయకం** - కౌదువపెట్టడం. ఆయప్ప భూమంతా ఆయకానికి పెట్టి పిళ్ళ పెండ్లిజేసిండు

**ఇరుకారు - రెండుకార్లు** సంవత్సరానికి రెండు పంటలు వేస్తే 'ఇరుకారు' అని, మూడు పంటలు వేస్తే 'ముంగారు' అని పిలుస్తారు.

**ఇరుసాలు** -భూమి మొదటగా నిలువుగా దున్నిన తరువాత తిరిగి మళ్లీ అడ్డంగా దున్నడాన్ని ఇరుసాలు దున్నడం అని అంటారు.

**ఈతపులి** -పొడవాటి కర్రకు లిక్కి తగిలించిన సాధనం. దీనినే కొన్ని ప్రాంతాల్లో దోటి అని కూడా పిలుస్తారు. వేరుశెనగ కట్టెను వామి వేసిన తరువాత దాని నుండి వేరుచేయడానికి ఉపయోగిస్తారు.

**ఉద్ది** -మోటారు పంపు నుండి నీరు బయటపడినప్పుడు అది చెదిరిపోకుండా ఏర్పాటు చేసిన కాలువ. ఇది పరిమాణంలో పెద్దదిగా ఉంటుంది. పంపు నుండి వచ్చే నీటి తాకిడికి తట్టుకునేలా ఎత్తైన మట్టితో ఏర్పాటుచేస్తారు. దీని నుండి చిన్నకాలువలు వేరుగా పొలంలోకి వెళ్లేలాగా ఉంటాయి.

**ఎండుగడ్డివామి** -వరి కోసిన తరువాత ఆ ఎండిన గడ్డిని వామిలాగా ఎత్తుగా వేస్తారు. దీనిని పశువులకు మేతగా ఉపయోగిస్తారు.

**ఎగమేపడం** -పొలం దున్నే సమయంలో ఎద్దులు అలసిపోతే వాటిని కాసేపు మేయడానికి అలా వదిలేస్తారు. ఈ ప్రక్రియనే ఎగమేపడం అని పిలుస్తారు.

**ఎగసేపడం** - కొన్ని గేదెలు వాటి దూడలపై ఉన్న మమకారంతో పాలు పితికేవాళ్ళకు పొదుగులోని పూర్తి పాలు ఇవ్వకుండా కొన్నిటిని దాచుకొంటాయి. దూడ పాలను తాగడానికి వచ్చినప్పుడు మాత్రమే వాటిని తిరిగి వదులుతుంది. ఇలా చేసేదానిని 'ఎగసేపడం' అని అంటారు.

**ఏగిలి** - దున్నడానికి వీలుగా సిద్ధంగా ఉన్న భూమి. భూమి బాగా ఏగిలికి వచ్చింది. ఇంక సేద్యం చెయ్యాలి.

**కల్లం** -ధాన్యాన్ని ఎండపెట్టడానికి, చెనెక్కట్టెను వాములుగా వేయడానికి ఉపయోగించే ప్రదేశం.

**కసాలు** -దొరకడంలో ఇబ్బంది. ఉన్నట్లుండి ఒక్కసారి వర్షం పడడంతో అందరికీ కాండ్లు అవసరమయ్యాయి. దీంతో కాడి దొరకాలంటేనే పెద్ద కసాలుగా ఉంది.

**కాడిమాను** -ఎద్దులను జతగా కాడి కట్టడానికి ఉపయోగించే పొడవాటి కర్ర. దీనిని ఎద్దుల మూపురాలపై ఉంచుతారు.

**కయ్య** - పొలంలోని ఒక భాగం. ఆ కయ్యలో కొంచెం గడ్డి ఎక్కువగా పడిందిరా.

**కుని** - చిన్నపాటి మలుపులు ఈ చేన్లో ఆ మూల కొంచెం కుని వచ్చాది. అందుకే ఈ పక్కనుంచి దున్నుతే సరిపోతుంది.

**కువ్వ** - ఎత్తుగా వేసిన ధాన్యం. ఆ కాయలన్నింటిని కువ్వగా తోయండి రా.

**కోడె** - ఒక రకమైన ఎద్దు జాతి; యవ్వనంలో ఉన్న ఎద్దు ఆ కోడెలు గొప్ప జాతి కోడెలుగా ఉండాయి రా!

**కోర్నకువేసినాడు** - దున్నేటప్పుడుగానీ, విత్తనం వేసినప్పుడు గానీ మొదటగా దున్నడం ఆరంభించినప్పుడు ఒకవైపు గట్టునుండి మరొక వైపు గట్టుకు క్రమం తప్పకుండా నిటారుగా దున్నుతారు. తరువాత దానిని ఆనుకుని దున్నుకుంటూ వస్తారు. ఇలా మొదటగా దున్నినప్పుడు కోర్నకువేసినాడు అని పిలుస్తారు.

**కోలె** - వరి, మొక్కజొన్న వంటి పంటలు కోయగా అడుగు భాగంలో మిగిలిన కర్రలను కోలెలు అని పిలుస్తారు. మడిలో కోలెలుండాయి. జాగ్రత్తగా నడువు బాబు, లేకుంటే గుచ్చుకుంటాయి.

**గంజరం** - పశువులు వేసిన ఉచ్చను గంజరం అని పిలుస్తారు.

దీనినే కొన్ని ప్రాంతాల్లో గంజు అని కూడా పిలుస్తారు.

**గడ్డపోవడం–** దున్నేటప్పుడు సాళ్ళు అనుకుని దున్నడం వల్ల భూమి సేద్యం బాగా అవుతుంది. అనుకొని కాకుండా దూరంగా దున్నితే భూమి అలాగే ఉంటుంది. అలా దున్నకుండా వదిలేసిన భూమిని గడ్డపోవడం అని పిలుస్తారు.

**గరికనట్టు** – పొలంలో పెరిగే ఒకరకమైన గడ్డి. ఇది ఒకే చోట అల్లుకొని వుంటుంది. దీని వేర్లు చాలా బలంగా ఉంటాయి. గరికనట్టు తొలగించాలంటే మడకను ప్రత్యేకంగా భూమిలోపలకు వెళ్లేలా చూడాలి.

**గరుగు** – రాళ్ళతో కూడుకొని ఉన్న భూమిని గరుగునేల అని పిలుస్తారు. ఈ గరుగులో గుంటక పాయాలంటే చాలా ఇబ్బంది రా అని ప్రయోగం.

**గాడిపొట్న** – ఎద్దులను, గేదెలను కట్టేసే స్థలం. ఈ గాట్లోనే వాటికి గడ్డిని వేస్తుంటారు. గాదె – వెదురుకర్రలతో చేసిన పొడవాటి ఆకారం. (ఇది దాదాపు 6 అడుగుల ఎత్తు ఉంటుంది) గాదెలో ఒడ్లు వేసి పైన వరిగడ్డి కప్పి పేడతో అలికేవారు. ఇలా చేయడం వల్ల గాదెలోపలికి ఎలుకలు వంటివి పోకుండా ఉంటాయి. ఈ విధంగా ఒడ్లను ఎక్కువ కాలంపాటు నిల్వ ఉంచేవారు.

**గానిగసెక్క** –వేరుశెనగ పప్పును గానిగలో ఆడించిన తరువాత నూనె వేరుగా వచ్చి, మిగిలిన పిప్పి చెక్కలాగా మారి వేరుగా వస్తుంది. ఇలా వేరుచేయబడిన చెక్కనే గానిగసెక్క అని పిలుస్తారు. దీనిని ఎద్దులకు కుడితిలో కలిపి తినిపిస్తారు.

**గిత్త** – కోడెదూడ. ఆ గిత్తలు బాగా ఉన్నాయి రా! అని పిలుస్తారు.

**గుంటక** – పొడవాటి కర్ర (దీనినే దిండుకర్ర అని కూడా పిలుస్తారు)కు చివరిభాగంలో బ్లేడులాంటి ఇనుపవస్తువును ఏర్పాటుచేస్తారు. విత్తనం విత్తిన తరువాత దీని సహాయంతో భూమిని చదునుగా చేస్తూ, పైనున్న గడ్డి వేర్లతో సహా బయటపడేలా చేయవచ్చు.

**గుదెకట్టె** –కొన్ని ఎనుములు దొంగకు పోతూవుంటాయి అని అంటారు. అంటే పొలాలపై పడి మేస్తుంటాయి. అటువంటి గేదెల మెడకు కాలికి కలిపి ఒకతాడుతో పొడవాటి కర్రను కడతారు. దీనిని కట్టడం వల్ల అది ఎక్కువ దూరం, ఎక్కువవేగంగా ముందుకు పోలేదు. ఇలా కట్టిన కట్టెను 'గుదెకట్టె' అని పిలుస్తారు.

**గులిగెలు** – పొలంలో వేసే చిన్న చిన్న వుండలు.

వరిమడిలో పురుగులు చావడానికి గులిగెలు చల్లుతారు. పొలంలోకి పశువులు వస్తూవుంటే అవి రాకుండా ఉండడానికి గట్టు మీద ఈ గులిగలను ఉంచుతారు. ఇవి చాలా చెడు వాసనను కలిగి వుండడంవల్ల ఆ వాసనకు రాకుండా ఉంటాయి.

**గూటం** –పొడవాటి లావుగా వుండే కర్ర. ఈ గూటానికి మేకల్నిగానీ, ఎనుము దూడల్నిగానీ కడతారు.

**గెట్టెకాలు** – అరికాలి అడుగుభాగం. ఆ ఎద్దుకు గట్టెకాల్లో ముల్లేమో గుచ్చుకున్నట్లుంది చూడండిరా, కుంటుతోంది పాపం.

**గెనం** – పెద్దగా ఉన్న పొలాన్ని రెండుగా వేరుచేసేలా మట్టితో చేసిన ఎత్తైన నిర్మాణం.

**గొడ్లు** – పశువులు. ఆ గొడ్లను గాటిపొట్న కట్టేయండి.

**గొర్రు** – విత్తనాలు భూమిలో పడేదానికి ఉపయోగించే చెక్కలతో చేసిన పరికరం.

గొర్రుకు చివరభాగంలో మడకల్లాంటి సూది కర్రలుంటాయి. ఇవి భూమిలోకి చొచ్చుకొని పోతూంటాయి. వీటికి అనుకొని నాలుగు పొడవాటి ఇనుప బొంగులు ఏర్పాటు చేసివుంటారు. ఈ నాలుగు బొంగులను కలుపుతూ పూన నాలుగు బొరకలున్న జలిగం ఏర్పాటుచేయబడివుంటుంది. ఈ మొత్తం ఆకారాన్ని గొర్రు అని పిలుస్తారు.

**గోర్లాకు** – పొలంలో పెరిగే ఒక రకమైన గడ్డి. దీని వేర్లు చాలా బలహీనంగా ఉంటాయి.

**మారు** – కాడిని ఒక వైపు నుండి ఇంకొక వైపుకు సక్కంగ తోలడాన్ని మారువేయడం అని పిలుస్తారు.

**చాలకోల** – ఎద్దులను అదిలించడానికి(కొట్టడానికి) అల్లకం తాడు కట్టి ఉపయోగించే కర్ర. ఒక పొడవాటి కర్రకు చివరలో రెండు తాళ్ళను తగిలించి వుంచుతారు. బండితోలే సమయంలో ఆ కర్రను ఎద్దులపై విదిలించినప్పుడు దానికి ఉన్న ఆ తాళ్ళు ఎద్దులకు

తగులుతుంటాయి.

**చెక్కుడు పార** – సగం పార. పారకు ముందు భాగం బాగా అరిగిన తరువాత దానిని మడిలో వరి నాటేటప్పుడు గెనాలను చెక్కడానికి ఉపయోగిస్తారు.

**చొప్పవద్దేయడం** –జొన్నసేను కోసిన తరువాత ఆ దంట్లను(మొక్కలను) ఒకదానిపై మరొకటి వేయడాన్ని 'చొప్ప వద్దేయడం' అని పిలుస్తారు.

**జలిగెం** – గొర్రుకు పైభాగంలో ఏర్పాటు చేసిన చెక్క. ఇది నాలుగు రంధ్రాలు కలిగివుండి ఇనుపబొంగులకు ఆనుకొని వుంటాయి. ఇది పైభాగంలో గుంతలాగా వుంటుంది. ఆ గుంతలో విత్తనాలు వేయడం ద్వారా అవి ఆ రంధ్రాల గుండా ఇనుపబొంగులలోకి వెళ్ళి భూమిలోకి పడిపోతాయి. ఈ ప్రక్రియనంతటినీ 'విత్తనం విత్తడం' అని అంటారు.

**జొన్నేగిలి** – ఏగిలి అంటే విత్తడానికి సిద్ధంగా ఉన్న భూమి అని అర్థం. జొన్న వేయడానికి సిద్ధంగా ఉన్న భూమిని జొన్నేగిలి అని పిలుస్తారు.

**జొల్ల** – పొట్టును వామి నుండి వేరుచేసిన తరువాత దానిని ఎత్తుకెళ్ళి గాట్లో వేయడానికి ఉపయోగించే పెద్దగంప.

**తంగెడుచెట్లు** – పొలం గట్టుపై పెరిగే చెట్లు. వేంపల్లెకు సమీపంలో వున్న ఒక ప్రాంతంలో ఈ చెట్లు ఎక్కువగా వుండడం వల్ల పూర్వం ఆ ప్రాంతంలో పల్లె ఏర్పాటు జరిగి ఆ పల్లెకు 'తంగెడుపల్లె' అని పేరుపెట్టారు.

**తలుగు** –దూడలను కట్టడానికి ఉపయోగించే చిన్న తాడు.

**తల్లేరుకట్టడం** –ఎక్కువ బరువును బండిపై ఉంచి తీసుకెళ్తున్నప్పుడు ఎద్దులకు బరువు ఎక్కువై ముందుకు కదలవు. అటువంటి సమయంలో ఆ ఎద్దులకు సహాయంగా మరొక కాడిని వాటికి ఎదురుగా లాగేలా కడతారు. ఈ ప్రక్రియనే 'తల్లేరు కట్టడం' అని అంటారు.

**తారిపోతాయి** – పొద్దాంకులు సేద్యానికి పోతాండే ఆ ఎద్దులు తారిపోతాయిరా అబ్బీ తీటగందరాకు – పొలంలో పెరిగే చిన్న మొక్క. దీని ఆకు తగిలిందంటే ఆ ప్రాంతం చాలా నవ్వగా ఉంటుంది. చిన్న

పిల్లలు వారి అయ్యవారిమీద కోపం వచ్చినప్పుడు ఈ ఆకు కోసుకెళ్ళి ఆ పంతులుకు తగిలేలా చేస్తుంటారు.

**తువ్వ** –ఇసుక ఎక్కువగా ఉన్న భూమి. పాపాగ్ని నది ప్రవాహం ఆనుకొని వుండడంవల్ల వేంపల్లెకు ప్రక్కగా ఉన్న భూమి అంతా ఇసుకమయమైన తువ్వభూములే కనిపిస్తాయి. ఈ కారణంచేత చివరికి అక్కడే ఆనుకొని వున్న ఒక పల్లెకు 'తువ్వపల్లె' అని పేరు రావడం విశేషం.

**పరిమాణ కొలతలు:**

తూము = 25 సేర్లు

యిద్దుము = రెండు తూములు

నల్తుము = నాలుగు తూములు

ఏదుము = అయిదు తూములు

పందుము = పదితూములు

**పుట్టి గింజలు** – 20 తూముల గింజలు

**తొలికె** –పొలంలో చెట్లమధ్యలో ఉన్న గడ్డిని తీసివేయడానికి ఉపయోగించే చిన్న వస్తువు.

**దంట్లు** – జొన్న వంటి పంట పండిన తరువాత వాటికి పైనున్న జొన్న కంకులను (గింజల గుత్తులను) కోసి మిగిలిన మొక్కను అడుగుకు కోసివేసి వాటిని పశువులకు మేపుగా వేస్తారు. అలా మిగిలిన భాగాలను దంట్లు అని పిలుస్తారు.

**దాపటెద్దు** –కాడికి ఎడమవైపు కట్టిన ఎద్దును దాపటెద్దు అని పిలుస్తారు.

వీటిని అదే స్థానంలో కట్టకపోతే ఒక్క అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి కానరాదు. కాబట్టి వాటి గురించి తెలిసిన వ్యక్తి మాత్రమే కాడి కట్టడానికి సిద్ధంగా వుంటారు.

**దేశమెద్దులు** – కడపజిల్లాలో ఎద్దులను రెండు రకాలుగా పిలుస్తారు. కొమ్ములు చిన్నవిగా ఉండి బలంగా ఉండే ఎద్దులను 'కోడెలు' అని పిలుస్తారు. అలా కాకుండా ఎత్తైన కొమ్ములు కలిగివుండి శరీరం బాగా పొడవుగా ఉంటే అటువంటి ఎద్దులను 'దేశమెద్దులు' అని పిలుస్తారు. ఇవి గొప్ప జాతికి చెందినవిగా భావిస్తారు.

**దోకడం** – మట్టిని ముందుకు లాక్కోవడం పారకలతో దోకితే గడ్డిపోతుంది

**దోటి** – పొడవాటి కర్రకు చివరిలో వంకరగా ఉన్న కత్తిని తగిలించి ఉంటారు. దీనినే దోటి అని పిలుస్తారు. ఎత్తులో ఉన్న కాయల్ని కోయడానికి, వామిని దుస్సడానికి దీనిని ఉపయోగిస్తారు.

**నగలు** –కాడి కట్టిన తరువాత కాడిమాను నుండి గొర్రుకుగానీ, గుంటకకు గానీ అనుసంధానంగా ఏర్పాటుచేసిన పొడవాటి రెండు కర్రలు

**నాడాలు** – ఎద్దు అరికాలికి వేసే ఇనుప బిళ్ళలు. ఎద్దుల అరికాళ్లు సున్నితంగా ఉండడం చేత అవి రోడ్డుపైన పోయేటప్పుడు గానీ, కంపలున్నచోట్ల పోయేటప్పుడు వాటి అరికాలికి దెబ్బ ఎక్కువగా తగులుతుంటుంది. వాటి అరికాళ్లు గట్టిగా ఉండడం కోసం వాటికి ఇనుప నాడాలను చీలల సహాయంతో కొడతారు. వీటిని కొన్ని ప్రాంతాల్లో 'లాడాలు' అని కూడా పిలుస్తారు.

**నాసులు** – వేరుశెనగ కాయలనుండి విత్తనాలను వేరుచేసి అందులోనూ లావుగా వుండే విత్తనాలను మాత్రమే భూమిలో విత్తడానికి ఉపయోగిస్తారు. ఆ పప్పుల్లో సన్నగా ఉన్న 'పప్పుల్ని' నాసులు అని పిలుస్తారు. విత్తనం పగిలి రెండుగా వేరైతే వాడిని బ్యాళ్ళు అని పిలుస్తారు.

**నెరివాళ్ళకట్టె** – పొడవుగా ఉన్న కర్రకు చివర జానెడు పొడవుతో ప్రక్కకు వంగిన పుల్లలాంటి ఆకారం ఉంటుంది. అలా ఉన్న కట్టెను నెరివాళ్ళకట్టె అని పిలుస్తారు. ఈ కట్టెతో చెనిక్కాయ కట్టెను క్రింది పాటు పైకి మార్చడానికి(పచ్చికట్టెను ఆరవేయడానికి) ఉపయోగిస్తారు.

**నొగ** – బండి నిర్మాణంలో కాడిమానుకు వెనుక భాగంలో కూర్చోడానికి వీలుగా తయారుచేసిన వెడల్పాటి చెక్క. నొగల్లో బాగా కూర్చో, ల్యాకుంటే పడిపోతావ్!

**పల్లదంతె** – కర్రల మధ్య సందును ఏర్పాటుచేసి తయారుచేసిన పనిముట్టు పల్లదంతెతో కుప్పగా ఉన్న చెనిక్కాయల్ని దూరంగా లాగడానికి ఉపయోగిస్తారు

**పలుపుతాడు** – దూడలను కట్టేసే తాడు. గేదెలను, వాటి దూడలను కట్టివేయడానికి వీలుగా తయారుచేసిన తాడు. దీనినే తులుగు అని కూడా పిలుస్తారు.

**పట్టెన్లు** –కాడిమాను ఎద్దుల మూపురాలపై ఉంచిన తరువాత అది జారిపోకుండా వెడల్పాటి చర్మతొడుగుతో తయారుచేస్తారు.

**పడ్డలు** – గేదె దూడలు పెద్దవైన తరువాత(పెద్ద దూడలు) వాటిని పడ్డలు అని పిలుస్తారు.

**పడుగు** –వరికోసిన తరువాత వరికర్రలను ఒకదానిపై ఒకటి ఉండేలా ఎత్తుగా పరుస్తారు. దీనినే వరిపడుగు అని పిలుస్తారు.

**పదును** – విత్తనం విత్తడానికి, మొలకెత్తేదానికి కావలసినంత వర్షం పడడం. మాంచి పదునైంది. ఇంక చెనిక్కాయలు విత్తుకోవచ్చు.

**పలాస్తరం** –జీవనాధారం కోసం ఒక ఊరి నుండి మరొక ఊరికి వ్యవసాయ పనులను చేసుకోడానికి వెళ్లడం.

**పలుగు** – గుంటకకు ముందువైపున ఉండే ఇనుప వస్తువు పలుగు మొద్దుబోయింది, సరిపిచ్చుకరాకూడదా

**పాయడం** – గడ్డిని వేరు చేయడం. గుంటక పాసి గడ్డి ఎదిరిచ్చి రాండి!

**పారకల** – గడ్డిని దోకగానికి ఉపయోగించే పనిముట్టు. గెన్యానికుండే గడ్డి పారకలతో అయితే బాగా వచ్చాది చూడమ్మా!

**పికాసి** – ఒక వైపు సూదిగానూ మరోవైపు మందంగా తయారుచేసిన ఇనుప పరికరం. సూదిగా ఉన్నవైపున భూమిని త్రవ్వడానికి, మందంగా ఉన్న వైపు భూమి నుండి చెట్టును వేరుచేయడానికి ఉపయోగిస్తారు.

**పుటికె** –ధాన్యాన్ని ఎత్తి సంచులలో వేయడానికి ఉపయోగించి వెదురుకర్రలతో చేసిన నిర్మాణం.

**పెంటినారు** –వరి వేసే ముందుగా నారుకోసం ఒడ్లను భూమిలో వేస్తారు. అవి మొక్కలుగా మారి కొంచెం పెరిగిన తరువాత అక్కడనుండి వాటిని పీకేసి వేరొక పొలంలో నాటుతారు. ఇలా పెరిగిన నారులో కొంత నారు పెరుగుదలకు నోచుకోకుండా ఉంటుంది. అలా ఉన్న

నారును పెంటినారు అని పిలుస్తారు.

**పెయ్యదూడ** –అప్పుడే పుట్టిన దూడను పెయ్యదూడ అని పిలుస్తారు. ఆ పెయ్యదూడను పాలకు వదలండి రా.

**పెల్లమాను** – భూమని దున్నిన తరువాత బయటపడిన లావుపాటి పెల్లలను చదునుగా చేయడానికి ఉపయోగిస్తారు. ఈసారి దుక్కిలో గడ్డలు ఎక్కువగా వచ్చినాయి. ఒకసారి పెల్లమాను తోలాల్సిందే.

**పొట్టువామి –** వేరుశెనగ చెట్లనుండి కాయలువేరుచేసి మిగిలిన కట్టెను కుప్పగా వేసినదానిని పొట్టువామి అంటారు.

**పొలమూ పుట్ర** – స్థిరాస్తి అనే అర్థంలో వాడతారు. పెండ్లిసంబంధం చూసే సమయంలో, వీడికి ఉద్యోగం ఎలాగూ లేదు, కనీసం పొలమూ పుట్రైనా ఉందా లేదా?

**పొలిచల్లడం** – ఆదివారం అమావాస్య వచ్చినప్పుడు కోడినిగానీ, మేకల్నిగానీ కోసి వాటి నెత్తురుతో పొలానికి పొలిచల్లుతుంటారు. దీనివల్ల పొలానికి ఎటువంటి నష్టం కలగకుండా బాగా పండుతుందని నమ్మకం.

**పైరు నేలపట్టింది** – పంట పెరుగుదల లేకుండా ఆగిపోవడం. ఈ తూరి వానల్లేక పైరు పైరంతా నేలపట్టింది రా

**బీడు భూమి** – ఏ పొలం వేయకుండా వదిలేసిన భూమి. ఈతూరి వానల్లేక ఎక్కడ చూసిన భూమి బీడుగానే కనబడతావుంది.

**బెల్లపాకుచెట్లు** – పొలానికి గట్టుపైన పెరిగే చెట్లు. వీటి వేర్లు చాలా బలంగా ఉంటాయి.

**బొందుపెరకడం** – వేరుశెనగ పంట పొలంలో వేసిన తరువాత అది పెరిగి పెద్దదయి చివరిలో పంట చేతికొచ్చే సమయానికి వర్షం పడక కాయలు లేకుండా కట్టె మాత్రమే పెరిగితే ఆ కట్టెను బొందు అంటారు. పశువులకు మేతకన్నా ఉంటుందని చివరికి ఆ కాయలులేని కట్టెను పెరకడాన్ని బొందుపెరకడం అని అంటారు.

**మడక** – భూమిని దున్నడానికి ఉపయోగించే సాధనం

దీనినే ఇతర ప్రాంతాల్లో నాగలి అని కూడా పిలుస్తారు.

**మడక్కారు** – మడకంతా చెక్కతో తయారు చేయబడి వుంటుంది. దాని చివరిభాగం(భూమిలోకి నాగలి దిగే భాగం)లో వెడల్పుగా ఒక ఇనుప ముక్క ఉంటుంది. ఆ ఇనుపముక్కనే మడక్కారు అని పిలుస్తారు.

**మడవ** – తోటలకు కాలువల ద్వారా అవసరమైన చోట అడ్డుకట్ట కడ్తూ నీరు కట్టడం. నీళ్లు తగ్గడంవల్ల మడవ సరిగా పారకరావడం లేదు రా

**మడి** – వరి పండించే భూమి. వర్షాధార పంటలు పండే భూమిని చేను అని, నీటి వసతి ఉండి వరి పండే భూమిని మడి అని పిలుస్తారు.

**మడ్డి** – ఎద్దులకు వేసే ఆహారపదార్థం. పగలంతా సేద్యం చేసి అలసిపోయిన ఎద్దులు తిరిగి శక్తిని పొందడంకోసం గానుగచెక్క(చెనిక్కాయ విత్తనాలను గానుగలో ఆడించినప్పుడు నూనె ఒకవైపు పిప్పి గట్టిగా ఉండే రూపం)ను ఉడికించి అందులో కొంత అన్నం వేసి రాత్రివేళలో ఆహారంగా వేస్తారు.

**మాను** – విత్తనం వేసిన తరువాత సాళ్ళను చదునుగా చేయడానికి పెద్ద లావుపాటి కర్రను ఉపయోగిస్తారు. దీనినే 'మాను తోలడం' అని అంటారు.

**మిగ్రు** – పొలంలో ఒకేచోట మట్టి ఎత్తుగా ఉంటే ఆ ప్రాంతాన్ని 'మిగ్రుభూమి' అని పిలుస్తారు. మీదుకట్టడం – రైతు ఇంట్లో ఉండే గేదె తక్కువ కాలంలోనే ఒట్టిపోతే(పాలివ్వకుండా ఆగిపోవడం) తన ఇంటి కులదేవునికి ముక్కు కట్టుకుంటారు. అలా తిరిగి గేదె పాలిస్తే తన ముక్కు తీర్చుకోవడం కోసం మొదటగా వచ్చే పాలను ఇంటి దేవుడికి నైవేద్యంగా ఇవ్వడాన్ని మీదుకట్టడం అని పిలుస్తారు.

**మునం** –ఒక గట్టునుండి మరొక గట్టు వరకు వేరుశెనగ కట్టెను ఒక సారి పెరికితే ఒక మునం ఎక్కినారు అని పిలుస్తారు. ఇలా ఆ కూలీలు ఎన్ని సార్లు ఈ గట్టు నుండి ఆ గట్టుకు చేరుకుంటారో అన్ని మునాలు ఎక్కినారు అని అంటారు.

**మునిగుత్త** – పంట పండకమునుపే(గుత్తకు తీసుకునే సయమం) భూమి కౌలు చెల్లించడం.

**ముల్లుగట్టె** –పొడవాటి సన్న కర్రకు చివరిలో ఒక ఇనుప ముల్లును ఏర్పాటుచేసి వుంటారు. ఎద్దులను అదిలించడానికి దీనిని ఉపయోగిస్తారు.

**మేకమరక** –మేకపిల్లను మేకమరక అని పిలుస్తారు.

**మేడితోక** –మడకకు, గుంటకకు, గొర్రుకు పైభాగంలో ఏర్పాటుచేసిన పొడవాటి కర్ర. దీనిని పట్టుకొని ఎద్దులను అదిలిస్తూ ముందుకు వెళ్తుంటారు.

**మేత** – పశువులకు వేసే గడ్డి. ఆ ఎనుము మొత్తుకుంటాంది. ఆ మేత కొంచెం వెయ్యిరా!

**మొచ్చుగత్తి** –పెద్ద కత్తి. కట్టెలను కొట్టడానికి ఉపయోగించే పొడవాటి కత్తి

**మోకులు** – పగ్గాలు(లావుపాటి తాళ్లు) ఎద్దులను కట్టేయడానికి ఉపయోగించే తాళ్ళు.

**మోపు** – కట్టగా కట్టినవి. వరిగడ్డి మోపు తీసుకొచ్చి ఆ ఎనమలకు వెయ్

**యారముట్లు** – వ్యవసాయానికి ఉపయోగించే పనిముట్లను యారముట్లు అని పిలుస్తారు. యెంట్లు వేయడం – చెనిక్కట్టె వామి వేసిన తరువాత దానిపైన కొంత వరిగడ్డి కప్పుతారు. ఆ వరిగడ్డి గాలికి ఎగిరిపోకుండా, కొంత వరిగడ్డిని తాడులాగా అల్లి, ఆ తాడుకు అటు, ఇటు పెద్ద బరువైన రాళ్ళను కట్టి, ఆ తాళ్లను నీళ్ళతో తడిపి వామికి ఆ వైపు నుండి ఈ వైపుకు వ్రేలాడదీస్తారు. ఈ వరిగడ్డి తాళ్ళనే యెంట్లు అని అంటారు.

**రిక్క** – క్ల్చ, క్ల్చ అని శబ్దంచేస్తూ ఎద్దులను అదిలించడానికి నోటితో చేసే శబ్దం.

**ల్యావ** – బండికి వెనుకవైపు బరువు ఎక్కువగా ఉండడం. బండి ల్యావ లేస్తాంది. కొన్ని మూటలు ముందుకు వేయండి.

**లిక్కి** –గడ్డిని కోసుకోడానికి ఉపయోగించే చిన్నపాటి ఇనుప ఆకారం. దీనినే కొంతమంది గడ్డికొడవలి అని కూడా పిలుస్తారు.

**వడపడం** –పంట పండిన తరువాత దానిని కోసి, కుప్పలువేసి, ధాన్యాన్ని వేరుచేసి, వాటిని సంచులోకి ఎత్తుకొని, బండ్లోవేసి ఇంటికి చేరుస్తారు. ఇలా పంట పండిన తరువాత చేసే పనులన్నిటినీ

**తరువాయి 23వ పుటలో....**

ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

# గిడుగు 'బాలకవిశరణ్యం'- పరిశీలన



*"భారతంలోని, యితర కవుల గ్రంథాలలోకాని, యెన్నో పుటలో, యెన్నో పంక్తిలో, యే అపురూప ప్రయోగంవుందో ఆ వివరణమంతా పంతులుగారి ''బాలకవి శరణ్యం''లో వ్రాయబడే వుంది. పంతులుగారేమాలోచించి ఆపుస్తకానికి "బాలకవి శరణ్యం" అని పెట్టిరోకాని, దానికి పేరు "ప్రౌఢకవిశరణ్యం" అన్నదే సర్వవిధాల తగివుంటుందని నాకు తోచింది"*

–చెళ్ళ పిళ్ళ వేంకట శాస్త్రి

**మా**నవుని జీవితంలో చాలా ప్రధానమైంది భాష. ధారణ శక్తికి భాష అత్యంత ఉపయోగకరం. లిఖితరూపమైన భాష లేకపోతే ఎన్నో ప్రధాన విషయాలు ఎప్పటికప్పుడు మరచిపోవడం జరుగుతుంది. అంతేకాదు మానవుని పనులు ఏవీ  జరగవుకూడా. ఒక్కమాటలో చెప్పాలంటే భాష లేకపోతే మానవుడు ఉన్నతి సాధించలేడు. మానవసమాజపు కార్యకలాపాలన్నింటికీ భాషే మూలసాధనం.

భాష నిరంతరం మారుతుంది. అది అలా మారడం దాని స్వభావం. ప్రాచీనకాలంనుండి ఆయాకాలాల్లో కవులు అందరూ ఆకాలం నాటి వాడుక భాషను వాడుతూ వచ్చారు. అదేవిధంగా నేటి రచయితలు కూడా అందరికీ అర్థమైన, అందరూ మాటలాడుతున్న సరళ, సులభ, సుందరమైన శిష్ట భాషనే వాడుతున్నారు. వ్యావహారిక భాషలో గ్రంథాలు వస్తే, భాషకు ఎంతో ప్రయోజనం జరుగుతుంది. రాతభాషకూ, నోటిమాటకూ తేడా లేకుండా ఒకే రకంగా భాష వుండాలి. అలా భాష వుంటేనే సమాజం బాగుపడుతుంది. అసలు విషయం ఏమంటే ముఖ్యంగా అక్షరాస్యత గణనీయంగా తగ్గుతుంది. ఈ విషయాన్ని గ్రాంథిక భాషా వాదులు తెలుసుకోలేకపోయారు. అంటే కనీస ప్రాథమిక జ్ఞానం కూడా గ్రాంథిక భాషావాదులకు లేదన్నమాట. ఇది చాలా విచారించదగ్గ విషయం. గ్రాంథిక వాదుల అజ్ఞానానికి నిదర్శనం ఇది. మొండిగా, తలతిక్కగా, అజ్ఞానంగా ఆలోచించి, తెలుగు భాషకు అన్యాయం చేశారు గ్రాంథిక భాషావాదులు. ఒక రకంగా చెప్పాలంటే "తెలుగు భాషా చరిత్ర"లో, భాషాద్రోహులుగా గ్రాంథిక భాషా వాదుల్ని మనం పరిగణించవచ్చు. తెలుగు భాషకు అంత కీడు చేశారు గ్రాంథిక వాదులు. క్షమించరాని తప్పుచేశారు వీళ్ళు.

ప్రాచీన కాలంనుంచి ఆయా కాలాల్లో వ్యావహారిక భాషవుంది. లోతుగా పరిశోధన చేసే వారికి ఈ విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. వాడుక భాష స్థానంలో గ్రాంథిక భాషను బలవంతంగా రుద్దాలని గ్రాంథిక వాదులు కంకణం కట్టుకున్నారు. దానికోసం ఎన్నో కుట్రలు, పన్నాగాలు పన్నారు. చేయరాని పనులు ఎన్నో చేశారు. అందుకే వారు భాషాభిమానులకు దూరమయ్యారు. ప్రజల ముందు, గ్రాంథిక భాషావాదులు భాషా దోషులుగా మిగిలిపోయారు. ప్రాచీన తాళపత్ర గ్రంథాల్లోని లౌకిక భాషను, కావాలని మార్పులు చేసి, గ్రాంథికీకరణ చేశారు గ్రాంథిక భాషావాదులు. కావాలని, లేనిపోని దొంగ సృష్టిచేసి, భాషాదోషానికి పాల్పడ్డారు గ్రాంథిక భాషావాదులు. భాషకు చేసిన అపకారాన్ని, అన్యాయాన్ని అక్రమాల్ని, అనర్థాల్ని, ఎత్తి చూపారు గిడుగు. చాలా తీవ్రాతి తీవ్రంగా విమర్శించారు.

ప్రాచీనులు రాసిన పురాణాలు, లక్షణ గ్రంథాలు, వ్యాఖ్యానాలు, టీకలు, వివిధ శాస్త్ర గ్రంథాలు, దేశచరిత్రలు, జానపద వృత్తాంతాలు, వార్తా పత్రికలు, శాసనాలు, కథలు, బడిపుస్తకాలు మొదలైన అన్ని రచనల్లోనూ, వచనం వ్యావహారిక భాషలో వున్నదని గిడుగు ఉదాహరణలతో నిరూపించారు. ప్రపంచంలో ఏభాషలోనైనా ఇలాగే జరుగుతుందని నిజమైన వచనరచనా సంప్రదాయమని గిడుగు తెలియజేశారు.

కేవలం గ్రాంథిక భాషలో రచనలు చేయడం కష్టం. అది ఎవరి తరమూ కాదు. తప్పనిసరిగా అందులో వ్యావహారిక భాష చోటుచేసుకుంటుంది. ఈ జ్ఞానం కూడా గ్రాంథిక భాషావాదులకు లేదు. రాదుకూడా మన వ్యాకరణాలు అసమగ్రంగానూ, పరస్పర విరుద్ధంగానూవున్నాయి. ఏ ఇద్దరూ ఒకే భాషకు వ్యాకరణం రాసినా, ఇద్దరి వ్యాకరణాలు ఒకే రకంగా లేవు. అందువల్ల ఏదితప్పు, ఏది ఒప్పు, అని నిర్ధారించడం చాలా కష్టం. అందువల్లే పూర్తిగా గ్రాంథిక భాషలో ఒక గ్రంథం కూడా రాలేదు. కాబట్టి గ్రాంథిక భాషా వాదమే నూటికి నూరు పాళ్ళు తప్పు. గ్రాంథిక భాషావాదులు ప్రాచీన కవుల కావ్యాల్ని లోతుగా పరిశీలించలేకపోయారు.  వాళ్ళకు అంత జ్ఞానం లేదు. పైపైనే చూశారు. వారికి అంత సత్తా లేదు. అంత ప్రతిభ కూడా లేదు. ఆ కారణంగా పండితులు, వ్యాకరణ కర్తలు, పద కోశకారులు, తప్పుగా భావించారు. అదేపనిగా లక్షణ విరుద్ధాలయినవి గ్రామ్యాలని నిరూపించారు. కవుల ప్రయోగాలే మనకు పరమ ప్రామాణికం, కాబట్టి ఇతరులు చెప్పిన వాటిని పరిగణనలోనికి తీసుకోకూడదు. ఆ పద్ధతి తప్పుకూడా. ప్రాచీన కాలంలో పండితుల

కోసం, పండితులచేత, పండితుల గురించే సాహిత్యం వచ్చింది. ఈ విషయం మన అందరికీ తెలిసిందే. కేవలం కొంతమంది కోసం, ముఖ్యంగా వాళ్ళ స్వార్థం కోసం సాహిత్యం వచ్చింది. ఈ విషయాన్ని అర్థంచేసుకున్నాడు గిడుగు. ప్రజల కోసం ప్రజల భాషలో ప్రజలగూర్చి ప్రజాసాహిత్యం రావాలి, కావాలి. అందుకే ప్రజా సాహిత్యం రావాలి, కావాలి అన్నారు గిడుగు. అందుకే ప్రజా ఉద్యమంగా భాషోద్యమం నడిపారు గిడుగు. విజయం సాధించారు.

వ్యావహారిక భాషోద్యమానికి సారథ్యం వహించి, గ్రాంథిక భాషావాదుల కళ్ళు తెరిపించారు గిడుగు. సమాజానికీ, భాషకూ ఎంతో మేలు చేశారు. గిడుగు భాష కోసం ఉద్యమం చేసినంతవరకు, సంప్రదాయ పిడిపండితులదే హవా. తప్పుచేసినా, ఒప్పుచెప్పినా, పండితులు గొప్పగా చలామణి అయ్యేవారు. అసలు భాష అంటే ఏమిటి? భాషవల్ల ప్రయోజనాలు ఏమిటి? భాష మారుతుందా? లేదా? భాషా పరిణామం ఏమిటి? మానవ విజ్ఞాన వికాసంలో భాష పాత్ర ఏమిటి? అనే విషయాలపై మన పండితులకు కనీస అవగాహన లేదు. తెలియదు కూడా. పండితుల అజ్ఞానమే గిడుగుకు ఆయుధం అయింది. అదే వ్యావహారిక భాషోద్యమం అయింది.

గ్రాంథిక భాషావాదుల డాంబికాల్ని, గిడుగు బట్టబయలు చేశారు. కొమ్ములు తిరిగిన మహామహా పండితులకే సంస్కృతం సరిగా రాదని ఉదాహరణ పూర్వకంగా విడమర్చి మరీ తెలియజేశారు. అందుకే ప్రముఖ విమర్శకులు డాక్టర్ అక్కిరాజు రమాపతి రావు గారు గిడుగుని గూర్చి ఇలా అన్నారు. “సంస్కృతంలో ఆయన పాండిత్యం ఎంతటిదంటే ఆయన సమకాలీన పండితులలో చాలామందికి సంస్కృతం సరిగా రాదని ఆయన నిరూపించారు. చిన్నయసూరి వంటి గొప్ప వ్యాకరణవేత్తకే, సంస్కృత పరిజ్ఞానం తగినంత కనిపించదని ఆయన ధైర్యంగా చెప్పగలిగారంటే, తక్కినవాళ్ళ ప్రస్తావన ఎందుకు? అప్పకవి భారతమైనా సరిగా చదవకుండా, తెలుగు భాషకు లక్షణ గ్రంథం రచించడానికి పూనుకున్నారని గిడుగువారు ఆక్షేపిచారంటే అందులో వింత ఏముంది.”

లక్షణ గ్రంథం రాసిన అప్పకవి కూడా, సరిగా “భారతం” చదవలేదని ఎద్దేవ చేశారు గిడుగు. తెలుగు భాషకు లక్షణ గ్రంథం రాసిన అప్పకవిని ఆక్షేపించారంటే, మామ్మోలు పండితులు గిడుగుకు ఒకలెక్కా? ఆయన దృష్టిలో అందరూ పరిమిత జ్ఞానం కలవారే. మిడిమిడి జ్ఞానం కలవారే. భాషా నైపుణ్యం తగినంతగా లేనివారే. వీళ్ళందరకూ తగినంత అంటే కావలసినంత పాండిత్యం కానీ, భాషా నైపుణ్యంకానీ, శాస్త్రీయ దృక్పథంకానీ లేవని గిడుగుగారి అభియోగం. అదినిజమని పరిశోధకులు, విమర్శకులు, ఎప్పుడో తేల్చి చెప్పారు.

గిడుగు, సమకాలికుల్లో మహా ఉద్దండ పండితులైన వేదం వెంకటరాయ శాస్త్రి గారి రచనల్లోనూ అటువంటి పండితుల రచనల్లోనూ వందల కొద్ది తప్పులు చూపి, కుప్పగా పోసి పండితలోకానికి చూపించారు. దీనికి ప్రధాన కారణం శాస్త్రిగారికి గ్రాంథిక భాష అంటే ఏమిటో? వాడుక భాష అంటే ఏమిటో? రెండిరటికి తేడా తెలియకపోవడమే అని ఖరాఖండిగా చెప్పారు గిడుగు. “బాలకవి శరణ్యం” లోనూ “ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజం”లోనూ ఉదాహరణ పూర్వకంగా నిరూపించారు.

చిన్నయసూరి “బాల వ్యాకరణం”లోని దోషాల్ని ఎత్తి చూపడం కోసం గిడుగు “బాల కవిశరణ్యం” అనే అద్భుతమైన పరిశోధన గ్రంథాన్ని రాశారు. ఈ గ్రంథంలో గిడుగు ప్రతిభా ప్రజ్ఞాపాటవాలు చాలా స్పష్టంగా కనబడతాయి. గిడుగు వ్యావహారిక భాషావాదం స్థాపించడం కోసం చేసిన కృషిలో భాగంగా ఈ గ్రంథం వచ్చింది. ఈ గ్రంథం, గిడుగుకి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది.

ఈ గ్రంథం 1933లో వెలువడిరది. ఇందులో 192 పంక్తుల నాందీ కవిత రాశారు. సంప్రదాయ పండితులు ఏ రూపాలైతే వ్యాకరణ విరుద్ధాలనీ, గ్రామ్యాలనీ అన్నారో, ఆ రూపాలన్నిటికీ ప్రాచీన పూర్వకవుల ప్రయోగాలు చూపించారు గిడుగు. అంతేకాక ఆ రూపాలన్నీ సాధురూపాలని, నిరూపించడం కోసం గిడుగు ‘బాలకవి శరణ్యం’ రాశారు. గ్రాంథిక వాదులు కూడా ఈ గ్రంథాన్ని మెచ్చుకున్నారు.

భాషా పరిణామం ఎలా మారుతుందో ఈ గ్రంథంలో గిడుగు వివరించారు. సమగ్రమైన సాహిత్యాధ్యయనం లేకపోవడం వల్ల, భాషకు తీవ్రమైన, నష్టం జరిగిందని గిడుగు వాపోయారు. తెలుగు భాషకు వ్యాకరణాలు, లక్షణ గ్రంథాలు రాసిన పండితులకు భాష విషయంలో సంపూర్ణ జ్ఞానం లేకపోవడం వల్ల, చాలా దోషాలు వచ్చాయని గిడుగు ‘బాలకవి శరణ్యం’ లో తీవ్రంగా విమర్శించారు. ‘బాలకవి శరణ్యం’లో గిడుగు పదాల సాధుత్వాన్ని ఉదాహరణ పూర్వకంగా నిరూపించారు. అదే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు కూడా. ప్రాచీనాంధ్ర భాష మారదని, గ్రాంథిక వాదులు వాదించారు. భాష నిరంతరమూ మారుతుందని గిడుగు వాదన. కవుల ప్రయోగాలకు అనుశాసనం లేనంతమాత్రాన, వాటి సాధుత్వానికి భంగం లేదని నొక్కి వక్కాణించారు గిడుగు. అదేమాటపై చివరివరకు వున్నారు. అలాగే పరిశోధనలు కూడా చేశారు. గ్రాంథిక భాషావాదుల్ని చిత్తు చిత్తుగా ఓడిరచారు.

గిడుగు విమర్శించిన అనేక ప్రక్రియల్లో తెలుగు వ్యాకరణం ఒకటి. వ్యావహారిక భాషా వాదానికి తోడ్పడే టట్టుగా రామమూర్తిగారు ఈ ప్రక్రియను విమర్శించారు. వీరి అమూల్యమైన సూచనల్ని తర్వాత వ్యాకర్తలు అనుసరించారు. అనుకరించారు. మార్గ దర్శకంగా తీసుకున్నారు.

నిఘంటుకారులు, వ్యాకర్తలు, పండితులు, లక్షణకారులు, ఆసాధువులుగా భావించి, గ్రామ్యాలుగా చెప్పిన వేలకొలది పదాలకు ప్రాచీన కవుల ప్రయోగాలు కన్పిస్తున్నాయి. అందువల్ల ఆ ప్రయోగాలన్నీ సాధువులు అవుతాయని గిడుగు వాదన. తన విమర్శతో గిడుగు మహా మహా పండితుల కళ్ళు తెరిపించారు. జ్ఞానోదయం కలిగించారు. ఈ గ్రంథాన్ని చూసి గ్రాంథిక భాషావాదులు గుండెలుబాదుకొన్నారు. గిడుగు ప్రతిభను చూసి యావత్తు ప్రపంచం బిత్తరపోయింది. గిడుగు ప్రజ్ఞ ముందు గ్రాంథిక వాదుల ప్రతిభ వెలవెల పోయింది. ఒత్తి ఆర్భాటంతప్ప, వాళ్ళ దగ్గర సరుకు లేదని ప్రపంచానికి తేట తెల్లమయింది. గిడుగు, ప్రతిభలో నెం. వన్ అయ్యారు. ప్రభుత్వం గిడుగు ప్రతిభను గుర్తించి పట్టాభిషేకం చేసింది. గిడుగు అభిమానులు ఆనందంలో మునిగి తేలియాడారు. అప్పుడు గ్రాంథిక భాషావాదులు ముసుగులేసుకొని, ఎవరికీ కనబడకుండా ఒక మూల కూర్చున్నారు.

ఎక్కడ వున్నారో ఎవరికీ తెలియకుండా పోయారు.

క్రమ పరిమాణాన్ని బట్టి, కాలాన్ని బట్టి, దేశ పరిస్థితుల్ని బట్టి, వ్యాకరణ గ్రంథాల విస్తరణ ఆవశ్యకం అని గిడుగు అన్నారు. ఆ ఉద్దేశాన్ని పండితులు తర్వాత అంగీకరించారు. కొందరు పండితులు వ్యాకరణ గ్రంథాల విస్తరణ అవసరమని ఆయా సభల్లో సమావేశాల్లో ప్రసంగించారు. గిడుగు అభిప్రాయాలకూ ఆలోచనలకూ పండితులు, మేధావులు జేజేలు కొట్టారు.

గిడుగు శాస్త్రీయ పద్ధతిలో వ్యాకరణాల్ని నిశితంగా వివేచన చేశారు. తెలుగు వ్యాకరణాల్ని చీల్చి చెండాడారు. వ్యాకరణ విమర్శలో గిడుగు విజయం సాధించడానికి ప్రధాన కారణం తనకు పాండిత్యంతోపాటు, భాషా తత్త్వజ్ఞానం వుండడం, మరియు శాస్త్రీయ దృక్పథం వుండడం. మన వ్యాకరణ కర్తలకు కేవలం పాండిత్యం మాత్రమే వుంది. భాషాతత్త్వంపై వ్యాకర్తలకు కనీస అవగాహన కానీ, పట్టుకానీ లేదు. శాస్త్రీయ దృక్పథం అసలేలేదు, వాళ్ళకు శాస్త్రజ్ఞానం అంటే ఏమిటో తెలియదుకూడా. గిడుగులో పాండిత్యంతోపాటు భాషాతత్త్వం, శాస్త్రీయ దృక్పథం మూడు పుష్కలంగా వున్నాయి. అందువల్ల విజయం సాధించారు. అందుకే గిడుగు "పిడుగు" అయ్యారు.

లక్షణం కన్నా కవి ప్రయోగం బలవత్తరమైంది. కవులు ప్రయోగించిన రూపాల్ని వ్యాకరణంలో చెప్పకపోతే, ఆ వ్యాకరణం అసమగ్రమే అవుతుంది. మీదుమిక్కిలి వ్యాకరణం అనిపించుకోదుకూడా. ఈ దృష్టితో గిడుగు, వ్యాకర్తలు సాధించని ఎన్నో కావ్య ప్రయోగాల్ని చూపుతూ "బాలకవిశరణ్యం"లో రాశారు. ఈ గ్రంథాన్ని ఒకవిమర్శనాత్మక వ్యాకరణ గ్రంథంగా మనం పేర్కోవచ్చు.

1858లో చిన్నయసూరి కావ్య భాషకోసం, విద్యార్థుల్ని దృష్టిలో పెట్టుకొని "బాల వ్యాకరణం" రాశారు. "బాల వ్యాకరణం" కన్నా ముందు సూరి గారు నాలుగు వ్యాకరణ గ్రంథాలు రాశారు. పద్యాంధ్రవ్యాకరణం (1840), సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణం (1844) శబ్ద లక్షణ సంగ్రహం (1853), ఆంధ్ర శబ్ద శాసనం (1913) రాశారు. "బాలవ్యాకరణం" ప్రామాణిక గ్రంథంగా పండితుల అందరి చేత ప్రశంసలు అందుకుంది. బాలవ్యాకరణానికి ఎన్నో వ్యాఖ్యాన గ్రంథాలుకూడా వచ్చాయి. ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఇద్దరూ కలిసి "బాలవ్యాకరణం – శాస్త్రీయ వ్యాఖ్యానం" అనే గ్రంథం రాశారు. ఇదే ఇటీవల వచ్చిన ప్రామాణిక బాలవ్యాకరణ వ్యాఖ్యాన గ్రంథం. ఈ గ్రంథం వ్యావహారికభాషలో వుంది.

"బాలవ్యాకరణం" తర్వాత వచ్చిన వ్యాకరణాలు అన్నీ దాన్ని అనుసరించే వచ్చాయి. అయితే అక్కడక్కడ చిన్నయసూరి 'బాలవ్యాకరణం'లో చెప్పని అంశాలు కూడా ఇతరులు చెప్పారు. అబ్బాయి నాయుడు "ఆంధ్ర వ్యాకరణ సంగ్రహం" రాశారు. ఇందులో వాక్య పరిచ్ఛేదం వుంది. 'త్రిలింగ లక్షణ శేషం' అనే పేరుతో బహుజన పల్లి సీతారామాచార్యులు "ప్రౌఢ వ్యాకరణం' 1885లో రాశారు. ఇందులో "వాక్యపరిచ్ఛేదం" చోటు చేసుకుంది "బాల వ్యాకరణం"లోని లోపాల్ని సవరించడానికి ప్రయత్నించారు ప్రౌఢ వ్యాకర్త. వావిలికొలను సుబ్బారావు తన వ్యాకరణంలో 'వాక్యపరిచ్ఛేదం' రాశారు. ఇంచుమించు అన్ని వ్యాకరణాలు చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని అనుసరించే వచ్చాయి.

వ్యాకరణ నిర్మాణంలో పెను మార్పులు రావాలని గిడుగు మనసారా కోరుకున్నారు. ఆయన విమర్శ ఈ ధోరణితోనే ఎక్కువగా నడిచింది. కొందరు పిడి పండితులు గిడుగు వ్యాకరణ విమర్శను తట్టుకోలేక పోయారు. కువిమర్శలకు దిగారు. ఏది ఏమైనా విజయం గిడుగుకే దక్కింది. ఎక్కడ నిజం వుంటే అక్కడ విజయం వుంటుందని పెద్దలు చెపుతారు. అదేనిజమైంది.

**బాలకవి శరణ్యం – ముఖ్యాంశాలు :**

"బాలకవి శరణ్యం" గ్రంథాన్ని "బాలవ్యాకరణ" విస్తరణ గ్రంథంగానూ, మంచి విమర్శనా గ్రంథంగానూ, మనం భావించవచ్చు. అందులోని ముఖ్యాంశాలు ఇవి.

♦ కొన్ని శబ్దాల్ని చిన్నయ సూరి అసాధువులుగా చెప్పాడు. వ్మాయం అంతా బాగా పరిశీలిస్తేకాని ఇ లాంటి నిర్ణయం చేయడం మంచి పద్ధతి కాదని చిన్నయ సూరిని గిడుగు తీవ్రంగా విమర్శించారు. అందుకే చిన్నయ రాసిన "బాల వ్యాకరణం" పరిమితమైందిగా భావించారు. వేయి సంవత్సరాల తెలుగు వ్మాయానికి "బాలవ్యాకరణం" అన్వయించడానికి పనికిరాదు. అందుకే గిడుగు "బాలవ్యాకరణం" పరిమితమైన వ్యాకరణం అన్నారు. ఏమీ తెలియకుండా విమర్శకులు అడ్డదిడ్డంగా వాదించకూడదు.

♦ వ్యాకర్తకు కావ్య భాషతో పాటు, మాండలికాలతో కూడిన లౌకిక భాషా పరిజ్ఞానం కూడా తప్పని సరిగా వుండాలి. వ్యాకర్త గిరిగీసుకొని కూర్చో కూడదు. విశాల దృక్పథం, శాస్త్రీయమైన భాషాజ్ఞానం, వ్యాకర్తకు వుండాలని గిడుగు అభిప్రాయపడ్డారు.

♦ వ్యాకరణం, భాషాశాస్త్రం, రెండూ వేరు వేరు శాస్త్రాలు. రెండు శాస్త్రాలు చాలా ముఖ్యమైనవి. వ్యాకర్తకు పాండిత్యం ఒక్కటే వుంటే సరిపడదు. భాషాజ్ఞానం కూడా వుండాలి. శాస్త్రీయ దృక్పథం కూడా వుండాలి. మూడు వుంటేనే మంచి వ్యాకర్తగా రాణిస్తాడు. కేవలం పాండిత్యంతో వ్యాకరణాలు రాస్తే చాలా లోపాలు వస్తాయని గిడుగు వాదించారు. మన వ్యాకరణాల్లో పాండిత్య ప్రతిభ మాత్రమే కన్పిస్తుంది. భాషాశాస్త్రీయ దృక్పథాలు ఎంత వెదికినా కనబడవు. అవే మన వ్యాకరణాల్లో వున్న పెద్దలోపం.

♦ సంస్కృత వ్యాకరణ శాస్త్ర మర్యాదలు కూడా తెలుగు వ్యాకర్తకు తెలిసివుండాలి. ఎందుకంటే తెలుగు భాషపై సంస్కృత భాషా ప్రభావం బాగావుంది. అందువల్ల సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలు వ్యాకర్తలకు తెలియాలి.

♦ ఇతర సోదర ద్రావిడ భాషలవ్యాకరణ మర్యాదలు కూడా తెలిసివుండాలి. ఎందుకంటే ద్రావిడ భాషలు, మూల ద్రావిడ భాష నుండి పుట్టాయి కాబట్టి.

♦ వ్యాకర్త తాను చెప్పవలసినదంతా చాలా వివరంగా స్పష్టంగా చెప్పాలి. అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చెప్పేది సూటిగా వుందా? లేదా? చూసుకోవాలి. దోష రహితంగా చెప్పాలి. దోషాల్ని పరిహరించడానికి పూర్వులు అవలంబించిన ఉత్తమ పద్ధతుల్ని పాటించాలి. మీకు తెలిసిన, మిడిమిడి జ్ఞానంతో అడ్డదిడ్డంగా

చెప్పకూడదు. మంచి పద్ధతిని ఎన్నుకోకపోతే, చాలా దోషాలు వస్తాయి. దానివల్ల తెలుగు సాహిత్యానికీ, తెలుగు భాషకూ,తెలుగు వ్యాకరణానికీ, చాలా హాని జరుగుతుందని గిడుగు ఆవేదన చెందారు. వ్యాకర్తలు వ్యాకరణం రాసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే దోషాలు చోటుచేసుకుంటాయి.

♦ ప్రాచీన కవులు ప్రయోగించిన కొన్ని శబ్దాల్ని, వ్యాకర్తలు అసాధువులుగా పేర్కొన్నారు. దీన్ని గిడుగు తీవ్రంగా ఖండిరచారు. కవి ప్రయోగించిన శబ్దాలు జాగ్రత్తగా వివేచన చేసి, వాటిని లక్ష్యాలుగా చేసుకోవాలి. దానికి లక్షణం చెప్పవలసింది వ్యాకర్తల కనీస ధర్మం, బాధ్యత కూడా. వ్యాకర్తలు ఇక్కడ తప్పించుకోడానికి వీలు లేదు. దానికి భిన్నంగా వ్యాకర్తలు వ్యవహరించకూడదు. అలా ఆలోచించకూడదు. మీదు మిక్కిలి, ఆ విధానం తప్పుకూడా. కవి ప్రయోగాల్ని తప్పు పట్టే అధికారం ఎలాంటి పరిస్థితుల్లోనూ, వ్యాకర్తకు లేదని, వున్నది వున్నట్లు తేల్చి చెప్పారు గిడుగు.

♦ నూటికి నూరు పాళ్ళు వ్యాకర్త, సిద్ధ శబ్ద ప్రక్రియను చెప్పేవాడే కాని ఆక్షేపించరాదని గిడుగు అభిప్రాయపడ్డారు. అంతేకాదు, తనకు ముందు వున్న వ్యాకరణ గ్రంథాల్ని, వాటి ప్రణాళికను, పరిధిని, గుర్తించి, దాన్ని విస్తరింపచేసేదిగా తన వ్యాకరణాన్ని, వ్యాకర్త నిర్మించుకోవాలి. సంకుచిత స్వభావంతో వ్యాకర్తలు వుండకూడదు. దానివల్ల భాషకు చాలా అన్యాయం జరుగుతుందని గిడుగు భావించారు. వ్యాకర్తలు విశాల దృక్పథంతో వుండాలి.

♦ ఒక గ్రంథంలో వున్న శబ్దాల్ని గ్రహించడానికి వ్యాకర్తకు అభ్యంతరం వుండకూడదు. లోకంలో ఒక శబ్దం బహుళ ప్రాచుర్యంలో వుండి, గ్రంథలో ఎక్కడైనా ఆ శబ్దం కనబడితే పండితులు, కవులు సంతోషించాలి. ఆ శబ్దాల్ని ఆహ్వానించాలి. అంతేకాని ఆ పదప్రయోగాన్ని ఆక్షేపించరాదు. అంతే కాదు వ్యాకర్తలు ఇలాంటి పదాల్ని చేర్చుకొని సాహిత్యసంపదను, భాషాభివృద్ధిని పెంపొందించే ప్రయత్నం చేయాలని గిడుగు అభిప్రాయపడ్డారు.

♦ వ్యాకరణం రాసిన కాలానికీ, జనవ్యవహారంలో వున్న భాషా పదజాలానికీ సంబంధించిన వివరణను వ్యాకర్త, తప్పనిసరిగా ఇవ్వాలి. వాఙ్మయం ఎప్పుడూ ఒకేరకంగా వుండదు. మారుతూవుంటుంది. ఆయా గ్రంథాల్లో ఆ కాలం నాటి, కొత్త శబ్దాలు తప్పనిసరిగా చేరుతాయి. అలా శబ్దాలు చేరవని అజ్ఞానంగా గుడ్డిగా వాదించకూడదు. కవి ప్రయోగాల్ని వ్యాకర్త ఎటువంటి పరిస్థితుల్లోనూ కాదనరాదు. కవి ప్రయోగాన్ని తప్పు అని చెప్పడం వ్యాకర్తకు మంచిదికాదని గిడుగు అభిప్రాయం.

♦ ఒక రూపం కొత్తగా కన్పించేటప్పుడు దాన్ని నిశితంగా పరిశీలించాలి. ఆశబ్దాన్ని లోతుగా పరిశోధించి దాన్ని అనుశాసనం చేయాలి అని గిడుగు అన్నారు. ఇలాంటి పదాలు ప్రాచీనకవులు తమకావ్యాల్లో ఆయా సందర్భాల్లో ఉపయోగించడంవల్ల భాషలో పదసంపద పెరుగుతుందని గిడుగు భావించారు.

♦ ముఖ్యంగా వ్యాకరణాలు, నిఘంటువులు భాషా చరిత్రను తెలియజేసే విధంగా వుండాలి. అంతేకాదు, సోదర ద్రావిడ భాషలతో తులనాత్మక అధ్యయనంతో భాషా తత్త్వాన్ని చెప్పే విధంగా వుండాలి. అప్పుడే ఆ వ్యాకరణం ప్రామాణికంగా వుంటుందని గిడుగు అభిప్రాయపడ్డారు.

♦ ప్రతీ వ్యాకర్తకు శబ్ద శాస్త్రంలో తప్పనిసరిగా పరిచయం వుండాలని గిడుగు తెలియజేశారు. వ్యాకర్తకు శబ్దజ్ఞానం లేకపోతే వారి ప్రయత్నం 'బూడిదలో పోసిన పన్నీరు' అవుతుందని, అంతా వ్యర్థమౌతుందని గిడుగు పేర్కొన్నారు.

♦ ఒక వ్యక్తి ఒకే శబ్దాన్ని వేరు వేరు సందర్భాల్లో వేరు వేరుగా మాటలాడుతాడు. అందువల్ల భాషలో రూపాంతరాలు చోటుచేసుకుంటాయి. వాటిని ఔచిత్య ప్రధానంగా వ్యాకర్తలు సంగ్రహించాలని గిడుగు అభిప్రాయపడ్డారు.

♦ సంధికార్యాల్లో వ్యాకరణానుశాసనం, కవి ప్రయోగం, లోక వ్యవహారం పోల్చిచూస్తే, ఒక దానికి ఒకటి సరిపడదని గిడుగు అన్నారు. అంతేకాదు. సంధికార్యం ఎక్కడ నిత్యం, ఎక్కడ బహుళం, ఎక్కడ వైకల్పికం, ఎక్కడ నిషిద్ధం, ఎక్కడ లోపం, అనే అంశాలు స్పష్టంగా వ్యాకరణంలో లేవని వున్నది వున్నట్లు గిడుగు విమర్శించారు.

♦ యడాగమం నేటి వ్యవహారంలో తారుమారుగా వుందని గిడుగు భావించారు. 'మాయమ్మ' లాంటి పామరుల మాటలుగా భావించబడుతున్నాయని గిడుగు అన్నారు. ఇ ఈ ఎ ఏ లు మొదట వున్న మాటలు ఈ యాత చెట్టు, ఈ నాయుడు, ఈ యేనుగు మొదలగు మాటలు యకారంతో ఉచ్చరిస్తున్నారని గిడుగు చెప్పారు. దీనికి విరుద్ధంగా మా ఊరు, ఒక ఉత్తరం, పిల్ల ఉన్నది. మొద్దలైనవి వున్నాయి. ప్రాచీన కాలంలో మాయూరు, ఒక యుత్తరము, పిల్ల యున్నది. మరియొక అని వుండేవని తెలియజేశారు గిడుగు. కాల క్రమంలో ఉ ఊ ఒ ఓ లు మొదటి వర్ణాలుగా వున్నమాటలు వకారంతో కలసి ఉచ్చరిస్తున్నారని గిడుగు మార్పుల్ని వర్గీకరించి విపులీకరించారు.

♦ ఏమ్యాదుల ఇకారానికి చిన్నయసూరి వైకల్పిక సంధిని విధించాడు. అయితే బాగా లోతుగా పరిశీలిస్తే ఇది 'బహుళం' అని గిడుగు అభిప్రాయ పడ్డారు. అంతేకాదు. ఉదాహరణలతోసహ విపులీకరించారు.

♦ క్వార్థంబైన ఇకారానికి సంధిలేదని చిన్నయసూరి "బాలవ్యాకరణం"లో నిషేధించాడు. "కవిత్రయము వారు ఈ సంధిని తరుచుగా, చేయక పోయినా వారి తర్వాత మహాకవుల ప్రయోగాలు వందల కొలది ఉన్నవి కదా! ఈ సంధి కూడదని లక్షణికులు ఎలా సాహసించిచెప్పగలరు. ఇకారమునకు, ఇ, ఈ, ఎ, ఏ లు పరమైనప్పుడు సంధి సహజముగా శ్రుతికింపుగాను ఉంటుంది". అని గిడుగు అభిప్రాయపడ్డారు. క్వార్థం ఇకారసంధిలో అర్థ భేదం కలిగే అవకాశం వుండడంచేత చిన్నయసూరి నిషేధించివుంటాడు. కాలక్రమంలో ఈ సంధి సహజంగా మారిందని గిడుగు అన్నారు.

♦ స్త్రీ వాచక, తత్సమ, సంబోధనాంతములకు సంధి లేదని చిన్నయసూరి అకారాంత శబ్దాలకు విధించాడు. సంబోదనాంతములపట్ల అత్తునకే కాదు, మరి ఏ ఇతర స్వరానికి అయినా సరే, అచ్చు పరమైనప్పుడు సంధి లేదని నిశ్చయంగా చెప్పవచ్చునని గిడుగు పేర్కొన్నారు.

♦ కవి తన కావ్యంలో అన్యదేశాలు వాడితే, వ్యాకర్త తప్పనిసరిగా

గ్రహించాలని గిడుగు పేర్కొన్నారు. తనకు ఇష్టం లేదని వ్యాకర్త విడిచిపెట్టకూడదు. ఆ పద్ధతి మంచిదికాదు.

♦ వ్యాకర్తలు మాండలిక పదాల్ని, వ్యావహారిక పదాల్ని కూడా గ్రహించాలి. వ్యాకర్తలు సంకుచితంగా వుండకూడదు. విశాల దృక్పథంతో వుండాలి. అసలు విషయం ఏమంటే వాళ్ళకు అంత భాషాజ్ఞానం లేదు.

♦ గసడ దవాదేశం నన్నయాది ప్రాచీన కవుల కావ్యాల్లో "నేను", "తాను", శబ్దాల మీద తప్ప, నిత్యంగా కనబడుతున్నాయని గిడుగు చెప్పారు.

ప్రాచీనాంధ్ర భాష ఎప్పుడూ ఒకే రంగా వుంటుందని గ్రాంథిక భాషావాదుల వాదన. భాష మారదని గుడ్డిగా వాదించారు గ్రాంథిక వాదులు. వారి వాదనను గిడుగు ఖండించి, ఉదాహరణతో నిరూపించారు. ఆ కారణంగా గ్రాంథికవాదులు శబ్దంచేయకుండా ఒక మూల కూర్చున్నారు.

"బాల వ్యాకరణం"లో చిన్నయసూరి "కూఁతు శబ్దము ప్రథమైక వచనంబునకు రువర్ణంబగు" కూఁతురు, కూఁతులు, కూఁతురులు, కూఁతుళ్లు, కూఁతురి నీత్యాది రూపంబులు గ్రామ్యంబుల నియెఱుంగునది''. అని అన్నారు. చిన్నయసూరి గ్రామ్యాలుగా నిందించిన రూపాలు కూఁతురులు,కూఁతుళ్లు, కూఁతురినిలను ప్రాచీన కవులు ప్రయోగించారని గిడుగు "బాలకవి శరణ్యం"లో ఉదాహరణ పూర్వకంగా నిరూపించారు.

ప్రాచీన కావ్యాల్లో కూఁతురు, కూఁతున్, కూఁతులు ప్రయోగాలు వున్నాయి. నన్నయ రాసిన "భారతం" ఆది పర్వంలో "నీవెవ్వరి కూఁతురవు'' అనే ప్రయోగంవుంది. 1856లో మాడ భూషి వేంకటకృష్ణాచార్యులవారు పరిష్కరించి అచ్చు వేయించిన గ్రంథంలో "కూఁతురిని" ప్రయోగం వున్నట్లు గిడుగు వివరించారు. కాలక్రమంలో వచ్చిన గ్రంథాల్లో ఆ ప్రయోగం లేకుండా పోయింది. కూతురన్, కూఁతురిని, కూతురు, కూతురుపై, కూఁతురి, కూఁతురను, కూఁతురును, కూఁతురిని, కూఁతురనకు, కూఁతుళ్ళు, కూఁతుని, కూతుండ్రు, కూఁతురు, ప్రయోగాలు కూడా ప్రాచీనాంధ్ర కావ్యాల్లోనూ, తర్వాత వచ్చిన ఇతర కవుల కావ్యాల్లో ప్రయోగించారు.

కేతన, విన్న కోటపెద్దన, రావి పాటి గురుమూర్తి శాస్త్రి, కాంబెల్, బ్రౌన్‌లు రాసిన వ్యాకరణాల్లో వీటిలో కొన్నింటిని అనుశాసనం చేశారు.

ఇక్కడ చెప్పుకోదగ్గ గొప్ప విషయం ఏమంటే చిన్నయసూరి గ్రామ్యాలుగా చెప్పిన రూపాల్ని పూర్వ లాక్షణికులు, సాధువులుగా అనుశాసించారు. కనీనం ప్రాచీన కవుల ప్రయోగాలు కనబడకపోయినా, తనకు ముందున్న లక్షణ గ్రంథాల్ని సంప్రదించలేదని దీనివల్ల తేటతెల్లమవుతుంది.

గ్రామ్యాలుగా చిన్నయసూరి చెప్పిన ఈ రూపాలు, చిన్నయసూరి కాలం నాటికి వ్యవహారంలో వున్నాయి. కనీసం వ్యావహారిక హాని కలుగుతుందని కూడా ఆలోచించకుండా, చిన్నయసూరి వాటిని గ్రామ్యాలుగా చెప్పారు. ఇది ఇలావుండగా గ్రామ్యాలుగా చిన్నయసూరి నిందించిన ఈ పదాల్ని, పిడి పండితులు గ్రంథాలు పునర్ముద్రణ చేసే టప్పుడు, దిద్దడానికి ప్రయత్నం చేశారు. ఇది చాలా తప్పు. మూల పదాల్ని తమకు ఇష్టం వచ్చినట్లు తమకు అనుకూలంగా మార్చకూడదు. పాపాలు అన్నింటిలో కల్లా మహాపాపం. ఇలా ఎన్నో తప్పులు చేశారు మన పండితులు. అయితే యతి ప్రాసస్థానాలు దిద్దడానికి వీలువుండదు కాబట్టి అక్కడా విడిచిపెట్టారు. లేకపోతే ఈ పండితులు వాటినికూడా దిద్దివుండేవారు. "బాలకవి శరణ్యం"లో అనేక పదాల సాధుత్వాన్ని నిరూపించారు గిడుగు. అంతే కాదు. వాటిని పండితులు అంగీకరించాలని ప్రచారం చేశారు. చివరకు మహా మహా పండితులు ఆమోదించారు. తమ అంగీకారాన్ని కూడా తెలియజేశారు.

చిన్నయసూరి తన రచనల ద్వారా సమాజానికి ఏమి చేశారో గిడుగు ఇలా విమర్శించారు.

''అధికారానధికార తారతమ్యము ఆలోచించకుండా, ఆ బాలగోపాలం అందరి పిల్లల చేతను రచనాభ్యానము చేయించనుద్దేశించి, అందుకు సాధనముగా అసమగ్రము, అనిర్ణాయకము, భ్రమ ప్రమాదాత్మకమున్ను అయిన ఒక చిన్న వ్యాకరణము ఒకటిన్ని, అస్ఖలిత ముకాని చిన్న వచన గ్రంథమొకటిన్ని రచియించి ఇచ్చి ఆ సూరి గారు కీర్తిశేషులయినారు. కొండవీటి సీమలోని నూతులనుండి నీళ్ళు తోడి, తెచ్చుకొని వంట చేసుకొని, భోజనము చేయండి అని బారెడు చేంతాడు, తూట్లు పడ్డ చిన్న చెంబు,ఆకలితో ఉన్న చిన్న పిల్లలు చేతిలో పెట్టి, తల్లి దండ్రులు శ్రీశైల యాత్రకు వెళ్ళినట్లు అయినది" అని అన్నారు గిడుగు. ఈ పోలికవల్ల చిన్నయసూరి రాసిన "బాలవ్యాకరణం" (1858), "నీతి చంద్రిక" సమాజానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో లేదో, మనకు చాలా స్పష్టంగా అర్థమవుతుంది.

ఇలా "బాల వ్యాకరణం"లోని ఎన్నో అంశాల్ని గిడుగు తీవ్రంగా విమర్శించారు. మొత్తం మీద సారాంశం ఏమంటే, తెలుగు వ్యాకరణ గ్రంథాలు అసమగ్రమైనవి అని తేలింది. ఈ లోటును 'చారిత్రక వ్యాకరణ గ్రంథాలు' తీర్చుతాయని గిడుగు అభిప్రాయపడ్డారు. భాషా పదాలు వ్యవహారంలో కాలక్రమంలో ఏయే మార్పుల్ని పొందాయో, తెలపాలేగాని, మారిన రూపాలు ప్రయోగానికి వీలు పడవని అనడం మంచిది కాదని గిడుగు పేర్కొన్నారు. అంతేకాదు దానికి అనుగుణమైంది 'చారిత్రక వ్యాకరణం' అని తెలియజేశారు. "చిన్నయసూరి గారిని మనము నిందించకూడదు. తన లక్షణము సంపూర్ణ మయినది కాదని చెప్పి, శిష్ట ప్రయోగముల నుండి శేషము తెలుసుకొనవలసిన దని చెప్పినారు". అని గిడుగు అన్నారు.

"బాల వ్యాకరణం" రాసిన సూరి కూడా, వాడుక భాషాపదాలు వాడినట్లు ఉదాహరణ పూర్వకంగా రాశారు గిడుగు. చిన్నయసూరి రాసిన 'అక్షరగుచ్ఛకం'లో వాడుక భాషాపదాలు చోటు చేసుకున్నాయి. అంతే కాదు, బహుజనపల్లి సీతారామాచార్యులు రాసిన "శబ్ద రత్నాకరం"లోనూ, పుదూరు సీతారామశాస్త్రి గారు రాసిన "పెద్ద బాలశిక్ష"లోను వాడుక భాషాపదాలు కన్పిస్తున్నాయని గిడుగు నిర్ధారించారు.

గిడుగు ప్రభావం పండితుల మీద, కవులమీద, మేధావుల మీద, పడింది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తమ అవధానాల్లోనూ, వ్యాసరచనలోనూ, వ్యావహారిక భాషను వాడారు. గిడుగు సిద్ధాంతాన్ని

**17వ పుట తరువాయి...**

## రాయలసీమ–వ్యవసాయానికి...

'పంటవడపడం' అని పిలుస్తారు.

**వడుపుగా** –చిక్కగా. దగ్గర దగ్గరగా విత్తనాలను భూమిలో విత్తడం వర్షాకాలం కదా! విత్తనం బాగా వడుపుగా వేయండి!

**వలపటెద్దు** – కాడికి కుడివైపు కట్టిన ఎద్దును వలపటెద్దు అని పిలుస్తారు.

**వాములు** – చెనిక్కట్టెను, ఎందు వరిగడ్డి వంటి వాటిని ఎత్తుగా ఒకే కుప్పలుగా వేయడాన్ని వాములు వేయడం అని అంటారు.

**వార్నె** –కాడిమానుపైకి నగళ్ళను పంపిన తరువాత దానిపై నుండి అవి జారిపోకుండా కట్టడానికి ఉపయోగించే తాడు.

**వెన్నపూసాకు** –పొలంలో పెరిగే మొక్క. గాయాలను మాన్పడానికి ఈ ఆకుపసరును ఉపయోగిస్తారు.

**వెలవడ్లు** – నారు పోయడానికి ఉపయోగించే వొడ్లు.

**సాగుచేయు** – కంపచెట్లు, రాళ్ళు వంటివి ఉన్న భూమిని పంట పండడానికి వీలుగా తయారుచేసే దానిని సాగుచేయడం అని అంటారు.

**సాలు** –మడక దున్నినప్పుడు భూమిలో ఏర్పడిన గుంతలాంటి ఆకారం.

**సిక్కెం** –దూడలు పాలు త్రాగకుండా వాటి మూతికి అడ్డంగా ఉండేలా ఏర్పాటు చేసిన ఆకారం.

**సుడులు** – ఎద్దుల వెంట్రుకలు వంపుగా ఉండడం. ఆ ఎద్దుకు చెడ్డ సుడులు జాచ్చిగా ఉండారా అబ్బీ. మనకది అచ్చిరాదు.

(సుడులలో మంచివి, చెడ్డవి రెండు రకాలుగా ఉంటాయి. ఈ సుడులను బట్టి కూడా ఎద్దులకు వెల నిర్ణయం చేస్తారు)

**సెట్లడ్డె** –గట్టుపై ఉన్న చెట్లను భూమిలోనుండి వేర్లతో సహా వేరుచేయడానికి ఉపయోగించే పరికరం.

**సేద్యగాడు** – రైతు తనకు తోడుగా ఒక పనిమనిషిని కేవలం వ్యవసాయం కోసమే ఏర్పాటుచేసుకోవడం అనాదిగా వస్తూ ఉంది. ఆ వ్యక్తినే సేద్యగాడు అని పిలుస్తారు.

**సొప్పదంట్లు** – పశువులకు వేసే మేత, మొక్కజొన్న, జొన్న వంటి పంటలు పండినప్పుడు గింజలున్న గుత్తులను వేరుచేసి మిగిలిన మొక్కను పశువులకు మేతగా ఉపయోగిస్తారు. ఆ మిగిలిన దంట్లనే సొప్పదంట్లు అని పిలుస్తారు.

**ముగింపు :** ఆధునిక జీవితంలో మనిషి సాంకేతికంగా బాగా అభివృద్ధిచెందుతూ, యాంత్రిక జీవనానికి అలవాటుపడిపోయాడు. రోలు స్థానంలో మిక్సీ, కట్టెలపొయ్యి స్థానంలో గ్యాస్‌స్టవ్, కుండ స్థానంలో రైస్‌కుక్కర్ లు వచ్చాయి. ఇలా మనిషి పూర్తిగా యంత్రాలపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈ ప్రభావం వ్యవసాయంపై కూడా పడిందని చెప్పవచ్చు. ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. ఎద్దులు చెయ్యాల్సిన పనులన్నీ నేడు ట్రాక్టర్లతో చేస్తున్నారు. మనుషులు చెయ్యాల్సిన వ్యవసాయ పనులు యంత్రాలు చేస్తున్నాయి. వరి నాటడం నుండి వడ్లను ఇండ్లకు చేర్చేటంతవరకు ప్రతిపనీ నేడు యంత్రాలు చేస్తున్నాయి. దీనివల్ల రానున్న రోజుల్లో వ్యవసాయానికి ఉపయోగించే పనిముట్లు ఎలా ఉంటాయో కూడా తెలియని పరిస్థితి తప్పక వస్తుంది. ఈ వ్యాసం ద్వారా వ్యవసాయం చేసే పనిముట్లపై కొంతైనా పరిజ్ఞానం కలుగుతుందని చిన్న ఆశ. 'సచిత్ర వ్యవసాయ పనిముట్లు'(పనిముట్ల చిత్రాలతో...) ఒక పుస్తకాన్ని రూపొందిస్తున్నాను. త్వరలో పాఠకులముందుకు రానుంది. రాబోయే తరానికి ఆ పుస్తకం కొంతైనా ఉపకరిస్తుందని ఆశిస్తున్నాను.

–వ్యాసరచయిత సహాయ పరిశోధకులు
సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప

---

చెళ్ళపిళ్ళవారు బాగా ప్రచారం చేశారు. అంతేకాదు “తెలుగు కున్న వ్యాకరణ దీపం చిన్నది” అని శాస్త్రి గారే అన్నారు. అసలు విషయం ఏమంటే కవుల ప్రయోగమే ముఖ్యమని శాస్త్రిగారు చెప్పారు. గిడుగు సిద్ధాంతం కూడా ఇదే.

చిన్నయసూరి వ్యాకరణానికి అనుగుణంగా రచనలు చేస్తున్నామని చెప్పుకునే పండితులూ, కవులు కూడా ఆభాష తమకు సహజమైంది కాకపోవడంవల్ల లక్షణ విరుద్ధమైన ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారని గిడుగు ఎత్తి చూపి పండితుల కళ్ళు తెరిపించారు.

1932లో గిడుగు “నీతి చంద్రిక”ను తిరిగి ప్రచురించారు. రెండో ముద్రణ వరకు చిన్నయసూరే స్వయంగా “నీతి చంద్రిక”ను ముద్రించారు. చిన్నయసూరి చనిపోయాక వెలువడిన తృతీయ ముద్రణ నుండి “నీతి చంద్రిక” గ్రంథం ఏరకంగా ఎన్ని రూపాల్ని మార్చుకొన్నదో తన 'ప్రస్తావన”లో చాలా వివరంగా తెలియజేశారు గిడుగు.

ఈ విధంగా చిన్నయసూరి రాసిన బాల వ్యాకరణాన్ని విమర్శిస్తూ గిడుగు “బాల కవి శరణ్యం” రాశారు. పండితుల, మేధావుల ప్రశంసల్ని అందుకున్నారు. గిడుగు ప్రభావంతో, ఆధునిక వ్యాకరణాలు వచ్చాయి.

*“నన్నయ గారి నుంచీ చిన్నయ సూరి దాకా, వెలసిన కవిపండితులు, గ్రాంథిక భాషలో నిర్మించిన తెలుగు వాఙ్మయంనుంచి తప్పులను తవ్వి, కుప్పలు కుప్పలుగా పోశారాయన. సమకాలికులైన విద్వత్కవుల రచనలనుంచి తప్పుల తిప్పలను బండ్ల కెత్తి తూర్పారబట్టారు. కొమ్ములు తిరిగిన ఉద్దండ పండితులే నిర్దుష్టంగా రాయలేని గ్రాంథిక భాషాశైలిలో బడి పిల్లలూ, సామాన్యులూ రాయాలని ఉద్దేశించడం ఆశాస్త్రీయమనీ, ఆదేశించడం అన్యాయమనీ అది ఏటికెదురీత వంటిదనీ గిడుగు వారు పత్రికా ముఖంగా ప్రబోధం కావించారు. తెలుగు మాగాణమంతా తిరిగి సభాముఖంగానూ, క్షిప్తుల పరంగానూ ప్రచారంచేశారు.”*

– తూమాటి దొణప్ప

'బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది నా ఖచ్చితమైన అభిప్రాయం. విద్యావ్యాప్తికి పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం. విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా మాతృభాషను స్వీకరిస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదు.' – రవీంద్రనాథ్ ఠాగూర్

శివయ్య రాజులపాటి
9491647639

# నవంబర్ 12
# భారతదేశం ప్రజాసేవా ప్రసార దినోత్సవం

శ్రోతలకు నమస్కారం! ఇపుడు మీరీ వ్యాసాన్ని చదువుతున్నప్పటికీ మనసుతో కూడా వింటూ ఉండండి. అప్పుడు మీరు చదువరి మాత్రమే కాదు శ్రోత కూడా. రోజూ నా స్వరంతో నే చెప్పే మాటలు మీ చెవులతో మీరు వింటూనే ఉన్నారు, అట్లాగే, ఇప్పుడు మటుకు తప్పక మనసు పెట్టి వినండి. ఇది మీ సేవలో సంచరిస్తున్న నా వాణి, నా బాణీ కూడా అదే-ప్రజా సేవ. నిజానికి 'నేన'ని అంటున్నాను గానీ, అది మీరే! నా వాణి అంటే అది మీ స్వరమే. నేను మీరై మీ అందరికీ వినిపిస్తున్నాను. కాబట్టి నాకొక పేరు 'ఆకాశవాణి', మీ కంటికి కనబడకుండా వినిపిస్తున్నాను కనుక.

**నా గురించి నేను:**

ఆకాశవాణి - ప్రజాసేవలో 86 ఏళ్లుగా మనగలిగిన, నిలకడైన జనవాణి. 1936 జూన్ 08 నాడు - 'ఆలిండియా రేడియో'గా ప్రభుత్వ ప్రసార వ్యవస్థగా వ్యవహారంలోకి వచ్చింది, అప్పటిదాకా 'ఇండియన్ స్టేట్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీసెస్' గా ఉన్న సంస్థ. ఆ మాట కొస్తే 1920 లోనే ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ స్థాపించబడినా, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో 1923లో బొంబాయి రేడియో క్లబ్ పేరిట రేడియో ప్రసారాలు మొదలైనా, 1927లోనే ప్రభుత్వ ప్రసారాలు అధికారికంగా ప్రారంభించబడ్డాయనే విషయం చరిత్ర చెప్తోంది. వివరంగా చెప్పాలంటే 1927 జూలై 23న ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ, బొంబాయి కేంద్రం గా, భారతదేశంలో అప్పటి బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ఉన్నప్పుడు సంస్థాగతంగా ప్రసారాలు చేపట్టింది. ఆ అధికారిక తేదీ జూలై 23 ను భారత జాతీయ ప్రసార దినోత్సవం (National Broadcasting Day) గా జరుపుకుంటున్నాం.

స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 12 న - మహాత్మా గాంధీ ఢిల్లీ రేడియో స్టేషన్‌ను సందర్శించారు. దేశ విభజన తర్వాత, పాకిస్థాన్ నుంచి, సరిహద్దు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఎంతో మంది హర్యానాలోని కురుక్షేత్రలో కేంపుల్లో తలదాచుకున్నారు. ఆనాటి ఆ కాందిశీకుల్ని ఉద్దేశించి గాంధీజీ రేడియోలో మాట్లాడారు. జాతిపిత రేడియోలో మాట్లాడిన మొట్టమొదటి సందర్భం, ఒకేఒక్క సందర్భం అదొక్కటే. ఈ విషయాన్ని ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉన్నా, 2001వ సంవత్సరం నుంచి యేటా మహాత్ముని గౌరవ స్మృతిలో నవంబర్ 12వ తేదీన భారత ప్రజా సేవా ప్రసార దినోత్సవం (Public Service Broadcasting Day) గా జరుపుకుంటున్నాం మనం.

1950 లో దేశంలోని అన్ని ప్రైవేట్ రేడియో కేంద్రాలూ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోబడ్డాయి. 1958 నుంచీ భారత ప్రభుత్వం All India Radio కు భారతీయ సాంస్కృతిక నామంగా 'ఆకాశవాణి' అనే పేరును స్వీకరించి ఈ నామానికి ప్రథమ తాంబూలం ఇచ్చింది. 'ఆకాశవాణి' నామం రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు గారి ప్రస్తావనల నుండి తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం సముచితం.

1997 నవంబర్ 23 న 'ప్రసార భారతి కార్పోరేషన్' ఏర్పాటు చేయబడి ఆకాశవాణి, దూర్ దర్శన్ లు స్వతంత్ర ఉమ్మడి సంస్థగా ఒక వ్యవస్థగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

'ఆకాశవాణి'గా పిలవబడుతున్న నేను సమాజం కోసం చేస్తున్న సంక్షేమం:

సమాజ హితం కోసం, విషయాన్ని వెంటనే చేరవేయడం కోసం, విని, ఆకళింపు చేసుకొని, ఆలోచించుకొని స్పందించడం కోసం రూపొందించబడి ప్రసారం చేస్తున్న కార్యక్రమాల పరంపరలో... ఆ ఒరవడిలో ఉన్న నన్ను Radio is the medium of mass communication అని మీరే పిలిచారు.

Radio అంటే transmission of signals అనేది నా పనికి నిర్వచనం కావచ్చు గాక. అది సాంకేతికంగా నా ఉనికి. నా సిద్ధాంతం మటుకు, నిరక్షరాస్యుడు కూడా విని అర్థం చేసుకోగలిగే మాధ్యమంగా ఉండగలగడం రేడియో విధి. డొంకతిరుగుడు లేకుండా, తనదైన మాండలికంలో, తానున్న తావున ప్రాంతీయశైలిలో ఒక విషయం గురించిన కథ వినిపిస్తుంటే చెవులు అటు వేసి వింటూ, పనిపాటలు చేసుకొనే సౌలభ్యం ఉండటం మూలంగా ఆది నుండీ నేటి వరకూ నా ప్రయోజనం మీకు తెలిసివస్తూనే ఉంది కదా!

ఈ బృహద్వ్యవస్థ చెవులతో పని పడ్డ ప్రసార వ్యవస్థ. 'ఆకాశవాణి'లో వినే వాటిని ఆకళింపు చేసుకొనేటందుకు మానసిక ప్రయత్నం చాలా అవసరమని నిపుణులు చెప్పిన మాట. అంత గొప్ప ప్రయత్నం విజయవంతం కావాలంటే అంతే సజీవంగా, సహజంగా అల్లుకోగలిగేలా చెప్పే మాటల తీరుతెన్నులు వాస్తవాలపై ఆధారపడి ఉండాలి అంటాను నేను. రేడియోలో పనిచేస్తున్న ప్రయోక్తలందరూ అంతటి వాస్తవాలకు, ప్రజల సహజ జీవన రీతులకు స్వరాకారం ఇస్తూనే వస్తున్నారు.

నా గొంతుతో... సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకొచ్చారు, విస్తృత ప్రచారం చేసారు. సామాన్య పౌరుడికి కూడా ఒక భరోసాని అందించారు. ఒక నమ్మకాన్ని కలిగించారు. ప్రజా సేవా ప్రసార వ్యవస్థను ప్రజలకోసమే నిర్మించి నిర్వహిస్తున్నారు. అన్నట్టు సందర్భోచితం కాబట్టి చెప్తున్నా, ఐక్యరాజ్య సమితి ఈ 2022వ సంవత్సరాన్ని ప్రపంచ రేడియో వ్యవస్థని గౌరవిస్తూ Radio and Trust గా ప్రకటించింది.

ఒక ప్రసార మాధ్యమం ప్రజా సేవా వ్యవస్థగా పరిగణించబడ్డం

గొప్ప సంగతి:

మీరు సరిగ్గానే చదువుతున్నారు – భారతదేశం లాంటి ఉపఖండ పరిస్థితులు, వాతావరణం, పలు సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, వేషభూషలు ఉన్నట్టి చోట ప్రజలందరి సామూహిక సౌభాగ్యం కోసం పనిచేస్తున్న ఒక చైతన్య స్వరం ఆకాశవాణి. 23 భాషల్లో, 179 మాండలికాల్లో దేశవ్యాప్తంగా 479 కేంద్రాల ద్వారా (నేరుగానూ, సహాయక కేంద్రాల ద్వారానూ) నిరంతరం 24x7 ప్రసారాలు అందిస్తూ వస్తున్న ఏకైక ప్రజా సేవా ప్రసార మాధ్యమాన్ని నేనే. ఇది గర్వంగా చెప్పుకునే మాట కాబట్టి 'నేనే' అంటున్నా, నేనంటే మీరే అని చెప్పాను కదా! ఇది జనవాణి, అదే మీ... 'ఆకాశవాణి'.

ప్రభుత్వం చెప్తున్నట్టుగా, ఆకాశవాణి నిపుణులు తెలియజేస్తున్నదాన్ని బట్టి రాబోతున్న క్రొత్త సాంకేతిక పరిజ్ఞానం ప్రజా ప్రసార వ్యవస్థకు చెప్పలేనంత దన్ను ఇవ్వగలుగుతుంది. దాని సహాయంతో అత్యంత వేగంగా, నాణ్యమైన కార్యక్రమాలు ప్రసారం చేయగలిగే సత్తా వ్యవస్థలకు దక్కుతుంది. వ్యాపారం–లాభాలు ప్రధానంగా నడిచే విపణి శక్తుల పోకడ నుండి ప్రజలకు, ప్రసార వ్యవస్థలకు ఉపశమనం లభిస్తుంది. ప్రయోజనకరంగా వ్యవహరించడమన్నది నేడు నిర్వహించవలసిన బాధ్యత.

ఇదంతా ఎవరి ప్రయోజనం కోసమనే ఆలోచన ఇప్పటికే వచ్చి ఉంటుంది, అసలిది ఇపుడు అవసరమా అని కూడా అనిపిస్తూ ఉండొచ్చు. ఇదంతా లేకుండా మనలేమా అని అనుకున్నా అనుకుంటారు మీరు.

ఒక విషయాన్ని విని ఆలోచన చేయడం ద్వారా వ్యక్తి ఊహాశక్తికి జవం జీవం అందుతాయి. తార్కికంగా ఆలోచిస్తూ ఒక రూపాన్ని మనస్సులో కట్టుకుంటూ ఉంటాడు. మంచి చెడులు గ్రహిస్తాడు. నేరుగా వస్తువుని చూస్తే కలిగే చైతన్యం కంటే, విని ఆలోచనల్లో గ్రహింపుకు తెచ్చుకోవడం అనేది మెదడుకు వ్యాయామం. బుర్రకు పదును. అది వేసే ముద్ర శాశ్వతం.

**ఊహ మనిషి మేధకు పదును పెడుతుంది.**

ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్ని ఒక్కమారు అవలోకనం చేసుకోండి. గంపగుత్తగా మీ అందరి ముందూ గుట్టగుట్టలుగా ఒలకబోసుకుంటూ వెళ్ళిపోతున్న ఎన్నెన్నో వినోద క్రీడా కార్యక్రమాల్ని రూపొందిస్తూ ఉన్న దృశ్య–శ్రవణ మాధ్యమాలు– అవి సంప్రదాయ రేడియో, టీవీ లైనా; సినిమాలు, ఇంటర్నెట్ మాధ్యమాలు అయినా వినోదపు పాలు ఎక్కువ, సంక్షేమపు పాలు పరిమితం. ఈ ఒరవడిలో మనిషి మాటకు ఒక మన్నన, అభిప్రాయానికి ఒక గౌరవం అందించిన విషయ పరిజ్ఞానానికి ఒక మర్యాద ఇస్తూ ఒక ప్రామాణికతను రూపొందించుకున్న స్వీయ క్రమశిక్షణ కలిగిన వ్యవస్థను నేను. నాకీ ఆకారాన్ని ఇచ్చింది మీరే.

వరద వచ్చినా, తుఫాను భీభత్సం ముంచుకొచ్చినా, వ్యవసాయం పనులు తెలియజేసినా, క్రీడా విశేషాలు అందించినా, విజ్ఞాన శాస్త్ర విషయాలు ఎంతో సరళంగా సామాన్య ప్రజలకు అర్థమయ్యే తీరున చెప్పుకొచ్చినా, దేశ యువతకు విద్యా–ఉద్యోగ విషయకంగా ప్రేరణగా నిలిచినా, జాతి నేతల–శాస్త్రవేత్తల స్ఫూర్తి దాయక ప్రసంగాలు సందర్భోచితంగా వినిపించినా, సంగీత–సాహిత్యాల కళారూపాల్ని గణనీయంగా ప్రోత్సహించినా – public place for learning గానే నిలిచాను తప్ప silliness గా ఏనాడూ లేను. నాకున్న పోడిమి నాకున్న వివేకమే.

**ఆకాశవాణి సమయం:**

అవును, రేడియో 'టైమ్' నడిచింది. నేను చెప్పిందే వేదం. నిజంగానే సత్యం చెప్పే తత్వం కనుక నా సమయాన్నే దేశం అనుసరించింది. ప్రజలకు హితమైనదే వాళ్ళకు నేర్పాను. ఇప్పుడూ సమయపాలనలో నా నడక మారలేదు. రేడియో సమయమే ఒడిదుడుకులకు గురైంది. కారణం కూడా స్పష్టమే, కాలంతోపాటు ఆవిర్భవించిన నవీన సాంకేతికత. అది మోసుకొచ్చిన సౌలభ్యం, వినోదాన్ని అరచేతిలో ఉంచగలిగే సౌకర్యం.

అందుకే, నేనూ మారాను. నా తత్వం స్థిరంగానే ఉంది. మీకు అందుబాటులోకి రావడానికి నా స్వరాన్ని సాంకేతికత బాట పట్టించాను. మేజాబల్ల పై నిండుగా పెద్ద పెట్టెలా ఉండే నేనిప్పుడు మీ చేతిలో చిన్న పరికరాన్ని అయిపోయాను. అప్పుడైనా, ఇప్పుడైనా నా ధ్వని తరంగాలు మిమ్మల్ని చేరడమే జరుగుతున్నది. అందుకు నా శరీరం ఎలా ఉన్నా నాకు సంతోషమే. మిమ్మల్ని పలకరించడం నా కర్తవ్యం. నన్ను మీరు ఉపయోగించుకోవడం మీ వివేకం.

మతములెన్ని (మతం=అభిప్రాయం) ఉన్నా సమ్మతమే నా సాధనం. ఖేదం కలిగించే వాదనలకంటే వివేకానందం ఒనగూర్చే గాథలు మీతో పంచుకోవడమే నా కర్తవ్యం. హద్దులెరిగిన పెద్దమాటలే నా వాణి. అద్దంలో ప్రతిబింబంలా మీరున్న సమాజాన్ని మీకు సముచిత ధోరణిలో అవగతం చేయడంలోనే నా సిద్ధి. ఇంతటి ఎరుక మీకు కలిగిస్తున్న నేను కంటికి కాక మనసుకు కనిపించే నేస్తాన్ని. నన్ను సొంత మనిషిగా అనుకోవడంలోనే మీ సంక్షేమం ఉందనే గ్రహింపు తేవడమే ఈ ప్రజా సేవా ప్రసార దినోత్సవ వేళ నే చేస్తున్న మంచి పని. సెలవా మరిక, జై హింద్!

వ్యాసకర్త, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్తు


## కవితల సంపుటి పోటీ: ఆహ్వానం

స్వర్గీయ పాతూరి మాణిక్యమ్మ స్మారక జాతీయ స్థాయి పురస్కారం–2022 కొరకు కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నాము. 2021లో ప్రచురింపబడిన వచన కవితా సంపుటులను మాత్రమే ఈ పోటీకి పంపాలి. ఎంపిక అయిన ఉత్తమ కవితాసంపుటికి రు.5,000/– నగదు బహుమతిని ఇస్తాము. పరిశీలన నిమిత్తం రెండు కవితా సంపుటులను డిసెంబర్ 2022 లోపు (31-12-2022) ఈ కింది చిరునామాకు పంపాలి.

**డా. పాతూరి అన్నపూర్ణ,**
1156/28-1, ప్రశాంతినగర్, నవలాకులగార్డెన్స్,
నెల్లూరు–524002, సెల్: 9490230939.

డా. శ్రీరాములు గోసికొండ
9248424384

# సరికొత్త డిజైన్లే చేనేతరంగానికి సంజీవని
# చేనేత వారసత్వ సంపదను పరిరక్షించేదెలా?

**మన** భారత సాంప్రదాయం ప్రకారం శుభకార్యాలప్పుడు బంధు–మిత్రులకు కొత్త వస్త్రాలు పెట్టడం ఆనవాయితీ. అలాగే శాలువా కప్పడం వంటిది గౌరవానికి సంకేతం. అంటే మన దేశంలో సంస్కృతి–సంప్రదాయాలకు వస్త్రాలతో ఉన్న అనుబంధం విడదీయరానిది. ప్రతీ పండుగకు ముందు ముఖ్యంగా దసరా, దీపావళి, సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్, పెళ్ళిళ్ళ సీజన్లలో, ఆషాడ–శ్రావణ మాసాల్లో బట్టల దుకాణాలు కిటకిటలాడుతాయి. చాలా షాపులు లాభాలబాటనే నడుస్తాయి. అలాగే పెద్ద పెద్ద షాపింగ్ మాళ్ళు, వారి బ్రాంచీలను కొత్త కొత్త పట్టణాలు/నగరాలకు విస్తరించుకోవడం చూస్తున్నాం. కానీ నేతన్నల యొక్క ఆదాయము ఎన్నడు పెరిగిందీ లేదు, వారి కుటుంబాల్లో ఆనందపు హరివిల్లు విరిసిందీ లేదు. దేశంలో మనిషికి బట్టకట్టించి నాగరికత నేర్పిన నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడడం మానవతావాదులను ఆందోళనపరుస్తున్నది.

**తెలుగు రాష్ట్రాల మధ్య చేనేత అనుబంధం**

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సుమారు 2 లక్షలకు పైగా నేత కార్మికులు ఉన్నారు. ప్రస్తుతానికి ఈ రెండు రాష్ట్రాలు వివిధ రకాల చేనేత వస్త్రాలకు ప్రసిద్ధిగాంచాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, బందరు, బందరులంక, మంగళగిరి, చీరాల, మాధవరం ప్రాంతాలు పట్టు చీరలకు ప్రఖ్యాతికాగా, పోలవరం, పెడన కళంకారి చీరలకు, ఏలూరు కార్పెట్లకు, పొందూరు ఖద్దరు చీరలు, ఖద్దరు వస్త్రాలకు, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాలు లుంగీలు, బెడ్ షీట్లు, షర్టింగ్ వస్త్రాలకు పేరెన్నికగన్నాయి. తెలంగాణలో పోచంపల్లి ఇక్కత్ చీరలకు, గద్వాల పట్టుచీరలకు, నారాయణపేట కాటన్ చీరలకు, వరంగల్, కరీంనగర్ తువ్వాళ్ళు, లుంగీలు, బెడ్ షీట్లకు ప్రసిద్ధికెక్కాయి. తెలంగాణ నుండి తిరుపతి వేంకటేశ్వర స్వామి వారి సన్నిధికి చేరే ఏకైక కానుక గద్వాల (ఏరువాడ) జోడు పంచెలు ఒక్కటే. వీటిని గత 400 సం.ల నుండి గద్వాల సంస్థానరాజులు స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. దుర్గాష్టమి/దసరా పండగలప్పుడు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో, మొదటిరోజున స్వామివారి మూలవిరాట్టుకు ఈ ఏరువాడ పంచెలనే ధరింపజేస్తారు. వీటిని ఐదుగురు నేత కార్మికులు 45 రోజులు అత్యంత నిష్ఠతో నామాల మగ్గంపై నేస్తారు. 11 గజాల పొడవు, 22 ఇంచుల వెడల్పుగల ఈ జోడు పంచెలను బ్రహ్మోత్సవాలకు ముందే ఒక నేతకార్మికుడు ఆలయ ప్రధానార్చకులకు అప్పజెప్తాడు. ఇది పద్మశాలీలకు, ముఖ్యంగా చేనేత వృత్తికి, నేతన్నలకు దక్కిన ఒక అరుదైన వరం, అవకాశం, గుర్తింపు, గౌరవం. ఇలా తెలుగుప్రాంతాలు భౌగోళికంగా ఈ మధ్యనే రెండు రాష్ట్రాలైనప్పటికీ, ఏడుకొండల వెంకన్నకు గద్వాల నేతన్నకు మాత్రం ఆ ఆధ్యాత్మిక అనుబంధం ఎప్పటినుండో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేతన్నలు మార్కెట్ అవసరాలకనుగుణంగా కొత్త డిజైన్లతో, ఆధునికతను అద్దుతూ వస్త్రోత్పత్తి చేస్తున్నారు. కానీ తెలంగాణ నేతన్నలు ఈ విషయంలో కాస్త వెనుకంజలోనే ఉన్నారు.

**తెలంగాణలో నేతన్నల నైపుణ్యాలు**

నేతన్నలు సాలెపురుగు వలే వస్త్రాన్ని నేసే నైపుణ్యాలున్నందుచేతనే వారిని పద్మశాలీలని పిలుస్తున్నారు. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర, ఉంగరం, దబ్బనంల నుండి సైతం దూరగల అత్యంత పల్చటి పట్టుచీర, సుగంధాలు వెదజల్లే 'సిరిచందన పట్టుచీర', కుట్టులేని లాల్చీ–పైజామా తదితర సృజనాత్మక వస్త్రాలను ఉత్పత్తి చేయగల నేతన్నల్లో నైపుణ్యాలకు ఏ మాత్రం కొదువలేదు. తెలంగాణలోని నేతన్నల ఆవిష్కరణలకు మొత్తం దేశంలోని వస్త్ర పరిశ్రమనే అబ్బురపడుతుంది. ఈ మధ్యనే కమలాపూర్, సిద్దిపేట ప్రాంతాలకు చెందిన నేత కార్మికులు వారి సొంత ఆలోచనలతో రామప్ప చీరలు నేయడమనేది నేత కార్మికుల్లో ఉన్న నైపుణ్యాన్ని ప్రపంచానికి మరోసారి చాటిచెప్పింది. ఈ మధ్యనే సిరిసిల్ల నేతకార్మికులు తయారుచేసిన పట్టుచీరలను 'రాజన్న సిరిపట్టు' అనే బ్రాండుతో న్యూజిలాండ్ మంత్రి ఆవిష్కరించారు. ఆ చీరలను అంతర్జాతీయంగా విక్రయించేలా తగు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఇలా వివిధ వస్త్రాలు నేసే నేత కార్మికులకు ఆధునికత–సృజనాత్మకతలను జోడించి మార్కెట్ డిమాండుకు తగ్గట్టుగా వస్త్రోత్పత్తి చేసేలా శిక్షణనిప్పించాలి. రాష్ట్ర వ్యాప్తంగా చీరలు, తువ్వాళ్ళు, లుంగీలు, దస్తీలు, జంపఖానలు, చద్దర్లు, బెడ్ షీట్లు, డోర్ కర్టెన్లు నేసేవారిలో నుండి మంచి నైపుణ్యం/పనితనం కనబరిచే వారిని గుర్తించి, వారికి కొత్తకొత్త డిజైన్లతో ఎలా ఆకర్షణీయ వస్త్రాలను నేయవచ్చో నేర్పించాలి. దీనికోసం ప్రభుత్వం కొంత బడ్జెట్ కేటాయించి, ఆధునిక ఆసుయంత్ర రూపశిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన చింతకింది మల్లేశం, సిరిసిల్లకు నల్ల విజయ్, రాష్ట్రంలోని ప్రముఖ పెయింటర్లు, ఆర్టిస్టులు, శిల్పకారులు, తదితర లలిత కళాకారులతో నేత కార్మికులకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలి. ఎక్కడో ఉన్న చైనా వాళ్ళు, మన సంస్కృతిని, పండుగలను అర్థం చేసుకొని దీపావళి బాంబులు, పతంగులు, వాటి దారాలు తయారుచేసి లాభాలు గడిస్తుంటే, మనం మాత్రం ఎందుకు ఆ దిశగా ఆలోచించకూడదు? ఆ ఆలోచన, నేతన్నల నుండే ఎందుకు మొదలు కాకూడదు?

**కాదేదీ కళకు అనర్హం**

చీరలపై ఒక్క రామప్ప దేవాలయంపైనున్న ఏనుగు డిజైన్లే కాదు,

ఎన్నో కొంగొత్త డిజైన్లు వేసి, కునారిల్లుతున్న చేనేతరంగానికి పునర్వైభవం తీసుకరావచ్చు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలైన చార్మినార్, కాకతీయ కళా తోరణం, బతుకమ్మ, బతుకమ్మ తయారీలో వాడే పువ్వులైన తంగేడు, గునుగు, పట్టుగుచ్చు, గుమ్మడి, బంతి, చామంతి, కమలం, ఇతర పుష్పాలైన మందారం, కనకాంబరం, మల్లెమొగ్గ, మల్లెపువ్వు, గులాబి, తులిప్, లిల్లీ, జాతీయ పక్షి నెమలి, నెమలి పింఛం, పిల్లనగ్రోవి, రాష్ట్ర చిహ్నాలైన పాలపిట్ట, జింక, జమ్మిచెట్టు, ఇంకా హమ్మింగ్ బర్డ్, హంస, రామచిలుక, పిచ్చుక, పావురం, బాతు, కొంగ, గువ్వ, మైనా, ఉడత, గుర్రం, పల్లకి, కుందేలు, చేప, డాల్ఫిన్, తిమింగలం మొదలైనవన్నీకలిపి లేదా రకరకాల కాంబినేషన్లతో లేదా ఏదైనా ఒక్కటి గానీ చీర అంచుగాగానీ, కొంగుగా గానీ, చీర మొత్తం గానీ, జాకెట్ పీస్ పై గానీ డిజైన్ వచ్చేలా చూడాలి. వీటిని వివిధ రంగుల్లో నేయాలి. బతుకమ్మ పండుగకు ఇచ్చే చీరలపై ఆ పేరుకు, పండుగకు తగ్గట్టుగా చిన్న చిన్న సైజుల్లో బతుకమ్మ డిజైన్లు కూడా నేయవచ్చు. పింజర పై ఈ డిజైన్లను వేయించి, మగ్గంపై చేతులతో చీరలను నేయించాలి. అప్పుడే వీటి నాణ్యతా ప్రమాణాలు మర మగ్గంపై గానీ, ప్రింటెడ్ డిజైన్లతో గానీ ఉత్పత్తి అయ్యే చీరలకంటే బాగుంటాయి. ఇలా నేతన్నలు, మహిళామణులు మెచ్చే కళాత్మక చీరలను చేతులతోనేసే మగ్గంపై తయారుచేసినట్లయితే, వారి ఉపాధికి ఢోకా ఉండదు.

**అందరూ కొనుగోలు చేసేలా చీరల తయారీ ఎలా?**

మార్కెట్‌లో కేవలం మామిడిపిందె లేదా బుట్ట డిజైన్లతో ఉన్న చీరలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి కొత్త డిజైన్లతో నేసిన చీరలు మహిళాలోకాన్ని ఇట్టే ఆకర్షించే అవకాశం ఉంది. అలాగే మన భారత సమాజంలోని ప్రజల యొక్క ఆర్థిక అంతరాలను దృష్టిలో ఉంచుకొని చీరలు నేయాలి. అంటే ప్రస్తుతానికి పట్టు చీరలు మధ్య తరగతి, ఉన్నత తరగతుల వారికే అందుబాటులో ఉన్నాయి. అధిక ధరల కారణంగా పేదవారు, వర్కింగ్ క్లాస్ వారు పెళ్ళిళ్ళు, తదితర శుభకార్యాలప్పుడు తప్ప, పట్టుచీరలు కొనడానికి పెద్దగా మొగ్గుచూపరు. కానీ **ఈ వర్కింగ్ క్లాస్ వారినే దృష్టిలో పెట్టుకొని చీరల తయారీ ఉన్నప్పుడే, మార్కెట్‌లో చేనేత వస్త్రాలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది.** దానికోసం డిజైన్‌లను మార్చకుండా, చీర నేసేటప్పుడు ఆయావర్గాలకు అందుబాటులో ఉండేవిధంగా జరీ/పట్టును ఉపయోగించాలి. ఎందుకంటే, చీర తయారీలో అధిక ఖర్చయ్యేది జరీకే. కావున చీర నేసేటప్పుడు పేద/వర్కింగ్ క్లాస్ వారికి తక్కువ జరీ, మధ్యతరగతి వారికి మధ్యస్థంగా జరీ, ఉన్నతవర్గాల వారికి ఎక్కువ మొత్తంలో జరీ వినియోగించాలి. నేతన్నలు ఎప్పుడూ మూసపద్ధతిలోనే చీరలు నేయకుండా, వివిధ సామాజికవర్గాల యొక్క సంస్కృతి-సాంప్రదాయాలు, పండుగలు-పబ్బాలు-పర్వదినాలకు తగ్గట్టుగా, అవి ప్రతిబింబించేట్టుగా చీరలు నేసే సృజనాత్మక ఆలోచనలు కూడా చేయాలి. ఇంకా, ఒక్క చీరలే కాకుండా మహిళలు ధరించే అన్నిరకాల వస్త్రాలు, మగవారి కోసం సూటింగ్, షర్టింగులను కూడా నేచేటట్టుగా శిక్షణ ఇవ్వాలి. వీటిని మంచి నాణ్యత, మన్నికతో, అందరికీ అందుబాటు ధరలో ఉత్పత్తిచేస్తే చేనేతరంగం కలకాలం వర్ధిల్లుతుంది.

**సరికొత్త డిజైన్లతో ఇతర వస్త్రోత్పత్తులు**

అలాగే డోర్ కర్టెన్స్, కిటికీ కర్టెన్స్ మీద ఎన్నో డిజైన్లు వేయవచ్చు. పైన పేర్కొన్నవే కాకుండా, ఇతిహాసాలు, పురాణాల్లోని ముఖ్య ఘట్టాలు, దేశం/రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల నమూనాలు, వివిధ దేవుళ్ళ రూపాలు ముఖ్యంగా బుద్ధుడు, హనుమాన్, గణపతి, శివుడు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల్లో కొలువైయున్న దేవి యొక్క వివిధ రూపాలు, ఆదిశక్తి, సమ్మక్క-సారక్క, భద్రకాళీ, కనకదుర్గ, బద్ది పోచమ్మ, పెద్దమ్మతల్లి, బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ మహంకాళి, కొమురవెల్లి మల్లన్న, పార్వతీ, సరస్వతి, లక్ష్మి యొక్క అష్టావతరాలు, విష్ణుమూర్తి యొక్క దశావతారాలు, వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహ స్వామి, సత్యనారాయణ స్వామి, రాఘవేంద్ర స్వామి, పద్మనాభ స్వామి, అయ్యప్ప స్వామి, సుబ్రమణ్య స్వామి, దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, మెదక్ చర్చ్, జీసస్ క్రైస్ట్, మక్కామసీదు, అజ్మీరు దర్గా, తాజ్ మహల్, ఎర్రకోటల యొక్క డిజైన్లను రూపొందించి మగ్గాలపై నేయవచ్చు. ప్రముఖ రాజులైన అశోక చక్రవర్తి, పురుషోత్తముడు, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీభాయి, శివాజీ, టిప్పు సుల్తాన్, బింబిసారుడు, హర్షవర్ధనుడు, చంద్రగుప్త మౌర్యుడు, శ్రీకృష్ణ దేవరాయలు, అక్బర్, తెనాలి రామకృష్ణుడు, బీర్బల్, వివేకానందుడు, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, కొమురం భీం, సురవరం ప్రతాపరెడ్డి, స్వాంతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలు మొదలైన వారి రూపాలను కూడా డోర్ కర్టెన్స్, కిటికీ కర్టెన్స్ మీద నేయవచ్చు. రకరకాల పండ్లు, ప్రకృతి డిజైన్లతో డైనింగ్ క్లాత్, టేబుల్ క్లాత్ లను నేయవచ్చు. అలాగే రంగురంగుల్లో నెమలి, నెమలి పింఛం, పిల్లనగ్రోవి వంటి డిజైన్లతో తువ్వాళ్ళు, దస్తీలను కూడా నేయవచ్చు. ఇంకా చిన్నపిల్లలకోసం ప్రత్యేకంగా తువ్వాళ్ళు, దస్తీలపై బార్బి బొమ్మ, సూపర్ మ్యాన్, డోరోమ్యాన్, స్పైడర్ మ్యాన్, బాల గణేషుడు, పులి, సింహం వంటి జంతువులు, కారు, బస్సు, బుల్లెట్ రైలు, షిప్పు, విమానం, తదితర మోటారు వాహనాల డిజైన్లను నేసినట్లయితే మంచి గిరాకీ ఉంటుంది. ఈ డిజైన్లకు జియోగ్రాఫికల్ ఇండికేషన్(జిఐ) వచ్చేలా కృషిచేసి, ఇవే డిజైన్ లతో చీరలు మొదలుకొని దస్తీల వరకు ఏ విధమైన ప్రింటింగ్ వస్త్రాలు కూడా మార్కెట్లోకి రాకుండా అడ్డుకట్టవేయవచ్చు. పోచంపల్లి ఇక్కత్ చీరలు 2013 లోనే జిఐ గుర్తింపు పొంది ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లో కూడా నమోదు చేయబడ్డాయి. అలాగే 2021 లో పోచంపల్లి ప్రపంచవ్యాప్తంగా 'బెస్ట్ టూరిజం విలేజ్' గా యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం సంస్థ ప్రకటించింది.

**డిజైన్ల ఎంపికలో సామాజిక స్పృహ అవశ్యం**

ఈ మధ్య కాలంలో బుద్ధుడి బొమ్మను అందరూ ధరించే వస్త్రాలపై చూస్తున్నాం. కానీ తెలుగు రాష్ట్రాల్లోని నేతన్నలు నేయబోయే చీరలు, అందరి సెంటిమెంట్లను గౌరవించి, ఏ వర్గం వారి మనోభావాలు దెబ్బతినకుండా ఏ డిజైన్, ఏ రకమైన వస్త్రానికి వాడాలో అనే విషయంపై లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఈ డిజైన్ల వల్ల ఏ వర్గంవారైనా అభ్యంతరం వ్యక్తంచేస్తే, మొదటికే మోసం వస్తుంది. ఆ వస్త్రాల అమ్మకం ఆగిపోవడమే కాక, పెట్టిన పెట్టుబడి కూడా రాక ఇంకా నష్టం వాటిల్లుతుంది. ఇంకా, ఆ తప్పు పద్మశాలి కులం మొత్తానికి ఆపాదించబడుతుంది. ఒకవైపు ఆధునిక ఆలోచనా భావాలు కలిగి ఉంటూనే, మన చరిత్ర నుండి ఏ రకమైన డిజైన్లు ఎంచుకుంటే ఈ

తరానికి ఉపయోగపడుతుందో బేరీజు వేసుకొని మరీ అంతరించే దశలో ఉన్న చేనేత రంగాన్ని కొత్త పుంతలుతొక్కిస్తూ, నిరాశా నిస్పృహల్లో ఉన్న నేతన్నల ముఖాల్లో చిరునవ్వు తొణికిసలాడేలా, వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసేలా కృషి చేయాలి. ఈ విధంగా నేతన్నలు నూతన డిజైన్లతో వస్త్రాలు నేయడంతోపాటుగా, వారికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహాయసహకారాలు ఉన్నప్పుడే చేనేతరంగం బతికిబట్టకడుతుంది.

**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలు**

తెలంగాణ ఉద్యమ సందర్భంగా తెరాస పార్టీ ఇచ్చిన వాగ్దానాలను, దాని ఎన్నికల మ్యానిఫెస్టోల్లో పొందుపరిచిన హామీలను నెరవేర్చితే కునారిల్లుతున్న చేనేత రంగాన్ని పునరుద్ధరించవచ్చు. అలాగే నేతన్నలను నేరుగా ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాలి. వినైల్ ఫ్లెక్స్ ప్రింటింగులను దశలవారీగా బందుచేయించి, 'బట్టతో చేసిన బ్యానర్' లను ప్రోత్సహించాలి. దీనివల్ల నేతకార్మికులకు పని కల్పించడమే కాకుండా, పర్యావరణాన్ని పరిరక్షించినట్లవుతుంది. ఈ విషయంలో ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చొరవ ఆదర్శనీయం, అభినందనీయం, అనుసరణీయం కూడా. ఉన్నత విద్యాసంస్థల్లో స్నాతకోత్సవానికి నూలుతో ఉత్పత్తి చేసే చేనేత వస్త్రాలను మాత్రమే వాడేవిధంగా ఆదేశాలు జారీ చేయాలి. ఎన్నో విషయాల్లో ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం, ఈ చర్యలు కూడా తీసుకోవాలి. అలాగే, రాష్ట్రంలో ఉన్న 334 చేనేత సహకార సంఘాల్లో 2013 సం. లో ఎన్నికకాబడ్డ పాలకవర్గమే ఇంకా కొనసాగుతుంది. అందువల్ల వాటికి తక్షణమే ఎన్నికలు నిర్వహించి, మార్కెటింగ్ నిమిత్తం ఒక్కో సంఘానికి ఒక్కో వ్యాను/మినీ ట్రక్కును ప్రభుత్వమే అందించాలి. దీనివల్ల ఆయా సంఘాల్లో ఉత్పత్తి అయిన వస్త్రాలను వారికి దగ్గరగా ఉండే అంగళ్ళల్లో, జాతర్లలో, ఇతర ఉత్సవాల్లో 'మొబైల్ దుకాణాలు (ఔట్లెట్)' పెట్టి అమ్మడానికి వీలుకలుగుతుంది. ఆసక్తి ఉన్న మగ్గాలు నడిపించే యజమానులకు (మాస్టర్ వీవర్లు), స్వతంత్ర నేతన్నలకు (ఇండిపెండెంట్ వీవర్లు) కూడా ఈ వాహనాలను 50% సబ్సిడీతో అందించాలి. నూలు రేటు తగ్గించి, మీటరుకిచ్చే నేతకూలీని పెంచాలి. రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి గణనీయంగా ఉంది కావున వరంగల్‌లో స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. ఇది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వరంగల్లోనే నెలకొల్పిన 'కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు'లో పెట్టుబడులు వెల్లువలా వచ్చేందుకు కూడా దోహదకారి అవుతుంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ ఆఫీసుల్లో, అన్నిరకాల విద్యాసంస్థల్లో, విద్యార్థుల వసతిగృహాల్లో చేనేత వస్త్రాలనే వాడాలని రాష్ట్ర ప్రభుత్వం లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వాలి. చలి కాలంలో వెచ్చదనాన్ని, ఎండాకాలంలో చల్లదనాన్నిచ్చే చేనేత వస్త్రాల యొక్క విలక్షణ గుణాన్ని, దాని ప్రత్యేకతను ప్రజలందరికీ అర్థమయ్యేలా చేనేత సంఘాలు ప్రచారం చేయాలి. వివిధ పండుగల సందర్భాల్లో రాష్ట్రంలోని ప్రజలందరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేలా వాటి ధరలపై ప్రత్యేక రిబేటులను ప్రకటించాలి. అలాగే, ప్రతి వ్యక్తికి ప్రత్యేక సందర్భాలైన పుట్టిన రోజు, పెళ్లి రోజు, ఇతర జ్ఞాపకార్థపు రోజుల్లో ప్రజలు చేనేత వస్త్రాలు విరివిగా కొనేలా ప్రోత్సహించాలి.

**కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టాల్సిన చర్యలు**

1985లో పార్లమెంట్ ఆమోదించిన చేనేత రిజర్వేషన్ చట్టం (హాండ్లూమ్ రిజర్వేషన్ ఆక్ట్) ప్రకారం, 11 రకాల వస్త్రోత్పత్తులను మర మగ్గాలపై (పవర్ లూమ్) నేయకూడదు. కానీ కొన్నిచోట్ల కొందరు స్వార్థపర యజమానులు మర మగ్గాలపై కూడా రిజర్వ్ చేసిన వస్త్రాలను నేచి చేనేతపైనే ఆధారపడ్డ కార్మికుల పొట్టకొడుతున్నారు. దీనిని కూడా కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళాల్సిన అవసరముంది. మధ్యవర్తులను తొలగించడానికి చేనేత వస్త్రాలను అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మింత్ర, స్నాప్డీల్, మీషో వంటి ఆన్లైన్ విపణుల్లో ఉంచాలి. ఈ 'వీవర్ టు కస్టమర్' విధానం ద్వారా అటు నేతన్న, ఇటు వినియోగదారుడు బాగుపడుతారు. దీనివల్ల ధరలు కూడా కొంత తగ్గి, చాలామంది వినియోగదారులు షాపులకు వెళ్ళకుండానే ఇంటివద్దనుండే కొనుగోలు చేస్తారు. యువతను చేనేత రంగం వైపు ఆకర్షించడానికి వరంగల్‌లో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీని నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. తెలంగాణ ప్రభుత్వం నేత కార్మికుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రతీ సంవత్సరం తగిన బడ్జెట్ కేటాయించాలి. చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జిఎస్టీలో వచ్చే రాష్ట్రవాటాను నేతన్నల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తూనే, ఆ పన్నును మొత్తమే రద్దు చేసేలా ఇతర రాష్ట్రాల సమన్వయంతో కేంద్రాన్ని ఒప్పించాలి. అప్పుడే నేతన్నలు సుభిక్షంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రాన్ని చేనేత వస్త్రపరిశ్రమకు ప్రసిద్ధికెక్కేలా చేస్తారు. తద్వారా తెలంగాణలో తరతరాల వారసత్వ సంపద అయిన చేనేతను పరిరక్షిస్తూనే, ఆ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు నిరంతర జీవనోపాధిని కల్పించవచ్చు.

---

వ్యాసరచయిత సహాయ ఆచార్యులు (అసిస్టెంట్ ప్రొఫెసర్),
నర్సీ మోంజీ డీమ్డ్ యూనివర్సిటీ, హైదరాబాద్




**డాక్టర్ పి. దక్షిణామూర్తి**
**మరికొన్ని వ్యాసాలు-జ్ఞాపకాలు**
పుటలు:208 వెల:రూ.300
ప్రతులకు: డా॥ పాటిబండ్ల దక్షిణామూర్తి
సీనియర్ ఫిజిషియన్
గీతా నర్సింగ్‌హోమ్, తెనాలి-522 201
ఫోన్: 79010 14749




**జీన్‌వాల్ జీన్**
రచయిత:**చెలంచర్ల భాస్కరరెడ్డి**
పుటలు:225 వెల:రూ.200
ప్రతులకు: చెలంచర్ల భాస్కరరెడ్డి
ప్లాట్ నెం. ఎస్17, 14వ వీధి(నార్త్)
సత్యం జి నగర్, వావిళ్లేటిపాడు,
గుండెలపాలెం (పో), నెల్లూరు-3
సెల్: 94404 72840

శ్రద్ధాంజలి

# నిలువెత్తు పుస్తకం నిజాం వెంకటేశం



**నిజాం వెంకటేశం**
కనువెలుగు: 1948
కనుమరుగు: సెప్టెంబరు 18 2022

**సా**హిత్యసేవ పలు రకాలు. కొందరు తమ రచనల ద్వారా, మరికొందరు ప్రసంగాల ద్వారా ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. అలాగే ఇంకొందరు ప్రచురణకర్తలుగా మారి పుస్తకాలను పాఠకలోకానికి అందిస్తారు. భాష, సాహిత్యం బతకాలని సొమ్ములు కూడబెట్టుకొని విలువైన సమాచారంతో పత్రికలు తెస్తున్నవారు ఉన్నారు. రచయితల, వక్తల కృషి, సృజన ఏదైనా ముద్రణ ద్వారానే నిలుస్తుంది. పుస్తక ప్రచురణకు ప్రధానంగా డబ్బు అవసరం. పుస్తకం వచ్చాక దాని అమ్మకాలు అవసరం. దీనంతటికి సాహిత్య పోషకులు, కొని చదివే పాఠకులు కావాలి. ఇలా పుస్తకం బతకడం వెనుక ఉన్న చిక్కుల్ని అర్థం చేసుకొని ఆర్థికసేవ చేసినవారు బహు అరుదు. వారిలో ఒకరు నిజాం వెంకటేశం. పుస్తకం కోసం తన ఆదాయాన్ని కళ్ళు మూసుకొని ఖర్చు పెట్టిన అక్షరప్రేమికుడాయన. సాహిత్యానికి అవసరమైన అన్ని వైపుల్ని సమన్వయంగా ఏకం చేస్తూ ఎన్నో పుస్తకాల రాకకు, చదువరులకు చేరవేతకు కేంద్రంగా నిలిచిన నిజాం వెంకటేశం ఇటీవల తనువు చాలించి తన విధుల్లోంచి నిష్క్రమించాడు. హైదరాబాద్ కేంద్రంగా గత పాతికేళ్ళు ఆయన చేసిన అరుదైన ఆవశ్యక సాహితీసేవకు సెప్టెంబర్ 18న తెర పడింది. ఆయన మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని అన్నవారిమాటల్లో అంతా నిజమే ఉంది.

పుస్తకం, పఠనం రెండూ ఆయన హృదయలయలు. తాను చదివిన పుస్తకం బాగుంటే ఏకంగా పది కాపీలు కొని ఆసక్తిపరులకు పంచిపెడతాడు. పుస్తకం ప్రాముఖ్యతను నొక్కి చెప్పి చదవమని వెంటపడతాడు. పత్రికల్లో వచ్చే కవిత్వాన్ని ఇష్టంగా చదివి కవులను గుర్తుంచుకుంటాడు. ఏ సమావేశంలోనైనా వారు కలిస్తే వెంటేసుకొని సీనియర్లకు పరిచయం చేస్తూ ఆయన కవిత్వాన్ని చదివి వినిపిస్తాడు. బాగా రాయమని ఆ యువకవిని ప్రోత్సహిస్తూ వెంటున్న సంచిలోంచి నాలుగు పుస్తకాలు తీసి చదవమని ఆయన చేతిలో పెడతాడు. పుస్తకం వేస్తే సంప్రదించమని తన ఫోను నెంబరు ఇస్తాడు. పిల్లలు జాతరలో తిరుగుతూ సంబర పడ్డట్లు వెంకటేశం సాహిత్య సమావేశాల్లో కలియ తిరుగుతూ, అందరిని పలకరిస్తూ ఆ మధ్య వచ్చిన, చదివిన పుస్తకాల గురించి చెప్పుకొస్తాడు. 74 ఏళ్ల వయసులో కూడా పుస్తకం ఆయన్ని ఉత్సాహంగానే నడిపించింది. ఈ ప్రయాణంలో అనూహ్యంగా ఆయన చేతిలో పుస్తకంతోనే హఠాత్తుగా వచ్చిన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త విన్నవారు ఔనా.. నిజమా.. అనేంత విస్మయపరిణామమిది.

వెంకటేశం 1948లో సిరిసిల్లలో జన్మించారు. అప్పుడది కరీంనగర్ జిల్లాలో తాలూకా కేంద్రం. అందరికి చిన్ననాటి మిత్రులున్నట్లే వెంకటేశంకు చదువు మొదలైన పాఠశాల గ్రంథాలయంలోనే పుస్తకంతో బాల్య స్నేహం ఏర్పడింది. చదువులో చురుకైనా హైదరాబాద్ వచ్చి వైద్యవిద్య చదివే ఆర్థిక స్తోమత లేక నిజామాబాద్‌లో పాలిటెక్నిక్‌లో చేరి డిప్లమో పూర్తి చేసి 1968 లో విద్యుత్ శాఖలో ఉద్యోగిగా చేరారు. ఏ ఊర్లో పని చేసినా అక్కడి గ్రంథాలయంలో ఆలుమగల పేరిట సభ్యత్వం తీసుకొని కనీసం అయిదు పుస్తకాలు తెచ్చుకొనేవారు. ఆయా ఊర్లలోని కళాశాలలకు వెళ్లి అధ్యాపకులతో పరిచయాలు పెంచుకొని సాహిత్య చర్చలు, సమావేశాలను ప్రోత్సహించేవారు. అదే ఊపులో కాలేజీ లైబ్రరీలోని పుస్తకాలను చదివేసేవారు. ఎక్కడ పనిచేసినా తన అలవాటు ప్రకారం హైదరాబాద్ వెళ్ళినపుడు మోసేన్ని పుస్తకాలు కొనుక్కొచ్చి అక్కడి రచయితలకు, సాహితీప్రియులకు పంచేవాడు. ఆయన ఉద్యోగం చేసిన కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన అన్ని తరాల రచయితలు ఆయనను సాహితీ గురువుగా భావిస్తారు. తమకు ఎన్నో గొప్ప పుస్తకాలను పరిచయం చేసి తమ రచనలకు మార్గదర్శకుడిగా ఉన్నారని చెప్పుకుంటారు. ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూ కోసం కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ తనకు తోడుగా తన పరిచయకర్తగా కోరి మరీ వెంకటేశంను స్టూడియోకి తీసుకెళ్లాడు. పెద్దింటి కథలు, నవలలపై ఆయన విశ్లేషణ కార్యక్రమానికి వన్నె తెచ్చింది.

పిన్న వయసులో మరణించిన కవి అలిశెట్టి ప్రభాకర్‌తో వెంకటేశంకున్న అనుబంధం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అనారోగ్యంతో బాధపడిన ప్రభాకర్‌ను కాపాడేందుకు ఆయన ఎంతో ప్రయత్నించాడు. ప్రభాకర్ కవిత్వాన్ని ఎంతో ఇష్టంగా పలవరించే వెంకటేశం అన్ని దశల్లోనూ ప్రభాకర్‌కు తోడు నిలిచాడు. 1988లో ప్రభాకర్‌ను జగిత్యాలకు రప్పించి ఆయన ఆరోగ్య, కుటుంబ బాధ్యతలను తనపై వేసుకున్నాడు. అయితే 'సిటీలైఫ్' ఆగిపోతుందని ఓ కాగితం ముక్క

రాసిపెట్టి అలిశెట్టి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశాడు. ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అలిశెట్టి ప్రభాకర్ ఎవరి సహాయాన్నీ అంగీకరించేవాడు కాదు. అయితే వెంకటేశం చేసే ఆర్థిక సాయానికి మాత్రం ప్రభాకర్ అడ్డుచెప్పేవాడుకాదు. దానిని ప్రస్తావిస్తూ అలిశెట్టి ఓ కవితలో-'ఘల్లున గచ్చుమీద రూపాయి/ బిళ్ళ మోగినట్లు/ నిజాం వెంకటేశం వస్తాడు/ నన్నూ నా రోగాన్ని మందుల్నీ కవిత్వాన్నీ/ కవుల్నీ తిట్టిన తిట్టు తిట్టకుండా/ కసితీరా తిట్టి / మధ్యలో రూటు మార్చి/ మహాశ్వేతాదేవిని మెచ్చుకొని/ తరచుగా సాహిత్య సభల్లో పాల్గొన/ లేనందుకు నొచ్చుకొని/ నాకో వందిచ్చుకొని మరీ నిష్క్రమిస్తాడు' అని రాసుకున్నాడు. వంద పుచ్చుకున్న ప్రభాకర్‌పై కవితా పంక్తుల్లో వెంకటేశం సాహిత్య దృక్కోణాన్ని కూడా తేటతెల్లం చేశాడు. 2013లో అలిశెట్టి ప్రభాకర్ కవితా సంపుటి రావడంలోను వెంకటేశం ప్రధానపాత్ర పోషించాడు.

కవిత్వం పట్ల అత్యంత ప్రేమతో వెంకటేశం 1980 దశకంలో దిక్సూచి అనే కవితా సంచికను వెలువరించారు. అలిశెట్టి దీర్ఘకవిత 'నిజరూపం' అందులోనే వచ్చింది. కరీంనగర్ బుక్ ట్రస్ట్ ఆరంభించి అల్లం రాజయ్య 'భూమి' కథలు, బి.ఎస్.రాములు 'బతుకు పోరు' నవలను ప్రచురించారు. నిర్మల్‌కు చెందిన న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి దేశంలో ఆర్థిక రంగ మార్పులను సూచిస్తూ రాసిన మూడు ఇంగ్లిష్ పుస్తకాలను వెంకటేశం తెలుగులోకి అనువదించారు. సేంద్రియ వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాలపైనా రాసిన ఆంగ్ల పుస్తకాన్ని కూడా తెనిగించారు. 1950 దశకంలో తెలంగాణ మాండలికంలో ఆనాటి ప్రముఖ పత్రికలు ప్రజామాత, ఆంధ్ర జనతలలో వచ్చిన గూడూరి సీతారాం కథలు కొత్త తరానికి పరిచయమయ్యేలా పుస్తకరూపంలో రావడానికి తోడ్పడ్డారు. 2018 లో సివిల్ సర్వీస్ పరీక్షల్లో తొలి ర్యాంకు సాధించిన అనుదీప్ దురిశెట్టిని తన విజయ రహస్యాలను ఇంగ్లీషులో రాయగా ఆ సమాచారాన్ని తెలుగులో అనువదించి వందలాది ప్రతులను పాఠశాలల్లో విద్యార్థులకు పంచేందుకు తోడ్పడ్డారు.

1997లోస్వచ్ఛంద పదవీ విరమణ అనంతరం ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. నగరంలోని అన్ని రకాల సాహిత్య, సామాజిక సంస్థలతో సంబంధాలు పెంచుకొని తనవంతు సహకారాన్ని అందిస్తూ క్రియాశీలక పాత్ర పోషించారు. తార్నాకలో నిర్వహించబడే స్ప్రెడింగ్ లైట్స్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వివిధ అంశాలపై, పుస్తకాలపై ప్రసంగించేవారు. దిల్‌సుఖ్‌నగర్‌లో 'అందరి ఇల్లు' పేరిట ఉచిత వసతి, భోజనం అందజేస్తు ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్న వైద్య దంపతులు సూర్యప్రకాష్ మరియు కామేశ్వరిలతో వెంకటేశంకు ఎంతో అనుబంధముంది. అరబ్బు దేశాలకు బతకబోయిన తెలుగు బిడ్డల కష్టాలకు తోడు నిలుస్తున్న మంద భీంరెడ్డికి అన్నివేళలా తోడు నిలిచేవారు. ఆయన కోరిక మేరకు ప్రవాస చట్టాలను తెలుగులో అనువదించి ఉచితంగా పంచిపెట్టారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఉత్తమ బాలల పుస్తకంగా ఎంపిక చేసిన 'బాలల తాత బాపూజీ' ని రచయిత పత్తిపాక మోహన్ గురుప్రీతితో వెంకటేశంకు అంకితమిచ్చాడు.

1970 దశకంలో అప్పటి కరీంనగర్ జిల్లాలో విద్యుత్తు సదుపాయాల విస్తరణ పెద్ద ఎత్తున జరిగింది. ఆ సమయంలో ఇంజనీర్‌గా వెంకటేశం పల్లె పల్లె తిరుగుతూ ఊర్లలో వీధి దీపాలు, బావులకు మోటార్ల కోసం కరెంటును అందించారు. ఇప్పటికి అక్కడి గ్రామాల ప్రజలు ఆయన సేవల్ని కొనియాడుతుంటారు. వివిధ కంపెనీల ఆహ్వానం మేరకు విద్యుత్తు ప్రాజెక్టులలో ఉద్యోగానంతర సేవలు కూడా కొనసాగించారు. ఈ క్రమంలో వెంకటేశం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో సుమారు రెండేళ్లు ఉండి వందలాది గ్రామాలకు విద్యుత్ సదుపాయాన్ని అందించడంలో తోడ్పడ్డారు. రాయ్‌బరేలి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న రాహుల్ గాంధీ ఆయన్ని **బిజిలి సాబ్** అని గౌరవంగా పిలిచేవారు.

వెంకటేశంతో తమ అనుబంధాలను గుర్తు చేసుకుంటూ ఆయన హఠాన్మరణంపై ఎన్నో సాహితీ కుటుంబాలు అశ్రునివాళులు అర్పిస్తున్నాయి. ఒక ఆత్మబంధువును కోల్పోయిన బాధను వందలాదిగా ఆయన అభిమానులు ప్రకటిస్తున్నారు. ఇలా సుమారు అర్ధ శతాబ్దం పాటు అన్ని వయసుల రచయితలకు వారధిగా నిలిచిన ఆయన లేని వెలితి ఎవరూ పూడ్చలేనిది.

- బి.నర్సన్ 9440128169

## ఉద్యమించు తెలుగోడా

**ఒకే** భాష-ఒకే ఘోష
నాటితరం తెలుగైతే
నేటి తరం ఇంగ్లీషుది
'మమ్మీ' పోయేదెప్పుడు
'అమ్మ' వచ్చేదెప్పుడు
ఆలోచించు తెలుగోడా!...

ఇరువదారక్షరాలకన్నా
ఏబదారక్షరాలు మిన్న
పాతకాలం పరభాషగా
వర్తమానం మనభాషగా
ఉద్యమించు తెలుగోడా...

వర్తమానం నీదిరా
తెలుగన్నది మనదిరా
తెలుగుతల్లి సాక్షిగా
ఎత్తర జెండా
ఎలుగెత్తి అరవరా
గొంతెత్తి పిలవరా
ఇది నా జెండా
ఇదే నా ఎజెండా అంటూ
ఉద్యమించు తెలుగోడా...

నను కని పెంచిన కరుణామయి
నా తెలుగు తల్లి
'అనాదిగా సాగుతోంది-
అనంత సంగ్రామం'
ఆంగ్లానికీ-అమ్మభాషకీ మధ్య
రానున్నది గెలుపన్నది
రేపన్నది మాదంటూ
తెలుగు వెలుగుల తోవలో
ఉద్యమంలా సాగిపో
విశ్వమంతా తెలుగులా...

జై తెలుగుతల్లీ! జై జై తెలుగు తల్లీ!!

వెంకటేశ్వరరావు కట్టూరి
9603629957

కీ.శే. దేవులపల్లి రామానుజరావు

# ప్రాంతీయ సంస్కృతుల ప్రభావం

**ఆంధ్రసారస్వత పరిషత్తు సప్తమ మహాసభలు అలంపురం(తెలంగాణ)లో 1953లో ఘనంగా జరిగాయి. ఈ సభల్లో సర్వేపల్లి రాధాకృష్ణ(భారతదేశ తొలి ఉపాధ్యక్షులు) పండితులు, పాల్గొని, ప్రారంభోపన్యాసం చేశారంటే ఆ సభలు ఎంత ప్రాముఖ్యతను సంతరించుకొన్నవో అర్థమవుతుంది. ఈ సభలకు దేవులపల్లి రామానుజరావుగారు అధ్యక్షతవహించి, చేసిన ప్రసంగాన్ని పూర్తిగా ఇక్కడ ప్రచురిస్తున్నాము. దీనిని నాటి సారస్వత మాసపత్రిక ప్రత్యేక సంచిక నుండి తీసుకొన్నాము.- సంపాదకుడు**



**ఈ**నాడు ఆంధ్రసారస్వత పరిషత్తు సప్తమ వార్షికోత్సవమును జరుపుకొనుటకు మనమందఱమిక్కడ సమావేశమైనాము. చరిత్రాత్మకమగు నీ ప్రదేశమున జరుగు ఈ వార్షికోత్సవము సర్వ విధముల చరిత్రాత్మకమైనది. ఆంధ్రదేశ చరిత్రకు ఆటపట్టై, శిల్పకళాలక్ష్మికి నృత్యరంగమై, సరస్వతీ దేవి నివాస స్థానమై యొప్పిన యీ ప్రదేశమునకు యీనాటి సమావేశము మరల నొకమారు పూర్వ వైభవమునకు అనుగుణమై కాంతివంతమగు భవిష్యత్తును సూచించుచున్నది. ఆచార్య రాధాకృష్ణుల ఆశీర్వాదము ఈ సమావేశమునకు అబ్బుట గొప్ప భాగ్యవిశేషము. ఈ నాటివేదిక పైన సకలాంధ్ర దేశమునుండి వచ్చిన పండితులు, కవులు విజ్ఞానులు దేశనాయకులు ఆసీనులై సత్వరభవిష్యత్తులో ఆంధ్ర జాతికి, ఆంధ్రదేశమునకు కలుగనున్న అభ్యుదయమునకు నాందీ ప్రస్తావనలు పలుకుటలోని సందర్భశుద్ధి, ఔచిత్యము ప్రత్యేకముగా గమనించదగియున్నవి.

ఈనాటి పండుగ ప్రొద్దున జరుగు ఈ సమావేశానికి అధ్యక్షత వహించు అవకాశము నాకు కలిగించిన ఆంధ్రసారస్వతపరిషత్తు కార్యకర్తలకు, శాఖలకు, సభ్యులకు కృతజ్ఞతావందనములర్పించుట నా ప్రథమకర్తవ్యము. అధ్యక్షపదవి ఈనాడు ఒక గురుతరమైన బాధ్యత. ఈ బాధ్యతా నిర్వహణలో నేను నిమిత్తమాత్రుడను మాత్రమే.

ఆంధ్రదేశమున అనేకసారస్వతసంస్థలు కలవు. ఈ సంస్థలలో ఆంధ్రసారస్వత పరిషత్తునకు ఒక ప్రత్యేక విశిష్టత కలదని, పరిషత్తు ఆదర్శములను మరియు కార్యకలాపాలను ఒకమారు స్థూలముగానైనను పరిశీలించినచో స్పష్టము కాగలదు. హైద్రాబాదు రాష్ట్రమున సుమారొకదశాబ్దమునకు ముందు అవతరించి కృషిజేయుచున్న పరిషత్తు ఆదర్శములు రెండు. ఒకటి ఆంధ్ర సారస్వత సంస్కృతుల అభివృద్ధి; రెండు. అక్షరాస్యతావ్యాప్తి. ఈ రెండు ఆదర్శములు పరస్పర పోషకములనుట స్పష్టము, ప్రజల భాషలకు అణుమాత్రము స్థానములేని పోలీసు చర్యకు పూర్వకాలమున యీ రెండు ఉద్దేశములతో పనిజేయు సంస్థ తెలంగాణ ప్రజలకు అత్యావశ్యకమైయుండెను – అంతేకాదు; స్వతంత్రభారతమున, విముక్త హైదరాబాదులో ఇట్టి కృషియొక్క ప్రాధాన్యత ఇనుమడించుచున్నది. నూటికి యేడు కన్న యెక్కువగా అక్షరాస్యులు లేని మన దేశమున, అయిదారు గ్రామాలకైన ఒక పాఠశాల నికరముగా లేని మనప్రాంతమున, సారస్వత పరిషత్తు యొక్క నిర్మాణ కార్యక్రమము దేశ కల్యాణమునకు అత్యవసరమై యున్నది.

**భారతీయ సంస్కృతి అనేక నదులు కలిసిన ఒక సుందరపవిత్ర సంగమమువంటిది. ఈ సంస్కృతి సంగమముయొక్క మహత్వమునకు, సౌందర్యమునకు, ప్రాంతీయ భాషలు మరియు సంస్కృతులు అనునదులు ప్రధాన ప్రాతిపదికలైయున్నవి. ప్రాంతీయసారస్వత సంస్కృతులు లేకపోయినచో భారతీయ సంస్కృతి శిరోజములు లేని కొప్పువంటిది కాగలదు.** మన భారత రాజ్యాంగము పదమూడు ప్రాంతీయ భాషలను పేర్కొని, వాని అభివృద్ధిని స్వష్టీకరించినది. ఇట్టి భాషలలో ఆంధ్రభాష ముఖ్యమైనది. **జన సంఖ్యయందును, వైశాల్యమునందును, సంస్కృతీ సంపదయందును భారత దేశములో ఆంధ్ర ప్రాంతము ఒక ప్రధాన స్థానము నాక్రమించుచున్నది.** భారతీయ సంస్కృతి మహత్వమునకు మొదటి నుండియు ఆంధ్ర ప్రాంతము విశేషముగా తోడ్పడిన నిదర్శనాలు భారతీయ సంస్కృతి చరిత్రయందును, సంస్కృత వాఙ్మయ చరిత్రయందును కొల్లలుగా కనుపించుచున్నవి. భారతదేశమున, ఒక సహస్రాబ్దముకన్న యెక్కువ వయస కలిగి, రససంపన్నము మరియు విజ్ఞానాత్మకమగు వాఙ్మయము గలిగిన ప్రాంతీయ భాషలలో తెలుగు భాషకు ప్రత్యేకస్థానము కలదు. ఈ ప్రాంతీయ భాషలలోని వాఙ్మయము, విజ్ఞానము, సకల భారత సంస్కృతికి మూల ప్రాతిపదికలుగానున్నవి. ఈ ప్రాతిపదికలు లేని భారతీయ సంస్కృతి పునాదులు లేని భవనము వంటిది. అందుచేత భారతదేశము యొక్క సర్వతోముఖాభివృద్ధికి యీ ప్రాంతీయ సంస్కృతుల అభివృద్ధి ప్రాథమిక అవసరమైయున్నది. భారత రాజ్యాంగమున యీ అవసరము స్పష్టము గావించబడినది. ఆంధ్ర




సారస్వత పరిషత్తు యీ ఉద్దేశముతో కృషి జేయుచున్నది.

మన రాజ్యాంగము వయోజనులైన స్త్రీ పురుషులందరికిని ఓటింగు హక్కునిచ్చిన ప్రజాస్వామికము. **ప్రజలకొఱకు ప్రజలచేత నిర్వహింపబడు ప్రజా 'స్వామికములో పరిపాలన ప్రజల భాషలలో జరుగవలసిన ఆవశ్యకత గలదు. అప్పుడే పరిపాలన సంపూర్ణ ప్రజాస్వామికము కాగలదు. ప్రజలభాషలో జరుగు పరిపాలన, ప్రభుత్వమునకు ప్రజలకు మధ్య సన్నిహిత సంబంధము కలుగజేయుటకుతోడ్పడును. భాషకన్న దృఢతరమైన బంధము మరొకటి కానుపించదు. అందుచేత ప్రజలకు ప్రభుత్వమునకు మధ్య ఇట్టి దృఢతర సంబంధము కావలెనన్నచో, వారి భాషలో రాష్ట్రీయ పరిపాలన జరుగుట అత్యవసరము.** ఇది యీనాడు మనకు క్రొత్తగా కనుపించుచున్న ఆవశ్యకతగాదు. కొన్ని శతాబ్దాల క్రింద్ర మన దేశమును పాలించిన శ్రీకృష్ణదేవరాయలు, తెలుగదేల యని ప్రశ్నించినవారికి సమాధానముగా దేశము తెలుగు, ప్రజలు తెలుగు మాట్లాడువారు, నేను తెలుగు విభుడను. అందుచేత తెలుగు కావలెనని చేసిన ఉద్ఘాటన సుప్రసిద్ధము. ఈ ఉద్ఘాటన యీనాటి మన ప్రభుత్వాలకు మార్గదర్శకము మరియు ఆదర్శప్రాయమని నిస్సంశయముగా చెప్పవచ్చును. ఆంధ్ర సారస్వత పరిషత్తు యొక్క ముఖ్యాదర్శమైన ఆంధ్ర సారస్వత సంస్కృతుల అభివృద్ధికి కృష్ణదేవరాయలు జేసిన ఉద్ఘాటన సర్వవిధముల ఒరవడి.

ఈనాడు మన దేశమున కొందరు విద్యాధికులకును, దేశనాయకులకును, **ప్రాంతీయ సారస్వత సంస్కృతుల అభివృద్ధిని గూర్చి అపోహలు కలుగుట మిక్కిలి శోచనీయము. భారతీయ సంస్కృతికి, యీ ప్రాంతీయ భాషా సంస్కృతుల అభివృద్ధి గొడ్డలి పెట్టని, ఇట్టివారు అక్కడక్కడ ఉద్ఘాటన గావించుట ఆశ్చర్యకరము – ఇది కేవలము దురభిప్రాయము.** ప్రాంతీయ భాషా సంస్కృతులు భారతీయ సంస్కృతికి యెన్నడుగూడ భంగకారులు కాకపోవుటయే గాక, పరిపోషకములుగా నున్నవని, మన దేశచరిత్ర వేయినోళ్ళ ఉద్ఘోషించుచున్నది. సంస్కృతభాష అభివృద్ధికి, సంస్కృతభాషలోని విజ్ఞాన వాఙ్మయ అభివృద్ధికిని సకల ప్రాంతములవారును సమష్టిగా కృషి చేసిన సత్యము చరిత్రప్రసిద్ధమైనది. మన ప్రాంతీయ భాషలకు సంస్కృత భాషకుగల సన్నిహిత సంబంధము జగత్ప్రసిద్ధమైనది. జనని సమస్తభాషలకు సంస్కృత భాషయని ఉద్ఘాటనచేయు ప్రాంతీయ భాషలు భారతజాతీయతకు ప్రతిబంధకములని వాదించుట విచిత్రమైన వితండము; భారతీయ సంస్కృతి స్వరూపమును దేశ చరిత్రను చక్కగా గ్రహించకపోవుటచే కలిగిన అజ్ఞాన జనితమైన దురభిప్రాయము.

నిజానికి **భారత జాతీయత సజీవముగా చైతన్య వంతముగా వికసించవలెనన్నచో ప్రాంతీయ భాషాసంస్కృతుల అభివృద్ధి మిక్కిలి అవసరము.** వృక్షముయొక్క పెంపునకు శాఖలు, ఆకులు, పూవులు, పండ్లు మరియు వేళ్లు మిక్కిలి అవసరమైనవి. వీని వలన చెట్టుయొక్క పెంపుకు, పుష్టికి భంగము కలుగుచున్నదని వాదించుట యెంతటి హాస్యాస్పదమో, ప్రాంతీయ సంస్కృతులవలన, భారత జాతీయతకు భంగము కలుగునని పేర్కొనుటగూడ అంతే హాస్యాస్పదము. వేళ్లు, శాఖలు, ఆకులు, పూవులు, పండ్లు మొదలైనవి వృక్షము యొక్క బలమునకు, సౌందర్యమునకు యెంతటి అవసరములో, ప్రాంతీయ సారస్వత సంస్కృతులు గూడ భారతీయ సంస్కృతికి అంతే అవసరములని యీ సందర్భమున నా విధేయ విజ్ఞప్తి. **మన దేశమునకు మొదటి నుండియు దక్షిణాపథమే వైజ్ఞానిక నాయకత్వము వహించినది. భక్తిజ్ఞాన కర్మయోగములను ప్రవచించిన మతాచార్యులకు దక్షిణాపథమే జన్మస్థానము.** సకల భారతమునకు దక్షిణాపథము వివిధ విజ్ఞాన రంగములందు మార్గదర్శకమైనది. అట్టి దక్షిణాపథము భారత

జాతీయతకు ప్రతిబంధకము యెన్నడు గూడ కాజాలదు. ప్రాంతీయ భాషాసంస్కృతుల అభివృద్ధి మందగించినప్పుడు, వానితోపాటు, భారతీయ సంస్కృతి అభివృద్ధి గూడ మందగించక తప్పదు. ఈనాడు ఎంతో అభివృద్ధి పొందిన అనేక పాశ్చాత్య దేశాలలో ప్రాంతీయ భాషలు (అవి మన ప్రాంతీయ భాషలతో పోల్చినప్పుడు, తక్కువ సంఖ్యగల జనుల మాతృభాషలై యున్నప్పటికిని) ఆయా దేశాల సమగ్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుచున్నవి.

భారతీయ సంస్కృతి ఒక రత్నహారమువంటిది. అందలి రత్నములు ప్రాంతీయ భాషాసంస్కృతులు ఆ హారమునుగూర్చు సూత్రము సంస్కృత వాఙ్మయము. సంస్కృతము సకలభారత ప్రజల నాగరికతాసంస్కృతులకు మూలకందమై, వారిలో భారతఖండము తమ మాతృదేశము, తాము భారతీయులమను జాతీయతాభావమును వ్యాపింపజేసి, వారిని ఏకముఖముగా నడిపించు మూలసూత్రమై యున్నది. అందుచేత మన విద్యావిధానమున సంస్కృతమునకొక ముఖ్యస్థానము లభింపజేయుట అత్యవసరము. హైదరాబాదు ప్రభుత్వ విద్యాశాఖ యీ ఆవశ్యకతను గుర్తించి, హైస్కూలు తరగతులలో సంస్కృత భాషకు స్థానము గల్పించి ప్రశంసనీయమైన నిర్ణయము గావించినది.

మరొక సందర్భమున మరొక ముఖ్యమైన సంగతిమనవి జేయవలసియున్నది. **ప్రాంతీయ భాషల అభివృద్ధి జాతీయభాషయైన హిందీ అభివృద్ధికి ఆటంకమను అపోహ కొందరిలో వ్యాపించి యున్నది. కేవలము అపోహయే కాదు; కొందరు ఇట్టి ప్రచారము గూడ గావించుచున్నారు. ఇది సరియైన అభిప్రాయము కాదు,** హిందీకి ప్రాంతీయ భాషలకు మధ్య యేవిధమైన విరోధము లేదు. అఖిలభారత స్థాయిలో హిందీ వ్యవహార భాషగా మన రాజ్యాంగము నిర్ణయించింది. అనగా రాష్ట్ర ప్రభుత్వాలు. మరియు కేంద్ర ప్రభుత్వము మధ్య పరస్పర పత్రవ్యవహారములకు హిందీభాష ఉద్దేశించబడినది. రాష్ట్రాల పరిపాలన ప్రాంతీయ భాషలలో జరుగుట వలన హిందీ స్థానమునకు యెట్టి ప్రతిబంధకము కలుగ జాలదు. కాని ఒకటి రెండు ముఖ్యమైన సంగతులు మనము గమనించవలసియున్నది. హిందీని సకల భారత స్థాయిలో వ్యవహారభాషగా రూపొందించు బాధ్యత భిన్న ప్రాంతాలలో నివసించు పౌరులందరి మీద కలదు. **భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారు హిందీభాష మన దేశములోని ప్రాంతీయభాషల సహకారముతో అభివృద్ధి గాంచవలసి యున్నదని పలుమారు తెలిపియున్నారు.** కాని, ఆ ఆవశ్యకతను ఉత్తర భారతమందలి హిందీవాదులు కొందరు గ్రహించలేదని, యీనాడు హిందీ భాషలోని పరిణామాలు కొన్ని ఋజువు చేయుచున్నవి. వీరు సిద్ధము జేయుచున్న పదజాలము మిక్కిలి వింతగా నుండి, వ్యవహార యోగ్యముగా లేకపోవుట మన యందరి అనుభవసిద్ధము. **భాష క్రమ పరిణామము పొందవలెను. అది యొక వృక్షము వలె పెంపుగాంచవలెను.** కాని **టంకాసాలలోని నాణెములవలె సిద్ధము కాకూడదు. ఈ యధార్థమును హిందీ మాతృభాషగా కలిగిన సోదరులు గ్రహించి మన ప్రాంతీయ భాషలలోని శబ్దజాలమును దృష్టియందుంచుకొని, వివిధ ప్రాంతాల ప్రజల వ్యవహార పరిభాషను గమనించి, అందరి ఆమోద సహకారములతో, హిందీ భాషాభివృద్ధికి పూనుకొనవలసి యున్నదని నేను మనవి చేయుచున్నాను.**

**రాష్ట్రాల పరిపాలన ప్రజల భాషలలో జరుగవలసిన ఆవశ్యకతను మనము గ్రహించినప్పుడు, విద్యాబోధన గూడ మాతృభాషలద్వారానే జరుగవలసి యున్నదను నిర్వివాదమగు సత్యమును మనము అంగీకరించవలసియున్నది. హైస్కూలు తరగతుల వరకు విద్యాబోధన మాతృభాషల ద్వారా జరుగవలెనను సిద్ధాంతము ఆమోదించబడి, ఆచరణలోనికి తీసికొని రాబడినది.** కాని విశ్వవిద్యాలయములోని బోధనా భాషను గూర్చి ఇంకను వాదోప వాదములు కొందరు జరుపుతున్నారు. **భారత ప్రభుత్వము నియమించిన యూనివర్సిటీ కమిషన్ తన నివేదికలో విశ్వవిద్యాయాల విద్యాబోధన ప్రాంతీయ భాషలలో జరుపుటకు ఆమోదించి యున్నది.** నేడు విశ్వవిద్యాలయమున విద్యాభాసము గావించు యువకులు రేపటి పౌరులు. అనగా మన జాతీయ జీవనమున రేపు వారు పరిపాలకులుగను, దేశనాయకులుగను, విజ్ఞానులుగను మరియు ఇతర బాధ్యతలు దేశ నాయకులుగను, విజ్ఞానులుగను బాధ్యతలు గల వ్యక్తులుగను తమ తమ కర్తవ్యములను నెరవేర్చవలసియున్నారు. ప్రాంతీయ భాషాసంస్కృతుల అభివృద్ధి బాధ్యతను వీరు వహించబోవుచున్నారు. పరిపాలకులుగా ప్రజల భాషలలో వీరు వ్యవహార నిర్వహణ గావించవలసియుండును. దేశనాయకులుగా దేశసౌభాగ్యమునకు, ప్రజల అభ్యుదయమునకు వీరు పాటుపడవలసి యుండును. విజ్ఞానులుగా వీరు విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన గ్రంథములను వారి భాషలలో రచించి, పత్రికలను నిర్వహించి, ప్రజలను విజ్ఞానవంతులనుగా జేయవలసియున్నారు. **అందుకొరకువారు తమ భాషలలో సుశిక్షితులై యుండుట అవసరము.** అంతేగాదు, **విద్యాభ్యాసమునకు మాతృభాషకన్న ఉత్తమమైన బోధనాభాష మరియొకటి యుండజాలదనునది సకల విద్యావేత్తలు అంగీకరించిన సత్యము.** అందుచేత ఈనాడు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలు ప్రాంతీయ భాషలద్వారా విద్యాబోధన జరుపుట అవసరమైయున్నది. గడచిన కొన్ని సంవత్సరాలనుండి ఆంధ్ర సారస్వత పరిషత్తు ఇందు కొరకై జేయుచున్న కృషి హైద్రాబాదు ప్రజలందరికి బాగుగా తెలిసియేయున్నది. మన విశ్వవిద్యాలయమున ప్రజల మాతృభాషలకు స్థానము కల్పించుటకు పరిషత్తు కృషిజేసి కొంతవరకు విజయముగూడ సంపాదించియున్నది.

**ప్రజాస్వామికములో అధికార వికేంద్రీకరణ ముఖ్యమైనది. మన రాజ్యాంగము యీ అధికార వికేంద్రీకరణకు ఆమోదించి, గ్రామ పంచాయతులు, పురపాలక సంఘాలు, జిల్లా బోర్డులు మరియు రాష్ట్రీయ శాసనసభల ద్వారా అధికారాలను ప్రజాపరము కావించినది, ఇట్టి పరిస్థితులలో విద్యా రంగమున ప్రభుత్వాల జోక్యము అభిలషణీయము కాజాలదని నేను మనవి చేయవలసిన అవసరము లేదు.** కొన్ని నెలల క్రింద జరిగిన **అఖిలభారత విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులు సమావేశమున విశ్వవిద్యాలయ వ్యవహారాలలో ప్రభుత్వము యొక్క జోక్యము మతియు అధికారము సమంజసము కాదని యేకగ్రీవముగా తీర్మానము జరిగినది.** ఈ తీర్మానము మిక్కిలి ఉచితమైనది. విద్యారంగమున సైనిక సమీకరణపద్ధతులుమాత్రము కోరదగినవికావు. విద్యావిధానములపైన ప్రభుత్వ ప్రాబల్యము ఆనేక అనర్థకములకు మార్గదర్శకము కాగలదు. ఉన్నత విద్యావిధానము ప్రభుత్వమునకు అడుగులకు మడుగులొత్తునదిగా నుండినచో, వ్యక్తి స్వాతంత్ర్యమునకు విఘాతముగలిగి, విద్యాలయాలు పరిపాలకుల రాజకీయ ప్రయోజనాల

సాధనకు ఉపకరణములుగ పరిణమించి, దేశాభివృద్ధికి ప్రతిబంధకము కాగల ప్రమాదము వాటిల్లకతప్పదు. అందుచేతనే హైద్రాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయము మీద కేంద్రప్రభుత్వ అధికారమునకు ప్రజలు తీవ్రమైన ఆక్షేపణ తెలుపుచున్నారు. ఈ ఆక్షేపణను విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల సమావేశము ఏకగ్రీవముగా చేసిన నిర్ణయము బలపరచుచున్నది. కావున కేంద్ర ప్రభుత్వము ఉస్మానియా విశ్వవిద్యాలయమును గూర్చి చేసిన నిర్ణయమును మార్చుకొనుట అవసరము.

**ఉన్నతవిద్యకు ప్రభుత్వ సహకారము అవసరమే. దాని కేవిధమైన ఆక్షేపణలేదు.** కాని సహకారము వేరు అధికారమువేరు అని **గ్రహించవలసియున్నది. ఆర్థిక సహకారము అధికారముగా పరిణమించుట ప్రమాదకరము.** ఇంగ్లండు మొదలైన దేశాలలో విశ్వవిద్యాలయాలను ప్రజలు భక్తి గౌరవాలతో ఆరాధించుచుందురు. ఇందుకు ముఖ్య కారణము, అక్కడి విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ విధానాలకు, రాజకీయఆశయాలకు చరణాశ్రితులైన సేవకులు గాక పోవుటయే. **రాజకీయ పక్షాలు మఱియు పరిపాలకుల స్వార్థ ప్రయోజనాలనుండి విశ్వవిద్యాయాలు విముక్తిగాంచుట దేశ సౌభాగ్యమునకు అత్యవసరము. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈ దృక్పథముతో కృషిజేయుచున్నది.**

విద్యారంగమునందువలె సారస్వతరంగమున గూడ ప్రభుత్వ విధానాల ప్రాబల్యము, రాజకీయ ప్రయోజనాల అధికారము కోరదగినది కాదు. **రచయితలు సేచ్ఛగా ఆలోచించి, స్వతంత్రముగా రచనలు సాగించుట అవసరము. దేశకల్యాణమునకు కారణభూతులైన వారిలో రచయితలకు ప్రముఖస్థానము కలదు. కావుననే వారు యెన్నుకోబడని శాసనకర్తలని ఒకరు చెప్పియున్నారు. ఇది అతిశయోక్తి కాదు. కేవలము సత్యోక్తి.** ప్రపంచమునందలి మహోద్యమము లెన్నింటికో రచయితలు దోహదము గావించియున్నారు. కత్తిచే సాధించుటకు వీలుగాని మహత్కార్యములను కలముతో అవలీలగా సాధించగలిగిన నిదర్శనాలు మనము ఎన్నియో చూపించవచ్చును. **కలములో నిబిడీకృతమైనశక్తి అమోఘమైనది; అద్వితీయమైనది. రచయితలు తమతమ పవిత్ర కర్తవ్యములను సక్రమముగా నిర్వహించవలెనన్నచో వారు సంకుచిత భావాలకు అంజలించువారు కాగూడదు.** సకల ప్రపంచము తనకుటుంబమని భావించి లోకకల్యాణమునకు పాటుపడవలసిన రచయితలు ముఠాలకు, వర్గాలకు యెంత దూరముగా నుండిన నంతమంచిది. వారి భావవాహినులకు ఆనకట్టలు కట్టు ప్రయత్నాలు, కాంక్షనీయములు కాజాలవు. **ముఠాలకు వర్గాలకు, వ్యక్తి ప్రయోజనాలకు ఆహుతియైన రచయిత, ఆర్థికముగా లాభము పొందిన పొందవచ్చును గాని, అట్టి రచయిత దేశమునకు, జాతికి, సారస్వతమునకు, లోకమునకు ద్రోహియగుట అనివార్యము.** అందుచేత రచయితలు, వాఙ్మయ సంస్థలు మిక్కిలి జాగరూకత వహించి, తమను ఇతరులు వినియోగించుకొనకుండునట్లుగా, తమ పవిత్ర కర్తవ్యమును నెరవేర్చవలసియున్నది.

కాలము మారినది, పరిస్థితులు మారినవి. ఈ మార్పు యొక్క ప్రభావము వాఙ్మయ రంగమున స్పష్టమగుచున్నది. **ఈ మారిన పరిస్థితులలో ప్రజల అవసరాలను, అభిప్రాయాలను దృష్టిలో నుంచుకొని వాఙ్మయ నిర్మాణము జరుగవలసియున్నది. ఈ సత్యమును నలుబది సంవత్సరాలకు ముందే గ్రహించిన శ్రీ కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు గారు మన భాషలో విజ్ఞాన వాఙ్మయ నిర్మాణమునకు పూనుకొని దేశ చరిత్రలను, విజ్ఞాన శాస్త్రములను ప్రకటించిరి.** కాని లక్ష్మణరావుగారు ఆరంభించిన ఉద్యమము వారి తరువాత, ఎక్కువగా వ్యాప్తిపొందలేదు. **ఆనాడు వారు తమ పీఠికలో మన భాషయందు యే యే లోటులు కలవని భావించిరో, యీనాడు గూడ ఆ లోటులే కనుపించుచున్నవి. అనగా యీ లోటును తీర్చుటకై సరియైన కృషి సక్రమముగా జరుగలేదన్నమాట.** ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమములో గ్రంథ ప్రకటనగూడ ముఖ్యమైనది. ఈ గ్రంథ ప్రకటనాకార్యమున పరిషత్తు లక్ష్మణరావుగారి దృక్పథముతో కృషి జేయుచున్నది. పరిషత్తు ప్రకటించిన గ్రంథములే ఇందుకు ఉదాహరణములు. కాని అనేక కారణాల వలన యీ వాఙ్మయ ప్రకటన విరివిగా జరుగలేదు. అన్నిటికన్న ముఖ్యమైనది ఆర్థిక ప్రతిబంధకము. ప్రభుత్వము నుండి గాని లేక ప్రజలనుండి గాని తగినంత ఆదరణ లభించినచో పరిషత్తు యీ మార్గమున యెక్కువ కృషి గావించిటకు సిద్ధముగా నున్నది.

పరిషత్తు ఆదర్శాలలో అక్షరాస్యతావ్యాప్తి గూడ ముఖ్యమైనది. ప్రజాస్వామిక పరిపాలనలో వ్యక్తి సాతంత్ర్యమునకు ప్రధాన స్థానము గలదు. దారిద్ర్య, నిరుద్యోగ, అనారోగ్య, అజ్ఞానపిశాచములను పారద్రోలుట ప్రజాస్వామిక పరిపాలన వలన కాంక్షించదగిన పరమ ప్రయోజనము. **తమ బాధ్యతలను, హక్కులను ప్రజలు సక్రమముగా గ్రహించుటకు వారికి విజ్ఞానచక్షువు ముఖ్యసాధనము.** "చదువని వాడజ్ఞుండగు, చదివిన సదసద్వివేక చతురత గలుగు" ఈ విద్యావ్యాప్తికి నిరక్షరాస్యతా నిర్మూలనమునకు పరిషత్తు కృషి చేయుచు, ప్రభుత్వ ఉద్దేశములను నెరవేర్చుచున్నది. మన రాజ్యాంగము నిర్బంధ విద్యాబోధన ఆవశ్యకతను గ్రహించి, ఆ భారమును స్వీకరించినది. ముఖ్యముగా నేడు వయోజనులలో నిరక్షరాస్యతా నిర్మాలనమునకు విజ్ఞాన వ్యాప్తి జరుగవలసియున్నది. ఈ వయోజన విద్యాప్రచారము పరిషత్తువంటి సహకారము ప్రభుత్వమునకు అత్యవసరము. అఖిలభారత వయోజన విద్యామహాసభ, నిరక్షరాస్యతా నిరూల్మన దేశములోని విద్యాసంస్థలద్వారా జరిపించవలెనని తీర్మానించినది. ప్రభుత్వము యీ సందర్భమున తగినంత శ్రద్ధదీసికొనుట అవసరము. వయోజనులలో నిరక్షరాస్యతా నిర్మూలనకై ప్రభుత్వము ప్రత్యేక శాఖలను నెలకొల్పుటవలన కలిగిన అనుభవము సంతృప్తికరముగా లేదని, విద్యావేత్తల అభిప్రాయమై యున్నది. అందువలన, పరిషత్తువంటి సంస్థల ద్వారా ప్రభుత్వము యిట్టి కృషికి దోహదము గావించుట ముఖ్యము.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆశయములను కార్యక్రమములను దిఙ్మాత్రముగా సూచించినాను. దేశమును విజ్ఞానవంతము చేయుటకు, ఆంధ్ర సంస్కృతి దీపములను ఇంటింట వెలిగించుటకు ఇంతకు పూర్వమువలెనే ఇకముందు గూడ పరిషత్తు కృషి జేయుచుండగలదు. పెద్దల సలహాలు, ఆశీర్వాదము, కార్యకర్తలకృషి, ప్రజల ఆదరణ పరిషత్తునకు పెట్టని కోటలు.

డా. చంద్రయ్య ఎస్
9963709032

# వ్యాస రచనలో భాష వినియోగం

**ఆ**ధునిక కాలంలో వ్యాసం అందరికీ అందుబాటులో ఉన్న సాహిత్య ప్రక్రియ. ఇది సృజనాత్మకమైనదీ; బౌద్ధికమైది. తెలుగునాట వివిధ పత్రికల్లో ప్రతిరోజు కనీసం మూడు వందలకుపైగా వ్యాసాలు వస్తున్నాయి అని ఒక అంచనా. వ్యాస రచనకు మాత్రమే కాదు-ప్రతి రచనకూ నిర్దిష్ట పాఠకులు ఉంటారు. రచయిత ఎంచుకున్న అంశం, లక్షిత పాఠకులు, రచయితకున్న భాషా సంపద, రచయిత సామాజిక నేపథ్యం మొదలైన కారణాలు ఒక రచనలో ఉపయోగించాల్సిన భాషను నిర్దేశిస్తుంటాయి. అయితే, మిగతా ప్రక్రియల రచయితలకంటే, వ్యాస రచయితలపై ఎక్కువ సామాజిక బాధ్యత ఉందనేది వివిధ పత్రికల్లో వెలువడుతున్న వందలాది వ్యాసాలు గుర్తుచేస్తున్నాయి. ఇంత విస్తృతంగా ఉపయోగంలో ఉన్న వ్యాస ప్రక్రియలో ఉపయోగించవలసిన భాష విషయంలో కొన్ని ఆలోచనలను మీతో పంచుకోవాలని ఈ వ్యాసం రాయడమైంది. తెలుగునాట ప్రత్యామ్నాయ భావజాలాన్ని వ్యాప్తిచేస్తున్న కొన్ని పత్రికల్లో ఉపయోగించిన భాష ఆధారంగా ఈ వ్యాసం రాయడమైంది.

'నాకు, మీలా పదాలపై పట్టులేదు; నాకు కవిత్వ భాష తెలియదు.' అనే మాటలను మనం తరచూ వింటూ ఉంటాం; ఇదే అభిప్రాయం వ్యాస రచన విషయంలోనూ. భాషావ్యవహర్తల్లో ఇటువంటి అభిప్రాయాలు ఏర్పడటానికి 'నానృషిః కురుతే కావ్యం', 'కవిరేవ ప్రజాపతిః' వంటి మాటలు మన అధ్యయన, అధ్యాపనలను ప్రభావితం చేయడం కారణం. ఈ వాఖ్యలను మరింత వివరంగా అర్థం చేసుకోవాల్సి ఉంది. కవి/రచయిత సాధారణ ప్రజలతో, వారి భాషతో సంబంధాన్ని తెంచుకుంటేనే గొప్పవ్యక్తిగా కీర్తించబడుతాడేమోననే ఒక దురభిప్రాయం చారిత్రకంగా బలపడుతూ వచ్చింది. కనుక, ప్రజలకు అర్థమయ్యే భాషను వాడితే తనకు ప్రత్యేకత ఏముంటుంది అనే మానసిక స్థితికి ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. ఈ రకమైన దురభిప్రాయం జన సామాన్యమైన వ్యాసరచనలోనూ ప్రవేశించింది. కనుక, రచయితల్లో కొందరు 'ప్రజలకు అర్థంకాని భాష వాడుతున్నారు' అని అనలేం కాని, కష్టపడితే కానీ అర్థంకాని పదజాలం వాడటాన్ని మాత్రం గమనిస్తూనే ఉన్నాం. గ్రాంథిక భాష వాసనలను ప్రయత్న పూర్వకంగానైన వదిలించుకోలేనితనాన్ని గుర్తించవచ్చు. ప్రత్యేకతకోసం పాకులాటలో ఇంతకాలం ప్రజలకు అర్థంకాకుండా ఉండటానికి రచయిత ఎంత కష్టపడుతూ వచ్చాడో, ఇప్పుడు ప్రజల భాషకు కట్టుబడి, కష్టపడి రాయాల్సిన అనివార్యత ప్రజా రచయితల ముందుంది. "వ్యాసకర్త కష్టపడితే పాఠకులు సుఖపడతారు, వ్యాసకర్త శ్రమ పడకపోతే ఆ మేరకు పాఠకులు శ్రమపడాల్సి వస్తుంది." (చెంచయ్య, వి. 2009:16) అనే పరిశీలన యదార్థం.

"వ్యాసానికి సంబంధించిన భాష సరళంగా ఉండాలి. శైలి చదివించేదిగా ఉండాలి. భాష ఇలా ఉండాలనీ, ఇలా ఉంటుందనీ చెప్పొచ్చుగాని, శైలి ఇలా ఉంటుందని చెప్పలేం. ఎవరి శైలి వారిదే. **భాష ద్వారా రచయిత భావాలు మాత్రమే వ్యక్తం అవుతాయి. శైలి ద్వారా రచయిత వ్యక్తిత్వం కూడా వ్యక్తం అవుతుంది. భాష మేఘం అయితే శైలి మెరుపు. భాష శరీరం అయితే శైలి ప్రాణం. వ్యాసానికి భాష, శైలి రెండు కళ్ళు. వాటి ద్వారానే వ్యాసంలోని విషయాన్ని సరిగ్గా చూడగలం. భాష దెబ్బతిన్నా, శైలి బలహీనంగా ఉన్నా చూపు దెబ్బతిని పాఠకుల మనసుకు విషయంఎక్కదు."**(చెంచయ్య, వి. 2009:20).

రచయితలు వ్యాస రచనలో ఉపయోగించే భాషలో సాధారణంగా చేస్తున్న పొరపాట్లు ఈ కింది విధంగా ఉంటున్నాయి. వీటిని పొరపాట్లు అనికూడా అనలేం. రచయిత రాసేటప్పుడు కొంత శ్రద్ధపెట్టి ఉపయోగించిన భాషను భాషా విషయక దృష్టితో సరిచూసుకొంటే సరిపోతుంది.

1. క్రియా విశేషణాల వాడకంలో పొరపాట్లు
2. గ్రాంథిక భాషా వాసనలు పోకపోవడం
3. ఊత పదాలను/ వ్యర్థ పదాలను వాడటం
4. వ్యాకరణ సంబంధమైన దోషాలు
5. లిఖిత భాషకు, మౌఖిక భాషకు మధ్యగల భేదాలను గుర్తించకపోవడం
6. కర్త, క్రియల మధ్య సమన్వయ లోపం
7. సుదీర్ఘ వాక్యాల రచన

**1. క్రియా విశేషణాల వాడకంలో పొరపాట్లు**

ఏ భాషలోనైనా విశేషణాలు నిర్వహించే పాత్ర విస్తృతమైంది. క్రియ 'యొక్క' గుణాలను తెలియజేసేవి క్రియా విశేషణాలు. ఇవి ఎప్పుడూ క్రియకు ముందు వస్తూ, క్రియ యొక్క స్థితినీ, గతినీ తెలియజేస్తూ ఉంటాయి. ఈ కింది ఉదాహరణలో క్రియా విశేషణం నామవాచకం ముందు ప్రయోగించడం వల్ల 'తీవ్రమైన' తప్పిదం జరిగింది. దాన్ని వాక్యంలో క్రీగీటుతో సూచించడమైంది.

"30 ఏండ్ల తర్వాత అదే పురోహిత వర్గాల మానస పుత్రుడు కపిల్ సిబాల్ నివేదిక విడుదల చేస్తూ 2011 నాటికి 40% పాఠశాలల్లో తాగునీటి వసతి లేదని, 72% పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, 31% పాఠశాలల్లో ఆటస్థలం లేదని, 43.6% పాఠశాలల్లో తీవ్రమైన ఉపాధ్యాయుల కొరత ఉందని 60 ఏండ్ల పాలన తర్వాత గూడా పాఠశాలల పరిస్థితిని ఇంత అధ్వాన్నంగా ఉంచగలిగినామని ఇంత నిర్భీతిగా, నిస్సిగ్గుగా ఎందుకు చెప్ప సాహసించినట్లో మనం ఆలోచించాల్సి ఉంది" (విద్యార్థి గళం. సెప్టెంబర్-2014:28)

పై వాక్యంలో 'కింద గీత గీసిన' వాక్య భాగాన్ని ఒకసారి జాగ్రత్తగా గమనిస్తే, వ్యాసకర్త చేసిన పొరపాటును గుర్తించటానికి ఎంతో సమయం పట్టదు. 'తీవ్రమైన' అనే క్రియా విశేషణాన్ని వాడటంలో రచయిత కాస్త ఏమరపాటుకు గురైనట్టు అర్థమవుతోంది. 'ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది' అని చెప్పటం రచయిత ఉద్దేశమైనట్టు ఆ సుదీర్ఘ

వాక్యాన్ని గమనిస్తే అర్థమౌతుంది. కానీ, 'ఉపాధ్యాయులు' అనే సమూహ నామానికి(Common Noun) ముందు వాడటంవల్ల, క్రియా విశేషణం కాస్తా, నామ విశేషణంగా పనిచేస్తూ విపరీతార్థానికి కారణమైంది. క్రియా స్థితి, గతులను సూచించే పదం ఎప్పుడూ క్రియకు ముందు అవ్యవధానంగా రావాలి. ఇక్కడ అది పాటింపబడలేదు.

**2. గ్రాంథిక భాషా వాసనలు పోకపోవడం**

వ్యాసకర్తలు- ఆధునిక వాక్య రచనా రీతిని తప్పని సరిగా అలవర్చుకోవాలి. ముఖ్యంగా క్రియా పదాల విషయంలో దీన్ని సాధించాల్సి ఉంది. 'ము' అంత పదాలు నేడు నిండుసున్నతో రాస్తున్నాం. పదాది రకార రూపాలను వాడటంలేదు. వర్తమాన కాలాన్ని తెలియజేసే ప్రత్యయాలుగా మనం ఈనాడు 'తున్న'(తు+ఉన్న), (చేయుచున్న > చేస్తున్న, తీయుచున్న > తీస్తున్న) వాడుతున్నాం. చేదర్థక ప్రత్యయాలుగా 'తే'ను వాడుతున్నాం (పని మానేసినచో పని మానేస్తే, తీయబడినచో తీసివేస్తే). ఈ కింది గ్రాంథిక పదజాలం ఈ వివరణను ధ్రువపరుస్తున్నాయి. ఈ కింద పేర్కొన్నటువంటి రూపాలతోపాటు 'చెప్పబడు, చేయబడు' వంటి క్రియల్లోని 'బడు'లను రాయకపోవడమే ఉచితం.

"ప్రభుత్వము, శ్రద్ధ చూపించజాలము, మరియు, తీయుచున్నవి, క్రింది, చేయవచ్చును, పనిమానేసినచో, తీయబడినచో, చేయవలెను" మొదలైనవి. (అరుణతార.జూలై-2016:22) వీటిని వరుసగా ఇలా మార్చుకోవచ్చు. 'ప్రభుత్వం, శ్రద్ధ చూపించలేం, తీస్తున్నవి/న్నాయి, కింది, చేయొచ్చు, పనిమానేస్తే, తీసేస్తే, చేయాలి.'

**3. ఊత పదాలను/ వ్యర్థ పదాలను వాడటం**

భాషలో కొన్ని అనవసర పదాలను మనకు తెలియకుండానే వాడుతూ ఉంటాం. వాటిని తీసివేసినా అర్థ/భావ భంగం జరగదు. ఈ విషయాన్ని మనం గమనించకుండానే వాడుతుంటాం. ఈ కింది ఉదాహరణల ద్వారా ఈ అంశాన్ని మరింత వివరించుకోవచ్చు.

అ) ప్రభుత్వం <u>నిర్మించతలపెట్టబోయే</u> పరిశ్రమ/ప్రాజెక్ట్ ఆ ప్రాంతంలో సామాజికంగా వేసే ప్రభావాన్ని అధ్యయనం చేయటం అనే అంశాన్ని ఎత్తేసింది." (నడుస్తున్నతెలంగాణ. జనవరి-2017)

ఆ) "<u>గత</u> కొన్ని దశాబ్దాలుగా అందరికీ ఆరోగ్యాన్ని అందించే....." (కార్మిక పథం.జనవరి-2015:3)

ఇ) "ఈ డిమాండ్లను అక్టోబర్ నెల నుంచి అమలు చేస్తామని హామీ ఇచ్చిన <u>యాజమాన్యంను</u> నమ్మి అదేరోజు రాత్రి 10 గంటలకు సమ్మె నోటీసు ఉపసంహరించడం జరిగింది" (కార్మిక పథం. జనవరి-2015:4)

ఈ) "... నోటీసులు అతికించడం జరిగింది" (కార్మిక పథం. జనవరి-2015:3) 'మరి' మొదలైనవి.

కింద గీత గీసిన పై వాక్యాల్లోని పదాలను- ఇంకాస్త సులభంగా, పాఠకులకు సౌకర్యవంతంగా రాసే వెసులుబాటు ఉందేమోననిపిస్తుంది. అ), ఆ), ఇ), ఈ) అనే వాక్యాల్లోని పదాలను వరుసగా ఇలా రాస్తే బాగుంటుంది. 'నిర్మించబోయే', 'గత' లేకుండా ఏమైనా రాయవచ్చా?, యాజమాన్యాన్ని, ఉపసంహరించడమైంది, అతికించడమైంది. మొదలైనవి.

'ఉపసంహరించడమైంది, అతికించడమైంది'మొదలైన క్రియలు వాక్యంలో కర్మకు ప్రాధాన్యమిస్తూ రాయడంవల్ల ఏర్పడినటువంటివి. అలాకాక, ఆ పని జరిపిన కర్తకు ప్రాధాన్యమిచ్చి రాస్తే 'ఉపసంహరించాం, అతికించాం' అనే క్రియలు నిర్మాణమౌతాయి. ప్రాధాన్య వివక్షను బట్టి ఈ రెండు రకాలుగా ఏ విధంగానైనా రాసుకోవచ్చు. రాజకీయ నాయకుల ప్రసంగాల ద్వారా వ్యాప్తిలోకొచ్చిన 'జరుగు' లాంటి వ్యర్థపదాలను రాతలోంచి ఉపసంహరించుకోవచ్చు.

**4. వ్యాకరణ సంబంధమైన దోషాలు**

**4.1 ఆదివృద్ధిపై అవగాహన లేకపోవడం:**

'ఆదివృద్ధి' సూత్రం ప్రకారం సంబంధార్థంలో నామవాచకంపై 'ఇక, ఉక' వంటి ప్రత్యయాలు చేరుతున్నప్పుడు పదంలోని మొదటి అక్షరానికి దీర్ఘం వస్తుంది లేదా ఐత్వం వస్తుంది. అకారాదులకు 'ఆ', ఇకారాదులకు 'ఐ' వస్తుంది అని ఆదివృద్ధి సూత్ర వివరణ. దానిప్రకారం కింద ఉదహరించిన **'కలగాపులగంగా ఇలా రాయకూడదు'**లోని మాటలను సవరించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ 'ఇక, ఉక' ప్రత్యయాల్ని చేర్చకుండా వాటి ప్రాతిపదిక రూపాలతో రాసినా ఫరవాలేదు. కాని, రెండింటి కలగాపులగంగా రాయకూడదని శాస్త్ర నియమం.

**ప్రాతిపదిక రూపాలతో ఇలా రాయవచ్చు:** సంప్రదాయ, సంస్కృతి, చరిత్ర, ప్రమాణ, నిఘంటువు, సిద్ధాంత మొదలైనవి.

**'ఆధివృద్ధి' రూపాలతో ఇలా రాయవచ్చు:** సాంప్రదాయిక, సాంస్కృతిక, చారిత్రక, నైఘంటిక, సైద్ధాంతిక మొదలైనవి.

**కలగాపులగంగా ఇలా రాయకూడదు:** సంప్రదాయిక, సంస్కృతిక, సమాజిక, చరిత్రక, ప్రమాణిక, నిఘంటుక, సిద్ధాంతిక మొదలైనవి కొన్ని.

**4.2 హల్లోపకృత దీర్ఘత:**

'ము' చివరలో ఉన్న నామప్రాతిపదికకు బహువచన ప్రత్యయం చేరినపుడు అది కొన్ని రకాల మార్పులను పొందుతుంది. ఈ సూత్రం/ నియమం తెలియడానికి చదువుకోనక్కరలేదు. ఉదా: మన పెద్దలు గుర్రం+లు=గుర్రాలు, పళ్లెం+లు=పళ్ళాలు అని మార్చి వాడుతారే కాని 'గుర్రంలు, పళ్ళెంలు' అనే మార్పు చెందని రూపాలను వాడరు. ఇది మన ఎరుకలో ఉన్న సామాన్య విషయమే.కనుక, రచయితలు కొందరు జనసామాన్యంలోని నియమాలను కూడా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది పైన తెలిపిన ఉదాహరణల్లో పదం చివరలో ఉన్న 'ము' లోపించి దానికి ముందున్న 'ర, ళ'లకు దీర్ఘం వచ్చినట్టు తెలుస్తుంది. కనుకనే దీన్ని భాషావేత్తలు 'హల్లోపకృత దీర్ఘత' అని అన్నారు. ఈ కింద పేర్కొన్నటువంటి రూపాలను రాయకుండా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

ప్రాంతంలు(>ప్రాంతాలు), యాజమాన్యంను (>యాజమాన్యాన్ని), సంవత్సరములలో (>సంవత్సరాలలో) మొదలైనవి.

**5. లిఖిత భాషకు, మౌఖిక భాషకు మధ్యగల భేదాలను గుర్తించకపోవడం**

మాట్లాడినట్టు రాయడమనేది ఎప్పుడూ ఆదర్శమే కానీ, లిపికి ఉండే పరిమితులు అందుకు సహకరించవు. ఒకవేళ అందుబాటులో ఉన్న లిపి వనరులను ఉపయోగించుకొని ప్రయత్నపూర్వకంగా రాసినా, పాఠకులను అగ్ని పరీక్షకు గురిచేయడమేతప్ప మరొకటి కాదు. కనుక, లేఖన పద్ధతులను, లిఖిత వాక్యంలో ఉండే నిర్మాణ పద్ధతులను పాటిస్తేనే, చెప్పదలుచుకున్న విషయం లక్షిత పాఠకులకు చేరుతుంది.

ఈ కింద మాట్లాడినట్టుగా రాసిన ఒక వాక్యాన్ని ఉదాహరణగా ఇస్తున్నాను.

ఉదా: "అసలు ఆకాంక్షల మీదనే నీళ్ళు చల్లింది 1956 అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల మహాసభలో కృశ్చేవ్ సిద్ధాంతం" అరుణ తార. జులై-2016: 22)

పై వాక్యాన్ని ఇలా రాసుకోవచ్చు. "1956 అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల మహాసభలో కృశ్చేవ్ సిద్ధాంతం- అసలు ఆకాంక్షల మీదనే నీళ్ళు చల్లింది."

**6. కర్త, క్రియల మధ్య సమన్వయ లోపం:**

"ఆయనకూ నామీద అవధిమీరిన అభిమానం, ప్రేమ, వాత్సల్యం కురిపించారు." (వీక్షణం. ఫిబ్రవరి-2017:9)

"ఆయన నామీద అవధిమీరిన అభిమానం, ప్రేమ, వాత్సల్యం కురిపించారు."

"దీన్ని ఎంతో మంది పిచ్చి తుగ్లక్ 13వ శతాబ్దంలో చేసిన పనిగా కూడా వర్ణిస్తున్నారు." (నడుస్తున్న తెలంగాణ. జనవరి-2017:23)

ప్రస్తుతం ఒకరు చేసిన పనిని 'తుగ్లక్ చేసిన పిచ్చిపనితో పోల్చి చెప్పటం' ఉదాహృత వాక్య ఉద్దేశం. కానీ 13వ శతాబ్దంలో చేయడాన్ని ప్రధానం చేసి చెప్పినట్టుగా ఉంది. పై వాక్యాన్ని అది ఉద్దేశించిన అర్థం సిద్ధించాలంటే కర్తను వాక్యం మొదట్లోకి తీసుకువస్తే సరిపోతుంది.

"పిచ్చి తుగ్లక్13వ శతాబ్దంలోచేసిన పనిగాదీన్ని ఎంతో మంది వర్ణిస్తున్నారు."

**7. సుదీర్ఘ వాక్యాల నిర్మాణం**

సుదీర్ఘ వాక్య రచన కేవలం పాఠకుడినే కాదు రచయితనూ తికమకపెడుతుంది. తాను ఏ భాషాభాగంతో వాక్యాన్ని ప్రారంభించాడో వాక్యం పూర్తయ్యే వరకు స్వయంగా రచయితే మరిచిపోయే స్థితి రావడం ఏమాత్రం వాంఛనీయం కాదు. వాక్యంలోని కర్త, కర్మలతో క్రియాన్వయం ఉండేట్టు చూసుకోవడం రచయిత బాధ్యత. అనేక విషయాలను ఒకే వాక్యంలో చెప్పాలనే కుతూహలం వల్లకూడా సుదీర్ఘ వాక్యాలు తయారవుతుంటాయి.

'ప్రభుత్వం మాత్రం రైతులకు ఎలాంటి తోడ్పాటును అందించకపోగా, కార్పోరేట్ కంపెనీలకు తలొగ్గి వాటి విధానాలను రైతులపై రుద్దుతూ వారు ఆత్మహత్యలు చేసుకునేందుకు ప్రభుత్వాలే కారణమవుతున్నాయి. (విద్యార్థి గళం. సెప్టెంబర్. 2014)

'ప్రభుత్వం మాత్రం రైతులకు ఎలాంటి తోడ్పాటును అందించడంలేదు; పైగా కార్పోరేట్ కంపెనీలకు తలొగ్గి, వాటి విధానాలను రైతులపై రుద్దుతోంది. తత్ఫలితంగా ప్రభుత్వాలే రైతుల ఆత్మహత్యలకు కారణమౌతున్నాయి.' అనే మూడు వాక్యాలుగా విభజించుకొని రాస్తే బాగుంటుందేమో ఆలోచించాల్సి ఉంది. పై వాక్యంలో కింద గీత గీసిన పదాల అనవసర పునరుక్తిని కూడా పరిహరించవచ్చుననిపిస్తుంది. రచయితకు ప్రజలపై ఎంత మమత ఉంటుందో వారి కష్టాల గురించి రాసిన తన రచనపై అంత నిర్మమత ఉండాలి. అప్పుడే తాను రాసిన రచనను తిరిగి సరిచేసుకోగలడు.

**ఈ కింది వాక్యంలో రచయిత పెట్టిన హింస 'రచన' చూడండి.**

"తెలంగాణలో హైదరాబాదు నగర నడిబొడ్డున విద్యానగర్‌లో దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో దుర్గాభాయి దేశ్‌ముఖ్ గారి పేర ఆంధ్ర మహిళా సభ పేరిట నిర్మించిన ఆసుపత్రిని నేడు శ్రీమతి దుర్గాబాయ్ గారి సేవ దృక్పథంతో సంబంధం లేకుండా వ్యాపార దృక్పథంతో నడిపిస్తున్న సీమాంధ్ర యాజమాన్యం తెలంగాణకు చెందిన సేవ దృక్పథంతో సంబంధం లేకుండా వ్యాపార దృక్పథంతో నడిపిస్తున్న యాజమాన్యం తెలంగాణకు చెందిన కార్మికులకు అత్యల్ప జీతాలు చెల్లిస్తూ, చీటికి, మాటికి మెమోలు, సస్పెన్షన్స్ ఒక రోజు పనికి రాకుంటే రెండు రోజులు జీతం కట్ చేయడం, మరోవైపు సీమాంధ్రకు చెందిన కార్మికులకు అక్రమ ప్రమోషన్స్, ఆకర్షణీయమైన జీతాలు చెల్లించటం, డ్యూటీకి రాకున్నా వారికి వేతనాలు చెల్లించటం, డ్యూటికి రాకున్నా అందలం ఎక్కించటం చేసేవారు." (తెలంగాణ కార్మిక పథం. జనవరి-2015:3)

**ముగింపు:**

ఈ వ్యాస రచనకోసం ఉపయోగించిన ఆకర మాస పత్రికల్లో రాస్తున్నవాళ్లలో చాలామంది విద్యనందుకొన్న మొదటితరంవారు. బహుశా, వారి సామాజిక నేపథ్యాలు, మానసిక స్థితికూడ వారి రచనాభాషను ప్రభావితం చేస్తుందంటూ ఈ వ్యాస ప్రారంభంలో చెప్పిన విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. అదే క్రమంలో ఆయా రచయతలు ఆ పరిమితుల్ని అధిగమించాల్సి ఉంటుంది. ఆధునిక రచనా భాషలో చోటుచేసుకుంటోన్న భాషావిశేషాలను అధ్యయనం చేస్తూ, సరళమైన వాక్యంలో భావాల్ని వ్యక్తంచేయడానికి ప్రతి రచయితా కృషిచేస్తారని ఆశిస్తున్నాను.

**వ్యాస రచనకు ఉపయోగపడిన పుస్తకాలు/నోట్స్:**


చెంచయ్య, వి. 2009. వ్యాస రచనా శిల్పం. విప్లవ రచయితల సంఘం: నెల్లూరు.

రామారావు, చేకూరి. 2014. ఎమ్. ఏ. తెలుగు- తెలుగు వ్యాకరణ పరిణామం, ఛందో అలంకార పరిచయం. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం: హైదరాబాదు.

వేణు గోపాల్, ఎన్. 2010. వ్యాస రచన మౌలికాంశాలు నోట్స్: హైదరాబాదు. అముద్రితం.


**ఈ వ్యాస రచనకు ఉపయోగించిన ప్రధాన ఆకరాలు:**


జగన్, కె. (సంపా.). సెప్టెంబర్, అక్టోబర్-2014. మా తెలంగాణ విద్యార్థి గళం:హైదరాబాదు.

దేవేంద్ర (సంపా.). జులై, ఆగస్టు-2015. మహిళామార్గం ద్వైమాసిక పత్రిక. మహిళా మార్గం ప్రచురణలు: హైదరాబాదు.

నర్సాగౌడ్, అమరవేణి (సంపా.) జనవరి, మార్చి-2015. తెలంగాణ కార్మిక పథం. హైదరాబాదు.

రవిబాబు, కొత్తపల్లి (సంపా.). ఆగస్టు, 2016. ప్రజాసాహితి సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక: విజయవాడ

వెంకట రామకృష్ణారావు, దువ్వూరి (సంపా.). జులై, 2016. అరుణతార సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక: హైదరాబాదు.

వేణుగోపాల్, ఎన్. (సంపా.). ఫిబ్రవరి, 2017. వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక: హైదరాబాదు.

స్నేహలత, ఎం. (సంపా.). జనవరి, 2017. నడుస్తున్న తెలంగాణ ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాస పత్రిక: హైదరాబాదు.



వ్యాసకర్త తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల, హైదరాబాదు .

పసుపులేటి నాగమల్లిక
79813 64632

# సాహిత్య శిల్పి బాపిరాజు



**అడవి బాబిరాజు**
కనువెలుగు: 8 అక్టోబరు 1895
కనుమరుగు: 22 సెప్టెంబరు 1952

**మన** తెలుగుజాతి గర్వించదగ్గ వారిలో శ్రీ అడవి బాపిరాజు గారు ఒకరు. ఈయన గొప్ప చిత్ర కారుడు,నవలాకారుడు, కథకుడు, నాటకకర్త, వ్యాసకర్త, వక్త, జాతీయవాది, పత్రికా సంపాదకుడు, ఉత్తమ అధ్యాప కుడు, న్యాయవాది, నటుడు, అన్నింటికీ మించి ప్రప్రథమంగా తెలుగు సినీ చలన చిత్ర రంగాన కళాదర్శకత్వం చేపట్టిన కళాతపస్వి, బహుముఖ ప్రజ్ఞాశాలి. కళారాధనకే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు. కవిత్వంతోపాటు, సంగీత నాట్యాలలో కూడా పరిచయమున్న గొప్ప కళాకారుడాయన.

శ్రీ బాపిరాజు గారు 1895 అక్టోబరు 8వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని సరిపల్లె గ్రామంలో జన్మించారు. భీమవరం, నరసాపురంలో హైస్కూలు చదువు పూర్తయ్యాక, రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో బి.ఏ. డిగ్రీ చేశారు. ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్డ్ కూల్డ్రే ఆంగ్ల భాషా కోవిదుడేకాక, ఆంగ్లంలో గొప్ప కవి, చిత్రకారుడు కూడా. శ్రీ బాపిరాజు కళాజీవితానికి నాందీ ప్రస్తావన చేసింది ఆ కళాశాల ప్రిన్సిపాల్ 'కూల్డ్రే' అని శ్రీ బాపిరాజు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తనపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచేవారని, ఎంతో ఆత్మీయతతో బోధిస్తూ, కళాదృష్టి ప్రసాదించారని శ్రీ బాపిరాజు అనేవారు. 'కూల్డ్రే' ప్రోత్సాహంతోనే చిత్రకారుడిగా రాణించానని ఆయన చెప్పుకున్నారు. బి.ఏ. డిగ్రీ పూర్తయ్యాక కొంతకాలం జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత మచిలీపట్నంలోని జాతీయ కళాశాలలో చేరి శ్రీ ప్రమోద కుమార చటర్జీ వద్ద చిత్రలేఖనం అభ్యసించారు. శిల్పకళలోనూ, చిత్రలేఖనంలోనూ అనేక మెళకువలను చటర్జీ వద్ద శ్రీ బాపిరాజు నేర్చారు. ఆ తర్వాత మద్రాసులోని 'లా' కళాశాలలో న్యాయశాస్త్రంలో బి.ఎల్. పట్టా పొంది స్వగ్రామం భీమవరంలో న్యాయవాద వృత్తి చేపట్టారు. అయితే సుమారు ఏడాది కాలం మాత్రం న్యాయవాదిగా పనిచేసి, 1935లో బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేరారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా తన గురువు కూల్డ్రే మహాశయుని ఆదర్శంగా సుమారు నాల్గు సంవత్సరాలు బందరు జాతీయ కళాశాలలో పనిచేశారు.

ఆ తర్వాత తెలుగు చలనచిత్ర రంగంలో కళాదర్శకునిగా శ్రీ సి. పుల్లయ్య నిర్మించిన 'సతీ అనసూయ', 'ధ్రువ విజయం' 'మీరాబాయి' చిత్రాలకు కళాదర్శకత్వం నిర్వహించారు. ఆ రకంగా తెలుగు చలనచిత్ర రంగంలో తొలి కళాదర్శకులుగా శ్రీ బాపిరాజు మంచిపేరు సంపాదించారు. చలనచిత్ర నిర్మాణం తొలిరోజుల్లో 1930 ప్రాంతంలో ప్రత్యేకించి కళాదర్శకులంటూ వేరే ఉండేవారు కాదు.ఆ లోటును తొలిసారిగా కళానిధి శ్రీ బాపిరాజే తీర్చారు. అంతేకాదు, కళాదర్శకత్వానికి శ్రీ బాపిరాజు ఒక ప్రత్యేకస్థానం, గుర్తింపుతోపాటు, నేటి పలువురు కళాదర్శకులకు ఆదర్శంగా నిల్చారు.

అయితే, చిత్రరంగాన ఎక్కువకాలం స్థిరపడక, హైదరాబాద్ నుండి వెలువడే 'మీజాన్' దినపత్రిక సంపాదక బాధ్యతలు చేపట్టారు. తెలంగాణా ప్రాంతంలో ఆనాడు (1943) మీజాన్ పత్రికకు విశేష సంఖ్యలో పాఠకులుండేవారు. ఈ పత్రికలో 1943 నుండి1946 వరకు సంపాదకులుగా పనిచేశారు. వీరికి రచయితగా మంచిపేరు తెచ్చిపెట్టింది మీజాన్ పత్రికనే చెప్పాలి. శ్రీ బాపిరాజు తాను రాసిన నవలలు- కోనంగి, గోనగన్నారెడ్డి, నారాయణరావు, హిమబిందు, అడవి శాంతిశ్రీ, తుపాను, వీటిలో కొన్నింటిని మీజాన్ పత్రికలో సీరియల్స్‌గా రాస్తూ, ఆ తర్వాత పుస్తకరూపంలో ప్రచురించారు. పత్రికారంగంలో ఎందర్నో ఉత్తమ జర్నలిస్టులుగా వీరు తీర్చిదిద్దారు. పత్రికా రచనలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. అయితే, నిజాం నిరంకుశపాలన, రజాకారుల దుండగాలను వ్యతిరేకిస్తూ, పత్రిక సంపాదకత్వాన్ని వదలి, గుంటూరులో కళాపీఠాన్ని నెలకొల్పారు. ఇక్కడ ఎందరికో చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు.

బాపిరాజుగారి చిత్రాలలో 'శబ్దబ్రహ్మ' భాగవత పురుష, సూర్యదేవ, సముద్రగుప్తుడు, రాధాకృష్ణ, గౌరీశంకరులు, శశికళ, మృత్యుంజయుడు, నటరాజు ఆనంద తాండవం, నాగనృత్యం, తిక్కన, మీరాబాయి ఇలా అనేకం ప్రముఖమైనవి. శ్రీ బాపిరాజు విశ్వనాథ వారి కిన్నెరసాని పాటలకు, నండూరి వారి ఎంకి పాటలకు చక్కని రేఖాచిత్రాలు గీసి ఆ గీతాలకు జీవం పోశారు. బాపిరాజుగారి శబ్దబ్రహ్మ చిత్రం డెన్మార్కులోని చిత్రప్రదర్శనశాలలో, పదిల పరచబడింది. భాగవత పురుష చిత్రం,తిరువాన్కూరులోనూ, సూర్యదేవ చిత్రం బీహార్‌లో, ఇలా అనేక చిత్రాలు పలు ప్రముఖుల ఇళ్ళలో అలంకరణాలుగా

**తరువాయి 47వ పుటలో....**

ఏటూరు జ్యోతి
92484 14442

# రావిశాస్త్రి వ్యాసాలు - సాహిత్య దృక్పథం

**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో రావిశాస్త్రి గారిది విలక్షణమైన శైలి. రావిశాస్త్రి రచనల్లో కథలు, నవలలు, నాటకాలు, దాదాపు 56 వ్యాసాలు రాసారు. సాంఘిక ప్రయోజనం ప్రధానంగా సాహిత్యాన్ని సృష్టించారు. సమాజాన్ని, మానవులను దగ్గరగా పరిశీలించిన వీరు మంచి చెడుల విలక్షణ జ్ఞానాన్ని పెంచడానికి రచన చేయాలని, అదే రచయితల కర్తవ్యం కావాలని చాలా సందర్భాల్లో చెపుతుంటాడు. వీరు రాసిన వ్యాసాల్లో సాహిత్యదృక్పథాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం. దాదాపుగా వీరి వ్యాసాలు 56 వరకు ఉన్నాయి.

నల్గొండ జిల్లా రచయితల మూడవ మహాసభలో 1983 సం॥లో రావిశాస్త్రిగారు పాల్గొని 'తెలుగు నవలా వికాసం' అనే అంశంపై ప్రసంగించిన వ్యాసంలో విశాఖపట్టణంలో జరిగే సాహిత్య సమావేశాల్లో కనిపించే ఉద్రేకం, ఉత్సాహం మళ్ళీ నల్లగొండలో కనిపించింది అంటారు. సినిమాలపై ఉన్న ఆసక్తి సాహిత్యంపై కనిపించదు జనాలకి. కాని నల్లగొండలో ఒక చైతన్యం కనిపిస్తుంది అని అంటాడు. సమాజంలో సంక్షోభాన్ని బట్టి సాహిత్యానికి విలువ వస్తుంది. పేదలకు పేదలను పీడించే వారికి మధ్య జరిగే సంఘర్షణను చిత్రించగలిగేదే నిజమైన సాహిత్యం. జనం మధ్య అనేక తరగతులుంటాయి. వాటి మధ్య కీచులాటలు ఉంటాయి. ఘర్షణ ఉంటుంది. కులాల మధ్య, ప్రాంతాల మధ్య కూడా గొడవలుంటాయి. ఈ ఘర్షణను, కీచులాటల్ని ప్రభుత్వం తప్పు దారి పట్టించాలని చూస్తుంది. కాని అసలు కీచులాట డబ్బున్న వారికి, డబ్బు లేనివారికీ మధ్య జరుగుతుంది. కాబట్టి రచయిత ఇది తెలుసుకుని అవగాహనతో, చైతన్యంతోరాసి, అసలు సంఘర్షణని ఉన్నవారికి, లేనివారికి మధ్య పెంచాలి. అది రచయితల లక్ష్యం కావాలని అభిప్రాయపడతాడు.

అలాగే కథలు రాయొచ్చు, ఆషామాషీ కథలు రాయడం సులభం కాని కన్యాశుల్కంలాగా, నిష్కర్షగా సమాజం దుమ్ము దులుపుతూ రచన చేయడం చాలా కష్టమైనపని. షేక్స్పియర్ ప్రభావం నుంచి ఇంగ్లిష్ భాష తప్పించుకోలేదు. అట్లాగే శ్రీశ్రీ ప్రభావం నుంచి తెలుగుసాహిత్యం తప్పించుకోలేదు. కొందరు శ్రీశ్రీని కించపరచాలని చూస్తున్నారు. కావాలని తగాదాలు రేపుతున్నారు. ఇది సాధ్యం కాదు, సాగేపని కాదు అని సభాముఖంగా ఖరాఖండిగా చెప్పడం, శ్రీశ్రీగారి ప్రభావం తెలుగు ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యంలో ఒక మలుపుగా చెప్పారు.

రావిశాస్త్రి గారికి నచ్చిన పాత్రగా 'విశాలాక్షి' పాత్ర గురించి చెప్పారు. 1952 సం॥లో 'జరీ అంచుతెల్లచీర' కథలో పాత్ర, అన్నం మొహం ఎపుడో చూసే పిల్లలు కూడా ఏడాదికోసారైనా పెరుగన్నం తినడానికి ఇష్టపడుతారు. ఇది చాలా సహజం. తాము ఏ తప్పు చేయనప్పటికి దుర్భర దారిద్ర్యంతో భరించలేని బాధతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యేవాళ్ళని చూస్తే చాలా జాలి కలుగుతుంది. కాని ఆ జాలి కలగడం వల్ల అవతలవారి కష్టాలు, కారణాలు జారిపోవు, పారిపోవు, కాలిపోవు, కరిగిపోవు, ఆ జాలి ఎంతో కోపంగా మారాలి. కోపం పంతంగా మారి పట్టుదలగా పెరగాలి. ఆ పట్టుదల లోకపు అన్యాయాన్ని బాధల్ని అంతమొందించేందుకు ఆజ్యం పోసిన అగ్గి నిప్పులామారి, అన్యాయాల కారణాలని కాల్చి పారేయడానికి మనిషిని కార్యరంగంలోకి దించాలి అనే విషయం ఈ కథరాసే కాలానికి తెలియలేదు. ఈ దుర్మార్గపు సమాజంలో బాధలకి తట్టుకోలేక, అందు గురించి ఏం చేయ్యాలో తెలియక, తెల్లవార్లు ఏడుస్తూ కూర్చున్న పెద్దకళ్ళ పేదపిల్ల విశాలాక్షి. నా కూతురు, మీ చెల్లెలు, ఈమె కన్నీటి కష్టం అందువల్ల విశాలాక్షి అంటే అంత ఇష్టం. హృదయానికి హత్తుకునే పాత్రగా తీర్చిదిద్దినట్లు చెప్తారు.

రచయితకు ఉండాల్సిన దృక్పథం గురించి చెపుతూ కొంతమంది వస్తువుకు ప్రాధాన్యత ఇస్తారు. నేను చమక్కులు చొప్పిస్తాను. చమ్కీనుంచి వచ్చిందే చమక్కు. చమక్కులు చూపించినందుకు ప్రజలకు, పేద ప్రజలకు పనికొచ్చే రచనలు నాకు బాగా నచ్చుతాయి. రచయితలు ప్రజల వైపు ఉండాలి. వారిని సమర్థిస్తూ రాయాలి. సంఘంలో జరుగుతున్న మంచి, చెడులను తెలుసుకోవాలి. ఒక దృక్పథం అలవరచుకోవాలి. అపుడే రాయాలి. అలాంటి రచనలే నిలబడుతాయి. సంఘంలో ఏం జరుగుతుందో తెలియకుండా ఎవరూ రచనలు చేయరు. లోతుపాతులు బాగా తెలుసుకోవాలి. మంచి చెడ్డలని రచయిత గుర్తించాలి. నిజాయితీ గల వ్యక్తి సమాజానికి చెడుచేస్తే అందరూ తిడతారు. అందుకే దృక్పథం చాలా అవసరం అని అంటారు.

విప్లవ రచయితల గురించి చెప్తూ హితవు చెప్పేది సాహిత్యం ఎక్కువ మందికి హితవు చెప్పేది మంచి సాహిత్యం. సాహిత్యం వీళ్ళకి మేలు చేయాలని విప్లవ రచయితలు వీళ్ళని దృష్టిలో పెట్టుకుని రాస్తున్నారు. తమ రచనలను వీరికే అంకితం చేస్తున్నారు. ప్రభుత్వం ఊరుకుంటుందా? ఆనాడు భగవంతుడికి భాగవతం అంకితం చేస్తానన్నాడు పోతన. కాని ప్రభువులు అతని మీద విరుచుకుపడ్డారు. కాని ప్రభుత్వం విప్లవ రచయితల మీద దాడిచేస్తుంది. అయినప్పటికి వారు నిబ్బరంగా నిలబడుతున్నారు. జైలుపాలవుతున్నారు. ఆరోగ్యాలు కోల్పోయి ఆస్పత్రుల్లో మగ్గుతున్నారు. సమాజానికి కావల్సింది విప్లవ రచయితలే అని రావిశాస్త్రి గారి అభిప్రాయం.

నవలా సాహిత్యం, కథా సాహిత్యం గురించి- యువతరం డబ్బు సంపాదనకే నవలలు, కథలు రాస్తున్నారు. కాని ఒక ఆశయం కోసం రాయడం లేదు. నవలాసాహిత్యం అయినా, కథాసాహిత్యం అయినా నిజానికి దగ్గరగా ఉండాలి. అది శోకం తెప్పించేదిగా ఉండాలి. కారుణ్యం రప్పించేదిగా ఉండాలి. లేదా ఈ వ్యవస్థ మీద కోపం తెప్పించేదిగా ఉండి, కోపం తెప్పించి వ్యవస్థను మార్చడానికి ప్రయత్నం చేసేదిగానయినా ఉండాలి.

నవలా సాహిత్యం కథాసాహిత్యం డబ్బుల కోసం రాయడం ప్రధానమైనపుడు దొంగరసాలే ప్రధానంగాని, ఈ వ్యవస్థను మార్చే ఏ

**తరువాయి 50వ పుటలో....**

మధురాంతకం నరేంద్ర
98662 43659

# ఎడింబరో నేర్పిన పాఠాలు

**స్కాట్లాండ్** రాజధాని ఎడింబరో నగరమంతా పెద్ద మ్యూజియంలాగే వుంటుంది. ఎడిరబరో కొత్త నగరమూ, పాత నగరమూ రెండూ యునెస్కో వాళ్ళు ప్రపంచ వారసత్వ స్థలాలుగా (world heritage site) గుర్తించబడ్డాయి. కానీ నగరంలో ప్రత్యేకమైన మ్యూజియాలు చాలా వున్నాయి. స్కాట్లాండు జాతీయ మ్యూజియం, స్కాట్లాండు జాతీయ గ్రంథాలయం, జాతీయ యుద్ధ మ్యూజియం, సర్జన్స్ హాల్ మ్యూజియం, రచయితల మ్యూజియం, బాల్యపు మ్యూజియం, మ్యూజియం ఆఫ్ మౌంట్స్ యిలా యెన్నెన్నో మ్యూజియాలు. విలియంస్కాట్, రాబర్ట్‌బర్న్స్, విలియం కార్లయిల్, ఆర్థర్ కానన్‌డయిల్ మొదలైన అనేకమంది ప్రసిద్ధ రచయితల జన్మస్థలాల్లో వాళ్ళకు సంబంధించిన వస్తువుల్ని పదిలం చేసిన మ్యూజియాలున్నాయి.

యిక యింగ్లాండుకెళ్తే అక్కడున్న మ్యూజియాలు అసంఖ్యాకాలు. చార్లెన్‌డికెన్స్, డాక్టర్ జాన్సన్, జాన్‌కీట్స్, కారల్‌మార్క్స్, షెర్లాక్ హోమ్స్ (కానన డయల్ సృష్టించిన డిటెక్టివ్) మొదలైన చాలామంది రచయితలకు ప్రత్యేకంగా మ్యూజియాలు వున్నాయి. యిక షేక్స్‌పియర్ వూరు స్ట్రాట్‌ఫర్డ్ అపాన్ మేకన్ జేన్ ఆస్టిన్ నివసించిన హాంఫ్‌షైర్ కాటేజీ, జార్జిఎలియట్ స్వంతవూరు కవెంట్రీలలో వాళ్ళయిళ్ళూ, వస్తువుల్ని జాగ్రత్తచేసిన మ్యూజియాలు ప్రసిద్ధాలు.

స్కాట్లాండులోనూ యింగ్లాండులోనూ వున్న యీమ్యూజియంలను చూసినప్పుడు అయిదారు శతాబ్దాల చరిత్రమాత్రమే వున్న ఆ ప్రాంతాల్లోని ప్రసిద్ధ స్థలాలను, ప్రముఖ వ్యక్తుల వస్తువులనూ పదిలపరిచిన తీరు భారతదేశంనుంచీ, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌నుంచీ వెళ్ళిన నావంటి వారికి విస్మయం కలిగించడంలో ఆశ్చర్యంలేదు. గత అయిదారు దశాబ్దాలలోనే చిత్తూరుజిల్లా వంటి ప్రాంతంలో పురాతన చరిత్రకు జరుగుతున్న నిరాదరణ గుర్తుకొచ్చి నిరాశ పడడం తప్పదు.

చిత్తూరు జిల్లా అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది తిరుమల క్షేత్రమే! అయిదారు దశాబ్దాలలో పల్లెనుంచీ నగరంగా మారిన తిరుపతిలో విస్తరణ పేరుతో పోగొట్టుకున్న చారిత్రక నిర్మాణాలు చాలా వున్నాయి. కపిలతీర్థం దగ్గరిలో యిప్పుడు ఖాదీకాలనీ ఉంటున్న ప్రదేశంలో పెద్దగాలిగోపురం వుండడం నాకు బాగా తెలుసు. దాన్ని పూర్తిగా విప్పి అలిపిరి దగ్గర పునర్మించారు. అయితే ఆకొత్త గోపురానికీ పాత గోపురానికీ పోలికేలేదు. తిరుపతి పట్టణంలో వుంటే నాలుగుకాళ్ళ మండపం, కృష్ణాపురం టాణావంటి ప్రదేశాల పేర్లయితే మిగిలాయిగానీ ఆ పాత నిర్మాణాలు మాయమైపోయాయి. తిరుపతి బజారువీధిలో గంగుండ్ర మండపం అనే చిన్న వీధి వుంది. తిరుమల రామచంద్రగారు అది గంగైకొండ చోళమండపం అని వోసారి చెప్పారు. దాని వెనకున్న చరిత్ర యేమిటో చెప్పేవారులేరు. పూర్వోవొకప్పుడుండిన పాత మండపాలు క్రమంగా మాయమైపోయాయి. సుదూర ప్రాంతాలనుంచీ తిరుమలకొచ్చే యాత్రికులకోసం వివిధ కాలాల్లో చాలామంది రాజులు దారిలో బసచేయడంకోసం మండపాలు కట్టారు. వాటిలో చాలా యిప్పుడు శిధిలమైపోయి కనబడతాయి. నగరి పట్టణానికి శివార్లో యింకా గట్టిగా నిలబడిన రాతి స్థంభాలమండపం బిక్షగాళ్ళనివాసంగా మారిపోయింది.

తిరుపతి నుంచీ చంద్రగిరికెళ్ళేదారిలో తొంతవాడ అనే కుగ్రామానికి దగ్గర బస్సుదారి పక్కనే సగం వరకూ కట్టి ఆగిపోయినదో లేక సగంమాత్రమే మిగిలి కూలిపోయినదో అయిన గాలిగోపురమొకటి దశాబ్దాలుగా దీనంగా కనబడుతూనే వుంది. దానిలోంచి యెన్నిరాళ్ళు వెళ్ళిపోయాయో చెప్పగలిగేవాళ్ళులేరు.


చంద్రగిరి దగ్గరి అసంపూర్ణ గాలిగోపురం

యిక తిరుపతికి దగ్గరిలో వున్న ప్రసిద్ధమైన చంద్రగిరికోటలో గత అయిదారు దశాబ్దాల్లోనే చాలా మార్పులొచ్చాయి. అత్యంత పురాతన వస్తుశాఖవాళ్లు కార్యాలయం వుంది. లైట్ అండ్ షేర్ అనే సంగీత


చంద్రగిరికోట

కార్యక్రమంగూడా వుంది. అయితే కిందవున్న కోట దగ్గరినుంచీ పక్కనేవున్న కొంతపైవరకూ వొకప్పుడుండిన అందమైన మెట్లబాట పూర్తిగా పడిపోయింది. కొండపైన విశాలమైన బండపైన సైనికులుండడానికవసరమైన మండపాలూ, కోనేర్లూవున్నాయి. ముప్పయి నలభై సంవత్సరాలక్రితం చాలామంది కొండపైకెక్కి తిరిగి వచ్చేవాళ్ళు. చూస్తూండగానే ఆదారి శిధిలమైపోయింది.

చిత్తూరుజిల్లాలో యెన్ని చారిత్రక విశేషాలున్నాయో పట్టించుకునేవాళ్ళులేరు. చిత్తూరుపట్టణం దాదాపు శతాబ్దంగా జిల్లా రాజధానిగా వుంది. ఆ వూర్లో వొకప్పుడొక వెలుగు వెలిగిన రామవిలాస సభను యిప్పుడు యెక్కడుందా అని వెదుక్కోవలసివస్తోంది. స్వాతంత్ర్యానికి ముందు చాలామంది బ్రిటీషువాళ్ల సమావేశాలుండేవి. వాటికి చారిత్రక ప్రాముఖ్యత చాలా వుంది. వాటిని పదిలపరచాలని యెవరూ అనుకోనేలేదు.

చిత్తూరుకు పదికిలోమీటర్ల దూరంలో నరసింగరాయనిపేట అనే చిన్నవూరువుంది. ఆవూర్లో హైదరాల సమాధి వుందనే విషయం తెలిస్తే అందరూ ఆశ్చర్యపడతారు. అక్కడది అనామకంగా నిరాదరణకుగురైవుంది. అదేవూర్లో శ్రీలంకభవనమనే పెద్ద మహీది వుంది. శ్రీలంక చివరి రాజులు బ్రిటీషువాళ్ళు తరిమేస్తే ఆవూరొచ్చి ఆ మహాదీ కట్టుకుని కొన్ని దశాబ్దాలు జీవించారు. శ్రీలంక చివరిరాజులను బ్రిటీషువాళ్ళు వేలూరు జైలుకు పంపారు. ఆరాజుల సమాధులు వేలూరు పక్కనున్న చెయ్యేరు అనే చిన్ననదిగట్టుపై వున్నాయి.

టిప్పుసుల్తాను తండ్రి హైదరాలీ చిత్తూరుజిల్లాలో మదనపల్లిదగ్గర వున్న గుర్రం కొండ నవాబు కూతుర్ని పెళ్ళిచేసుకున్నారు. గుర్రం కొండలో వున్న కోటకూ మహత్కుకూ చారిత్రకంగా యెంతో ప్రాముఖ్యత వుందని యెవరూ గుర్తించలేదు.

మదనపల్లెలోని తియోసాఫికల్ కాలేజీని శతాబ్దక్రితం అనీబిసెంటు కట్టించారు. ఆ వూల్లోని అప్పటి బ్రిటీషు దేశస్థులయిండ్లు యేమయ్యాయో తెలియదు. రవీంద్రనాథ టాగూరు ఆ కాలేజీలో నెలపైగా వున్నప్పుడు పక్కనే వున్న పెంకుటింట్లో వున్నారు. ఆ యింటిని మ్యూజియంగా జాగ్రత్తచేయాలన్న ఆలోచనైనా లేదు. చాలారోజులపాటు అనామకంగా పడివున్న జిడ్డు కృష్ణమూర్తి, పుట్టిన యిల్లును యిటీవలే కృష్ణమూర్తి ఫౌండేషన్‌వాళ్ళు స్వాధీనంచేసుకున్నారు.

చిత్తూరు జిల్లాలో గత నాలుగైదు దశాబ్దాల్లోనే శిధిలమై పడిపోయిన కోటలూ, మహల్లూ చాలావున్నాయి. కుప్పం దగ్గరి కంగుందిలో కోట శిధిలాలు మాత్రమే మిగిలాయి. కార్వేటి నగరంలో రాజులు మందిరంలో కొంతకాలంపాటు పాఠశాలను, కళాశాలనూ నిర్వహించారు. సరైన మరమ్మత్తులు చేయకపోవడంతో అది పూర్తిగా శిధిలమైపోయింది. కార్వేటి నగరంలో గుడి దగ్గరవుండే కోనేరు నిర్మాణం విశిష్టంగావుంటుంది. దాని మెట్లను శాస్త్రీయంగా నిర్మించడం చేత నీళ్లు అన్ని వైపులా వొకే మెట్టువరకూ వస్తాయి.

కుప్పం పట్టణంలోని జమీందారుల కోట యిప్పుడు కేవలం వొక ప్రాంతపు సూచిగా మాత్రమే మిగిలింది. కోటలో చాలాభాగం కాలేజీలకు, వివిధ సంస్థలకూ యిచ్చేశారు. సరైనా పునరుద్ధరణ పనులు



కుప్పం దగ్గరి కంగుంది కోట

చేయకపోవడంతో అది పాత అవశేషంగా మాత్రమే కనబడుతుంది.

భారతదేశంలో తొలి క్రీస్తు మత వ్యాప్తి జరిగిన ప్రదేశాల్లో పుంగనూరు వొకటి. ఆ వూర్లోనే తంతి కన్నడ కవిత్రయంలోని ప్రముఖకవి పొన్న పుట్టారని చరిత్ర చెప్తోంది. అయితే యీ విషయాలను నిరూపించే చారిత్రక సాక్ష్యాలను కాపాడుకోలేదు. పోనీ వెతికి పట్టుకునే పనీ జరగలేదు.

చిత్తూరు జిల్లాలో ప్రసిద్ద దేవాలయాలు చాలా వున్నాయి. భక్తితోనూ భక్తులతోన ముడి పడివుండడంతో అవి యెప్పుడూ జనాలతో కిక్కిరిసి పోయివుంటాయి. యెంతో చారిత్రకతను కాపాడడంలో సరైన దృష్టిలేదు. పెరిగిపోతున్న జనాలకోనం అధునాతన సౌకర్యాలను సమకూరుస్తున్నప్పుడు చారిత్రకమండపాలనూ, గోపురాలనూ కూల్చివేయడంకూడా జరుగుతోంది.

పురావస్తు శాఖ అనే ప్రత్యేక ప్రభుత్వ విభాగమూ, చారిత్రక పర్యటన శాఖ అనే ప్రత్యేక మంత్రిత్వ శాఖ రాష్ట్ర కేంద్రప్రభుత్వాలలో వున్నాయి. యెంతో చరిత్రవున్న అవకాశంవుంది. చిత్తూరు జిల్లా చారిత్రక ప్రదేశాల పరిస్థితి మొత్తం దేశంలోని అన్ని ప్రాంతాలలో వున్న పరిస్థితికి వుదాహరణ మాత్రమే! వీటినిలాగే పట్టించుకోకపోతే యిప్పుడు మిగిలిన యీ కొన్ని గత క్రమంగా చరిత్రలో మునిగిపోతాయి.

చారిత్రక ప్రాధాన్యమున్న యీ ప్రదేశాలనంతా పరిరక్షించి, కాకపోతే వాటికవే స్వయంపోషకాలుగా మారతాయి. కొత్త వుద్యోగాలను తయారు చేస్తాయి. చారిత్రక ప్రాధాన్యమున్న ప్రతి ప్రదేశంలోనూ కార్యాలయమూ, వుద్యోగులూ వుండాలి. సందర్శకుల దగ్గర వీలయినంత తక్కువలో టికెట్లు కొనిపించాలి. ప్రతిచోట ఆ ప్రాంతాన్ని గురించి సవివరంగా సందర్శకులకు తెలియజేసే గైడ్లు వుండాలి. మ్యూజియంలు కేవలం ప్రదర్శన శాలలు మాత్రమేగాకుండా చారిత్రక అవగాహనను కలిగించే విద్యాలయాలుగా గూడా వుండాలి. మనదైన విశిష్టమైన సంస్కృతీ నాగరికతలను పరిరక్షించుకునే సాధనాలుగా మారాలి. మనకంటే తక్కువ చరిత్రవున్న పాశ్చాత్య దేశాలనుంచీ మనం నేర్చుకోవలసిన పాఠం యిది. గ్రంథాలయాలూ, మ్యూజియంలు చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు. యిప్పటికైనా మనం పాఠం నేర్చుకోకపోతే చరిత్రహీనులుగా మాత్రమే మిగులుతాము.

పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'కంప్యూటర్‌కు తెలుగు నేర్పలేమా?'

## నుండి 'జీ పి యస్‌తో అక్షాంశ రేఖాంశాలకు మన ఊళ్ళో స్థలాల పేర్లు జోడించలేమా!' దాకా

## '**బతుకు తెరువులు** పట్టించుకోకుండా భాషను బతికించుకోలేం'



**పూళ్ళ** తరువాత ఊళ్ళు , మధ్యలో ఎన్నో తావులు; ఒక ఊరి పొలిమేర అయిపోతే, మరొక ఊరి పొలిమేర మొదలౌతుంది.ప్రాంతాలు దాటుతున్నకొద్దీ, ఒక మాండలికంనుండి మరో మాండలికం; ఒక భాషలోంచి మరోభాషలోకి-ఒక సీమలోంచి మరో సీమ లోకి- ప్రతి సీమలో చోటులో,తావులో ప్రతివివరం, దాని ప్రత్యేకత అందరికీ తెలిసే ఉంటుంది (cognitive appratus). ఇచ్చిపుచ్చుకుంటూ ఉజ్జాయింపుగా(approximate) లెక్కలేసుకుంటూ, సర్దుకుపోతూ సాగిపోయే ఈ సంప్రదాయంలోకి - పటాలు , ఖచ్చితమైన కొలతలు (accurate).. అక్షాంశ రేఖాంశాలు... వగైరాలతో ఆధునికత చొరబడింది అంటూ, బెంగాల్‌లో, ప్రసిద్ధ సంప్రదాయ అధ్యయన కేంద్రం నవద్వీపం/నాడియాలో పుట్టి, జవహర్ లాల్ నెహ్రు విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొంది, ఇప్పుడు కొలంబియాలో చదువు చెపుతున్న, సుదీప్త కవిరాజ్ మన గ్రామీణ పద్ధతులమీద తెల్లవాళ్ళు రుద్దిన క్రమాన్ని వివరిస్తాడు. ఈ రుద్దుడును పటాలాలతోకాక పటాలతో దండయాత్రగా (cartographic invasion) మరో మానవ శాస్త్రవేత్త అర్జున్ అప్పాదురై పేర్కొంటాడు.

Villages do of course begin and end, and therefore have their boundaries.— It is important to stress that this traditional world is a world without maps. And therefore devoid of a special mentality, inextricable from modern identity which thinks in terms of mapped spaces and its corollary measured distances. beyond the village the boundedness of regions ,sub regions……boundaries do exist ,things, spaces, groups ,do begin and end. But they tend to shade off, merge graduate .it is different way of organizing differences from modern one with which we are familiar.(Language and Politics in India. Ed. Asha Sarangi. OXford universisity press 2007. 'Writing Speaking Being (by Sudipta Kaviraj in page 327).

19శతాబ్ది చివరి వరకు మన సహజ వనరులలో 80% ఉమ్మడివే. ఈ వనరులలో ఫలసాయాన్ని వస్తు మార్పిడి/ ఇచ్చి పుచ్చుకోవటం ద్వారా పంచుకుంటూ మన పేద ప్రజలు జీవనం సాగించే వారు. అంటాడు న్యాయ కోవిదుడు ఛత్రపతి సింగ్.

Until the end of the 19th century and in all historical periods before that ,at least 80 india's natural resources were common property, only 20 privately utilized. This extensive common property provided the resource base for non cash , non market economy. (Common property and common poverty . Chatrapati Singh oxford.1995.)

దారిద్ర్యం అంటే సొమ్ములు/ వస్తువులు అంతులేకుండా పోగేసుకోలేక పోవటం కాదు, ఉమ్మడివనరుల మీద కనీస సాధన సామగ్రితో జీవనం సాగించే వారు దరిద్రులు కారు. కాని అభివృద్ధి పేరిట, వీరిని మార్కెట్ కు రొక్కానికి ముడిపెట్టి, వాళ్ళ కు ఆధారమైన వనరులు స్వాధీనం చేసుకుని ,నిరాధారులు,నిర్వాసితులుగా చేసి, వాళ్ళను దరిద్రంలోకి తోశాం. అని దరిద్రులను పెంచడంలో అభివృద్ధి లబ్దిదారులైన బుద్ధిజీవుల పాత్రను చిత్రిస్తారు వందనా శివ.

'Culturally perceived, poverty need not be real material poverty.




Subsistence economies which satisfy basic needs through self provisioning are not poor. Yet ideology of development declares them so because they do not participate overwhelmingly in market economy and do not consume commodities produced for and distributed through the markets'. 'It is useful to separate a cultural conception of subsistence living as poverty from the material experience of poverty that is the result of dipossesion and deprivation. (Staying Alive Vandana Siva ZED. London 1989.

ఈ ఆధునికత, సాంస్కృతికంగా విసిరిన సవాళ్లను సమన్వయించటానికి గాంధీ, టాగోర్,రామమోహనరాయ్, విద్యాసాగర్, వీరేశలింగం ః- ఎందఱో వివిధ రంగాలలో కృషి చేశారు.మరి బుర్రలో గుర్తులతో ,ఉజ్జాయింపు లెక్కలతో, మసక తర్కంతో (fuzzy logic) కొనసాగే సంప్రదాయానికి- అభివృద్ధి పేరిట పటాలు, లెక్కలు ...వగైరా ఆధునిక పటాటోపంతో పెత్తనం చేసే అధికారకేంద్రాలు, ఈ తేడాలను సమన్వయం చేసే పనికి పూనుకోటం లేదు అని విమర్శిస్తాడు- జియాలజీ నుండి చరిత్రలోకి మారి, ఆస్ట్రేలియా నుండి చికాగోకు తరలి ఇప్పుడు భూగోళంమీద మానవజాతి ప్రభావం (Anthropocene) విశ్లేషిస్తున్న మరో బెంగాలీబాబు దీపేశ్ చక్రవర్తి.

If cultural and other kind of differences is to be negotiated seriously, then we also need institutions that can handle fuzzy logic, with which the identities are built. The existing institutions in charge of producing and administering prosperity do not do that. (Habitations of Modernity. Dipesh Chakravarty. Permanent Black. 2002. page97.)

అయితే వీళ్ళంతా మేధావులు. **పాఠాలు చెప్పుకునే పంతుళ్ళు.ప్రజలకు కావలసిన చదువు చెప్పుకునే స్వతంత్రం వీరికి లేదు.మిగతా వాళ్ళు రచనలు చేస్తూ ,సినిమాలు తీస్తూ కళాపోషణ చేసే భద్రలోకంలో బుద్ధిజీవులు.**

కాని '65నుండీ, జనగణన ఉప సంచాలకుడుగా మానవ శాస్త్రజ్ఞుడు రాయ బర్మన్, విలేజ్ మోనోగ్రాఫ్, ఎథ్నో గ్రాఫిక్ నోట్స్ లద్వారా, 2010లో పీపుల్స్ ఆఫ్ ఇండియా ప్రణాళికద్వారా మానవ సర్వేక్షణ సంచాలకుడుగా సురేష్ కుమార్ సింగ్,ఈ సమన్వయానికి వేదిక సిద్ధం చేశారు.

ఈ పీపుల్స్ ఆఫ్ ఇండియా ప్రణాళిక, మనదేశంలో 91 సాంస్కృతిక క్షేత్రాలను గుర్తించింది. 85 జనం, ఆయా పర్యావరణంలోగల సహజవనరులమీదనే, ప్రత్యక్షంగా పరోక్షంగా బతుకు సాగిస్తున్నారని గమనించింది.2753 సమాజాలలోగల తీరుతెన్నులను 776 సాధారణ లక్షణాలుగా వర్గీకరించింది. వీటిలో వృత్తులు, వంటలు పంటలు,ఆట పాటలు, వాస్తు, వేషం భాష, కంచం, మంచం పొత్తుల విశేషాలు; చదువు






సంధ్యలు మొదలైనవి ఉన్నాయి. ఇంటి పేర్లను(ethnonyms) బట్టి సామాజిక వర్గం తెలుసుకునే ప్రయత్నం చేసింది. 1651 మాండలికాలు 325 భాషలకు చెందినవిగా, 25 లిపులుగల భాషలుగా, వీరిలో, రెండు భాషలు 65% మంది మాటాడుతుంటే; మూడు, ఇంకా ఎక్కువ భాషలు మాట్లాడేవారు గిరిజన ప్రాంతాలలోనే ఉన్నట్లు తెలుసుకుంది. ఈ వైవిధ్యాన్ని విడివిడి గదులు కాక, ఒక తేనేపట్టులో అరలుగా చూడాలని, ముందుమాటలో ప్రఖ్యాత మానవ శాస్త్రవేత్త యం.యన్ .శ్రీనివాస్, మనకు వీటిలో అంతస్సూత్రం ఎరుక పరుస్తాడు. అయితే ఇల్లలుకగానే పండుగ కాదు.

ఇంతకాలం చేసిన ఈ మేధో మధనం, పడుతున్న పురిటినొప్పులు (biological diversity act 2003) జీవ వైవిధ్య రక్షణ చట్టం, అటవీ హక్కుల గుర్తింపు (2006) అనే కవల పిల్లలను కన్నది. **అయితే ఈ పిల్లలను తెల్లవాళ్ళ పోతపాలతో కాక, చనుబాలతో/ అమ్మనుడితో పెంచాలంటే చాలా కృషి జరగాలి. చట్టాల మంత్రాలు వల్లిస్తే చింతకాయలు రాలవు.** ఇప్పటివరకు కంప్యూటర్‌కు భారతీయ భాషలు /తెలుగు నేర్పటానికి కృషి జరుగుతుంది. దీనికి తోడు, ఊళ్ళో ఉండే ఆయాతావుల పేర్లను(toponyms) అక్షాంశ రేఖాంశాలతో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జి.పి.యస్) ద్వారా జోడించాలి. అందుకు, ముందుగా జనానికి తమ పల్లె సంప్రదాయ సరిహద్దుల మధ్య పేర్లతో పటం గీయటం ద్వారా సన్నద్ధం చేయటం, జీవ వైవిధ్య పట్టిక తయారు చేయటం, ఈ గుర్తింపులో తొలిమెట్టు. భద్రాచలం కొత్తగూడెంజిల్లా కరకగూడెం మండలం బంగారుగూడెం గిరిజనులు 'మా వూళ్ళో మారాజ్యం' నినాదం ఆచరణలోకి తెచ్చే క్రమంలో గూడెం లో ఆయా స్థలాలపేర్లతో నిలబెట్టినది ఈ పటం. వాటిని మన దగ్గర ఉన్న 4G సెల్ ఫోన్ ద్వారా అక్షాంశ రేఖాంశాలకు జోడించాలి. అప్పుడే రాజధానులలో ఉండే అధికార మేధావి


ఆధీనంలోని అటవీ భూములపై హక్కు
షెడ్యూల్డు తెగలు మరియు ఇతర పరంపరాగత అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం, 2006
నిబంధన 8 (హెచ్)
తెలంగాణ ప్రభుత్వం, ఖమ్మం జిల్లా

వర్గాలను కదిలించగలం. ఇందుకోసం పదేళ్లుగా జరుగుతున్న కృషిని. 'బతుకు తెరువులు పట్టించుకోకుండా భాషను బతికించుచుకోలేం' అని 'అమ్మనుడి' ప్రచురిస్తుంది. ఇటీవల కార్యాచరణ ప్రణాళికలో చేర్చింది. వచ్చే నవంబర్ నెలలో ఆ ప్రణాళిక మీముందుకు తెస్తుంది. మీ ఊరి పటం గీయండి. గీయించండి జీవ వైవిధ్య పట్టికలు తయారు చేయండి. చేయించండి. ఈ కార్యక్రమంలో కంప్యూటరీకరణలో నిష్ణాతుడైన భాషాశాస్త్రజ్ఞుడు, సహాయకులు; పటాల తయారీ, ఆయాతావులను జీ పి యస్ ద్వారా అంతర్జాలం లోకి పంపించగల నిపుణులు , ఈ కార్యక్రమాన్ని convention for biological diversity, Sustainable development Goals వంటి అంతర్జాతీయ ప్రణాళికలు, వేదికల దృష్టికి తేగల వ్యూహకర్తలు ఉండాలి. నార్ల వెంకటేశ్వర రావు ఆశించినట్లు **'న్యాయం కోసం పాకులాడే బడుగు జనాన్ని – న్యాయం కోసం పోరాడే'** దారి పట్టించాలి.

జనంలో ఆలోచనపెంచి, సాంకేతిక నైపుణ్యం ఉపయోగించుకోటం ద్వారా, బడుగు జీవులు బాగుపడటం కోసం, తద్వారా, పర్యావరణ హితంకోసం పాటుపడే ఈ కార్యక్రమంలో పాల్గొనండి. చేయూత నివ్వండి. జన్మభూమి ఋణం తీర్చుకోండి.

**ప్రజల్లోకి రప్పిస్తాం-పట్టాభిషిక్తులను.**

అ

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!

సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి, మాచవరం,
విజయవాడ-520 004.

ఇ-మెయిల్ :
*editorammanudi@gmail.com*

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (19)

**తె**లుగువారి వెలుగు సాహిత్య సంపద సి.పి. బ్రౌన్. ఆయన తెలుగు భాష సాహిత్యాలను అహరహమికతో కృషి చేసి వెలికి తీసి వెలుగులోకి తెచ్చాడు. ఆయన పుట్టింది కలకత్తాలో (10-11-1798). భారతదేశంలో పుట్టాడు కాబట్టి భారతీయుడు అనే అనాలి. పుట్టిన 19 ఏళ్ళకు 1817 నాటికి ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలో చేరేవరకు తెలుగుభాష ఒకటి ఉందనే విషయం తెలియదు. వేమన పద్యంలోని వాడి, వేడి భాషలో భావంలో చదివిన వెంటనే సూటిగా హత్తుకునే విధంగా ఉన్న పద ప్రయోగ పద్య విధానమే బ్రౌన్‌ని ఆకర్షించింది. అదే తెలుగు భాష పునర్జీవానికి, తెలుగు వాఙ్మయోద్ధరణకు, తెలుగు వెలుగులోకి రావడానికి ప్రేరణ అయింది. ఆ ప్రేరణే తెలుగువారి మధ్య నాలుగు దశాబ్దాల పాటు (1817-1855) ఉద్యోగం చేస్తూనే సాహిత్య సేకరణ, ముద్రణ గావించాడు. ఉద్యోగానంతరం స్వదేశం వెళ్ళినా, తుది శ్వాస వరకూ (1884) తెలుగు భాషా సాహిత్యాలకు సేవచేస్తూనే ఉన్నాడు. తనజీవితం అంతా తెలుగు భాషా సాహిత్య పునర్ధురణకు అంకితమయిన ధన్యజీవి సి.పి.బ్రౌన్.

తెలుగువారి అదృష్టం కొద్ది బ్రౌన్ కడపలో 1820 నాటికి ఉద్యోగం చేయడం వల్ల ఆయన బంగ్లానే ఒక పరిశోధన కార్యశాలగా మారింది. తెలుగు పండితులకు బ్రౌన్‌దొర యిల్లు కల్పవృక్ష మయింది. పండితుల పాండిత్యమంతా అడవిగాచిన వెన్నెల అవుతుంటే, అన్నానికి లేక భిక్షమెత్తే పరిస్థితి ఏర్పడితే వాళ్ళని చేరదీసి మంచి జీతమిచ్చి పోషించిన మహానుభావుడు బ్రౌన్ దొర. ఆయన యిల్లే ఒక పాఠశాల అయింది. ఆయన నివాసం పండితులకు, సాహిత్య సహవాస ప్రాంగణం అయింది. అందుకే అది బ్రౌన్ కాలేజిగా పేరు పొంది తెలుగును వెలుగులోనికి తెచ్చిన వెలుగు వేదికగా మారింది. బ్రౌన్ కళాశాలలో శుద్ధ ప్రతులు తయారు చేయడం పండితుల నిత్యకర్తవ్యం. దేశమంతా వ్యాప్తి చెందిన తెలుగువారి స్వంతసేకరణలో ఉన్నతెలుగు పుస్తకాలు (తాళ ప్రతులు), కావ్యాలు, అన్నిరకాల గ్రంథాలు డబ్బు యిచ్చికొన్నాడు. వీటన్నిటిని ఎత్తిరాయడం, తప్పులు దిద్దడం చేసేవారు. కావ్యాలకు వ్యాఖ్యానాలు రాయడం, మూలంతో సరిచేసి తిరిగిరాయడం లాంటివి బ్రౌన్ కళాశాలలో నిర్విరామంగా సాగేవి.

నేను 1983-84 ప్రాంతంలో కడప జిల్లా ప్రభుత్వం వారి ఆహ్వానం మేర వెళ్ళే అవకాశం కలిగింది. అప్పటికి అంటే 84 చివరిలో ఆచార్య దొణప్పగారు తెలుగు విశ్వ విద్యాలయానికి స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అదే సమయంలో సి.పి. బ్రౌన్ ట్రస్టు పునరుద్ధరణ జానమద్ది హనుమత్ శాస్త్రిగారి నేతృత్వంలో జరుగుతుంది. నాకున్న ఆసక్తి కొద్దీ బ్రౌన్ కళాశాలను చూశాను. బ్రౌన్ కూర్చున్న ఆఫీసుకి యిరువైపులా రెండు పెద్ద గదులు. అందులో వేర్వేరు పండితుల కావ్య పరిష్కారాలు చేసేవారు. ఎదురుగా పెద్ద హాలు. అందులో ప్రూఫ్ రీడర్లు, పుస్తకాలు తిరగిరాసేవాళ్ళు ఇతరులు ఉండేవాళ్ళు. వారికి ముందు ఒక వరండా ఉంది. అక్కడ వేచి ఉండేవారికి ముందు ఒక వరండా ఉండేది. అప్పుడే తవ్వకాలు ప్రారంభమయ్యాయి. పాత పునాది కదిలిస్తుంటే పెద్ద ఇటుక రాళ్ళు బయటపడ్డాయి. ఒక్కోయిటుక 2 1/2 అడుగుల పొడవు, అడుగున్నర వెడల్పు, ఆరు అంగుళాల ఎత్తుఉన్న కాల్చిన యిటుకలు చూశాను. బహుశా వాటిల్లో కొన్నయినా భద్రపరిచారో లేదో తెలియదు. శాస్త్రిగారితో కలసి ముచ్చటిస్తూ ఉంటే ప్రభుత్వం పక్షాన ఆచార్య దొణప్ప గారి ద్వారా బ్రౌన్ పరిశోధనా కేంద్రం పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించవలసినదిగా కోరారు. వారి అభ్యర్థన అర్జీని ఆచార్య దొణప్పగారికి నేను సమర్పించడం, ఆపై ముఖ్యమంత్రివర్యులు శ్రీయన్‌టిరామారావుగారి దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగింది. అనంతరం దొణప్పగారు తెలుగు విశ్వ విద్యాలయానికి తొలి కులపతిగా 1985 డిసెంబర్ 2వ తేదిన నియమితులు కావడం జరిగింది.అప్పుడే తెలుగు విశ్వ విద్యాలయం శాఖలు శ్రీశైలం, రాజమండ్రి, వరంగల్, కూచిపూడిలో ప్రారంభించారు. 1998 నాటికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా పున:నామకరణచేయడమూ జరిగింది. ఇదంతా ఒక భాగం.

బ్రౌన్ తెలుగు భాషోద్ధరణతోపాటు క్రైస్తవ గ్రంథాలు, బైబిలును కూడా అనువదించాడు. క్రైస్తవంలో ఉన్న బాప్టిజం, ఆమెన్, హల్లెలూయ, సబ్బాతు మొదలయిన పదాలకు ధార్మికార్థం చెడకుండా యథాతథంగా ఉంచాడు. అలాగే Wineకి ద్రాక్షరసం అని అనువదించాడు. మరి కొన్ని పదాల్లో సిలువ, పరిశుద్ధాత్మ, స్తుతి, స్తోత్రం, సన్నిధి, సువార్త, కృప, సన్నుతి, అన్యజనాంగము, కలుగునుగాక, ప్రభువు నామమునకు మహిమలాంటి ప్రయోగాలు నేటికి స్థిరపడి ప్రామాణికంగా నిలిచాయి. ఇదంతా సి.పి.బ్రౌన్ మహాశయుడి కృషి అనే చెప్పాలి. అలాగే తెలుగు బైబిలు అనువాదంలో ఎన్నో మార్పులు చేర్పులు జరిగాయి. ఈవివరాలు సంక్షిప్తంగా ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు పీఠిక 5లో వివరించాడు. ఉద్యోగ విరమణకు ముందే బ్రౌన్ తెలుగు బైబిలులో కొంతభాగం ముద్రించాడు. 1857లో అచ్చయిన పూర్తి బైబిలు మీద మాత్రం Translated by the Rev. Messers GORDON and PRITCHETT అని ముద్రించుకున్నారు. నిజానికి ఈ బైబిలు అనువాదం అంతా బ్రౌన్ చేసిందే. అనంతరం 1858లో అచ్చువేసిన బైబిలు కూడా వార్ట్‌లా, హే అనే వారి నేతృత్వంలోనే వచ్చింది. ఇదీ బ్రౌన్ అనువాదమే. కాని బ్రౌన్ పేరు ఎక్కడా ప్రస్తావించకుండా వాళ్ళ పేర్లతోనే అచ్చు వేసుకున్నారు. ఈ వివరాలుSome account of the Literacy Life of C.P. Brown లో స్పష్టంగా రాశాడు. పుస్తకం చేయిదాటేసరికి సంకుచిత త్వధోరణి ఎలా ప్రబలుతుందో అనేదానికి, అచ్చులో పుస్తకం వచ్చేసరికి ఎన్ని మార్పులు జరుగుతాయో అనేదానికి ఇదొక ఉదాహరణ. ఐతే బ్రౌన్ మాత్రం బైబిలు అనువాదం సమాజానికి ఉపయోగం కాబట్టి



బ్రౌన్ ఫోటో అని భావిస్తున్నది ఒకటి అంతర్జాలంలో లభించింది. మెడలో పూలహారంతో ఉన్నవారు సి.పి.బ్రౌన్.

ఎవరి పేరయినా పరవాలేదని తన జీవిత చరిత్రలో రాసుకున్నాడు. ఆయన ఎంత సహనశీలి అనే దానికి ఇది ఒక ఉదాహరణ.

బ్రౌన్‌కి పూర్వం ఉన్న పాశ్చాత్య అధికారులు, మిషనరీలు భారతదేశంలో ఉన్న అమూల్యమైన సాహిత్య సంపదను లండన్‌లోని ఇండియా హౌస్ లైబ్రరీకి పంపారు. కాని బ్రౌన్ 1834లో మొదటి సారి సెలవుమీద ఇంగ్లండ్ వెళ్ళినప్పుడు ఆ లైబ్రరీ చూశాడు. అక్కడ కట్టలు కట్టలుగా గుట్టలు గుట్టలుగా ఉన్నవాటిని చూశాడు. వాటిల్లో చాలాభాగం తెలుగు, కన్నడం తమిళ గ్రంథాలన్ని భారతదేశానికి పంపితే ఉపయోగమని, వాటిని పునరుద్ధరణ చేసి అచ్చువేయవలసిన అవసరం ఉందని ఈస్టిండియా కంపెనీ వారితో చెప్పాడు. ఆ తర్వాత ఆ గ్రంథాలన్ని 1844 నాటికి మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయానికి చేర్చే మంచి పని చేశాడు. ఇంగ్లండ్‌నుంచి మద్రాసు వచ్చిన గ్రంథాలు మొత్తం 2,106. వాటిల్లో తెలుగు 272, కన్నడం 446, దేవనాగరి 165, మలయాళం 41, ఒరియా 07, హిందుస్తాని 373 మొత్తం 1304 వీటితో పాటు ఒరియా, బర్మా, వంగ, మొదలయిన భాషల్లో ఉన్న పుస్తకాలు మరికొన్ని ఉన్నాయి. అన్ని కలిపి వేలల్లోనే ఉన్నట్టు A Catalogue Raisonne of oriental Manuscripts, Madras, 1857 Page XVIIIలో చూడవచ్చు. వీటితో పాటు మెకంజీ సేకరించిన ప్రతులు, గ్రామ చరిత్రలు శిథిలమయిపోతూ ఉంటే వాటిని ఇంగ్లీషు కాగితాలపై దేశవాళీ మసి సిరాతో తిరిగి రాయించాడు. అవే స్థానిక చరిత్రల పేర 48 సంపుటాలుగా నేడు మనకు లభిస్తున్నాయి. వాటి పుత్రికలు కొన్ని తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదువారి గ్రంథాలయంలో ఉన్నాయి. స్టేట్ ఆర్కియలాజికల్ సొసైటీ వారు ప్రచురించినకొన్ని జిల్లాల చరిత్రలు నేడు అచ్చయినాయి. ఇన్ని చేసిన బ్రౌన్ తన స్వంత డబ్బే ఖర్చుపెట్టి మనకోసం శ్రమించి సాహిత్యాన్ని, చరిత్రను భద్రపరచాడు. బ్రౌన్ సేకరించిన లిఖిత ప్రతులను ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాల గ్రంథాలయానికి యిచ్చాడు. ఈ గ్రంథాలు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో భద్రపరచారు. తాళపత్ర గ్రంథాలు శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రాచ్య పరిశోధనా సంస్థలో ఉన్నాయి. బ్రౌన్ లేఖలు, తదితర జిరాక్స్ ప్రతులు బంగోరె సేకరణలో ఉన్నవి అన్ని శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఉన్నాయి. 1845 జనవరి 27 నాటికి తన వద్ద ఉన్న సేకరణ అంతటినీ లిటరరీ సొసైటీ గ్రంథాలయానికి యిచ్చాడు. బ్రౌన్ సేకరణలో మొత్తం ప్రతులు

| | |
|---|---|
| లండన్ నుంచి పంపినవి | 2106 |
| బ్రౌన్ సేకరించినవి | 2440 |
| మెకంజీ సేకరించినవి | 913 |
| కళాశాల, లిటరరీ సొసైటీ సేకరణ | 292 |

మొత్తం 5751. ఈ పుస్తకాలన్నీ కేటలాగ్ తయారు చేయడానికి రెవరెండ్ టైలర్‌ని నియమించారు. 1857, 1860, 1862 సంవత్సరాల్లో మూడు సంపుటాల్లో ఫోర్ట్ సెయింట్ జార్జ్ గజిట్ ప్రెస్‌లో అచ్చువేశారు. బ్రౌన్ స్వంత గ్రంథాలయంలో నాలుగువేలకు పైగా గ్రంథాలున్నట్లు డాక్టర్ జోళిపాళెం మంగమ్మగారు వివరించారు.

బ్రౌన్ సాహిత్యపరంగా చేసినకృషి అజరామమైనదనడంలో

సందేహం లేదు. దీనికి తోడు భాషా సంస్కరణలో కూడా బ్రౌన్ తనదైన ముద్ర వేశాడు. బ్రౌన్ కృషి వల్ల ఆనాడు తెలుగులో ముద్రణ వికాసం చెంది ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. తెలుగు భాషలో హల్లులు రాసేటప్పుడు చ – చ, జ – జ లు రాసేవారు. చంద్రుడు –చందమామ, జడ–జల్లెడ. ఈ అక్షరాలపైన 1,2 అని వేసేవారు. ఈ స్వల్ప భేదం అనవసరం అని తొలగించాడు. అలాగే ర–ఱ భేదాలు క్ర–కృ భేదాలు సరిచేశాడు. అర్థానుస్వారము పూర్ణానుస్వార విషయంలోని క్లిష్టతను తొలగించాడు. 1836లో ముద్రితమైన రావిపాటి గురుమూర్తి శాస్త్రి తెలుగు వ్యాకరణంలోని ప్రయోగాలను సరిచేసిన దానికి పండితులు కొంతమంది విమర్శించారు. తర్వాత వాటి ఉపయోగాలను విస్మరించి వాళ్ళే సరయిన మార్గం ఎంచుకున్నారు. భాషా సంస్కరణలో ముఖ్యంగా గమనించవలసినది విరామ చిహ్నాలు. **బ్రౌన్ అనంతరమే మనకు తెలుగులో విరామ చిహ్నాలు, పుట సంఖ్యలు, అధ్యాయాలు, ఆశ్వాసాలు, భాగాలు మొదలయిన విభజన కనిపిస్తుంది.** తెలుగు వ్యాకరణ రచన 1840లో తొలిసారి అచ్చయింది. బ్రౌన్‌కి పూర్వమే ఎడి కాంబెల్ రచించిన A Grammar of the Telugu language, విలియం బ్రౌన్ రాసిన A Grammar of the Gentoo language,, బాగా ప్రసిద్ధి చెందాయి. దానికో కారణం ఉంది. ఈరెండు వ్యాకరణాలు పండితుల ప్రశంసకు పాత్రమైనవే తప్ప ప్రయోజనం అంతగాలేదు. 1814లో కేరీ ముద్రించినGrammar of the Telinga Language తెలుగు సంస్కృత జన్యమని ఢంకాభజాయించాడు. అది పండితుల మన్నన కాని, ప్రజల ఆదరణకాని పొందలేదు (ఈ ప్రతి National Library కలకత్తాలో ఉంది).

ఇన్ని ప్రతికూల ప్రతుల మధ్య బ్రౌన్ వ్యాకరణం 12 భాగాలుగా విభక్తమయింది. మొదటి పదిభాగాలు వ్యాకరణాంశాలు పద కొండవభాగం ఛందస్సు. 12వ భాగం కళ, ద్రుత ప్రకృతి కావ్యాలకు సంబంధించిన ఉదాహరణలతో వివరించాడు. **బ్రౌన్ సంస్కృతాంధ్రభాషల సంబంధమే చెప్పాడు తప్ప జన్యజనక సంబంధమనలేదు. ఇంగ్లీషు వ్యాకరణాలు తొలినాళ్ళలో లాటిన్‌లోనే రాశారు. అలాగే తెలుగు వ్యాకరణము సంస్కృత విధానంలోనే వచ్చాయన్నాడు.** (A Grammar of the Telugu Language by CP Brown 1857 Page VI ). దీనికి తోడు బ్రౌన్ వ్యావహారిక భాషకే పట్టం కట్టాడు. కొన్ని సందర్భాల్లో 1746లో వెలువడిన Benzamin Schultze రచనలు, 1728 షూల్జి వ్యాకరణం Grammatica Telugica లలోని ఉదాహరణలు వ్యావహారిక భాషలోనే ఉన్నాయని అది ప్రజల భాష అనీ అన్నాడు. తెలుగులో ఉన్న యతిప్రాసల ప్రస్తావన చేస్తూ గోతిక్ (Gothic) భాషలోనూ శబ్ద సౌందర్యం కోసం అక్కడక్కడా ఇలా ప్రయోగించడం సహజమన్నాడు. స్పానిష్ భాషలో కూడా ఈ పద్ధతి ఉందని పేర్కొన్నాడు. (పుటలు 314–315) అన్ని విధాలుగా తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని తీర్చి దిద్దిన బ్రౌన్ మహాశయుడు ఆంధ్ర బంధు, వాఙ్మయోద్ధారకుడు, ధన్యజీవి, కారణ జన్ముడు మొదలయిన బిరుదు వాచకాలు అనేవి ఇంకా తక్కువేమో.

**(నవంబర్ 10 సి.పి. బ్రౌన్ జన్మదినోత్సవం. ఆయన పుట్టి 225 సంవత్సరాలు)**

–తరువాయి వచ్చే సంచికలో

**38వ పుట తరువాయి...**

## సాహిత్య శిల్పి బాపిరాజు....

శోభనిస్తున్నాయని బాపిరాజు గారి అభిమానులు పేర్కొంటారు.

బాపిరాజు గారి తిక్కన్న చిత్రం ఆంధ్ర విశ్వ కళాపరిషత్ బహుమతి పొందింది. వీరు సింహళం వెళ్ళి, అక్కడి సిగీరియా కుడ్య చిత్రాల్ని చిత్రించారు. అవి మద్రాసులోని ప్రభుత్వ మ్యూజియంలో ఉన్నాయి. కేవలం చిత్రాలు గీయడమే కాకుండా, సామాన్యులలో సైతం చిత్రకళపై అభిరుచి కలిగేలా అనేక పట్టణాలలో చిత్రకళపై ఉపన్యాసాలు ఇచ్చి, చిత్ర కళాభివృద్ధికి కృషిచేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక పత్రిక స్థాపించాలని ఆశించినా, ఆ ఆశయం ఫలప్రదం కాకుండానే శ్రీ బాపిరాజు కన్నుమూశారు.

వీరి కథలు రాగమాలిక, అంజలి, తూలికానృత్యం, తరంగిణి, భోగీయలోయ తదితర కథలు భారతి, మీజాన్ పత్రికలలో ప్రచురితమయ్యాయి. కథల్లో ప్రకృతిలోని యావత్తు సౌందర్యాన్ని దర్శింపజేస్తారాయన. వీరు గేయరచయితగా 'శశికళ'ను తన ఆరాధ్యదేవతగా అనుక్షణం అన్వేషిస్తూ ఎన్నో ప్రేమ, భక్తి పూర్వక భావగీతాలను రాశారు. శశికళ గేయాలు ఆకాశవాణిలో తరచూ ప్రసారమౌతాయి. 'పాడకే నా రాణి పాడెదను నీకునై పాటలను దేవి' ఈ గేయం – ఘంటశాల వారి గళంలో సాహితీప్రియుల, ఆకాశ వాణి శ్రోతల అభిమానాన్ని చూరగొన్నది.

శ్రీ బాపిరాజు 1949–50 ప్రాంతాల్లో ఆకాశవాణి విజయవాడ కేంద్ర సలహాదారుడిగా పనిచేశారు. ఆ కాలంలో తన నవల 'నారాయణరావు' రేడియో నాటకీకరణచేసి, అందులో జమీందారు పాత్రను తానే స్వయంగా పోషించి, నటుడిగా, రేడియో శ్రోతల అభిమానాన్ని కూడా పొందారు. అలాగే శైలబాల, భోగీయలోయ, ఏరువాక, తదితర రేడియో నాటకాలను శ్రీ బాపిరాజు రూపొం దించారు. **1920 తర్వాత అడవి బాపిరాజులాంటి అనన్య ప్రతిభాపాటవాలు గల మహోన్నత వ్యక్తి ఆంధ్ర సాహిత్య సాంస్కృతిక చరిత్రలో లేదని సాహిత్య పరిశోధకులు భావిస్తారు.**

అడవి బాపిరాజు గారి ఇంటిపేరు అడవి గానీ, ఆయన మాత్రం సాహిత్య నందనవనం అని ఆయన సమకాలీనుడు 'కరుణశ్రీ' ఒక సందర్భంలో బాపిరాజుగారి గురించి వ్యాఖ్యానించారు. అలాగే, శ్రీ బాపిరాజు గీసిన గీత బొమ్మవుతుంది. అతడు పల్కిన పలుకు పాటవుతుందని ప్రముఖ కవిపండితులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అన్నారు. కల్లాకపటం, మాయామర్మం ఎరుగని వాడుగా, మిత్రులందరికీ తలలో నాల్కలా, పిల్లల్లో పిల్లవాడిగా, పెద్దల్లో పెద్దగా, ఆత్మీయుడిగా అందరిచేత 'బాపిబావ'గా పిలిపించుకుంటూ అందరివాడుగా జీవితం గడిపిన శ్రీ బాపిరాజు తన కళాప్రపంచాన్ని వదలి 1952 సెప్టెంబరు 22న గుండెపోటుకు గురై కీర్తిశేషులైనారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించిన శ్రీ బాపిరాజు రాసిన గ్రంథాలు,గీసిన చిత్రాలు మాత్రం కళాభిమానులకు, కళాకారులకు ఎంతో ఆదర్శం.ఇంతటి కీర్తి గడించిన వీరు తెలుగు వారికి సదా చిరస్మరణీయులు.

వ్యాసరచన– తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రామచంద్రపురం, కోనసీమ జిల్లా.

ఈ సంచిక మూడవ అట్ట(51వ పుట) కూడా చూడండి

సి.వి.క్రిష్ణయ్య 93965 14554



# ఎవరు తెలివి గలవారు?! 12

## కొత్తరకపు బడులు

**జరిగిన కథ:** కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకొన్నారు జంతు పక్షిజనాలు. ఆడవిలో పిల్లలకు అనేక మానసిక శారీరక అనారోగ్య సమస్యలు వచ్చాయి. బడిలో పరీక్షలూ, మార్కులు నిషేధించారు. శిక్షలు బహుమతులు కూడా నిషేధించారు. పిల్లలు ఎలా నేర్చుకుంటారో, ఎలా నేర్చుకోరో తెలుసుకున్నారు. మనిషి దుర్బలుడు కావడానికి కారణాలు తెలుసుకున్నారు. అధ్భుతమైన మానవుడి మెదడు గురించి కూడా తెలుసుకున్నారు.

"ఇప్పుడు కొత్తరకపు బడుల గురించి, వాటిల్లో చదువులు ఎలా ఉండాలో తెలుసుకొందాం. ఈ విషయాలన్నీ వివరించడానికి మన అశ్వరాజాన్ని ఆహ్వానిస్తున్నాను." అంటూ వృద్ధ గోమాత సభను చుక్కలగుర్రానికి అప్పగించి వేదిక దిగిపోయింది.

చుక్కల గుర్రం నింపాదిగా సభను నలువైపులా పరీక్షించి చూసింది. "ప్రకృతిమాత ఒడిలో పెరుగుతున్న నా ప్రియమైన జనులారా! ఇంతకాలం మాట్లాడుకొన్నమాటలను చేతల్లోచేసి చూపించాల్సిన సమయం వచ్చింది. మనం విజ్ఞాన వినోదాలతో కూడిన కొత్తరకపు బడులు ఏర్పాటుచేసుకోవాలి. అవి ఆనందనిలయాలుగా ఉండాలి. అక్కడ ఆలోచనలతోకూడిన ఉత్తములు తయారు కావాలి. ఈ బడి ఎలా ఉండాలో ఏమేమి బోధించాలో ఎలా బోధించాలో అందరం తెలుసుకోవాలి. దీనికి ముందు మానవుడి మెదడులో జరిగిన విజ్ఞాన విస్ఫోటనం గురించి తెలుసుకోవడం అవసరం.

మొదట విశ్వవిస్ఫోటనం జరిగి నక్షత్రాలు గ్రహాలు ఏర్పడి విశ్వం ఎలా వ్యాపించిందో, అలాగే మానవుడి మెదడులో జరిగిన విజ్ఞాన విస్ఫోటనం విశ్వమంతా వ్యాపిస్తున్నది. భూమండలం అంతా వ్యాపించి ఇప్పుడు గ్రహాలలో ప్రవేశించింది. అక్కడ నుండి కోటానుకోట్ల నక్షత్రాలలోకి తొంగిచూస్తున్నది. తనలాంటి ప్రాణుల కోసం వెదుకుతూ ఉంది. ఇదంతా ఎలా సాధ్యమైంది. దేని సాయంతో మానవుడు ఇదంతా చేయగలుగుతున్నాడు.

భాష... అవును. భాషే దీనికి కారణం. మానవులు తమ ఆలోచనలను మాటలరూపంలోకి, వాటిని అక్షరాల రూపంలోకి మార్చి– ఆ అక్షరాలను సాంకేతిక భాషగా మార్చి, ఆ సాంకేతిక భాషను విద్యుత్ మెరుపులుగా మార్చి సూక్ష్మ యంత్రాలలో అమర్చడం వల్ల ఇది సాధ్యమైంది. ఆ మాటల్లో ఆ యంత్రాలను ఏమిచేయాలని రాశాడో ఆ పనినే ఆ యంత్రాలు చేస్తున్నాయి. ఆ యంత్రాలను తమ మాటలతోనే పనిచేయిస్తున్నాడు. ఇదంతా విజ్ఞానులు శాస్త్రవేత్తలు చేస్తున్నారు. వీరు ఈ పని ఎలాచేస్తున్నారో తెలియని అజ్ఞానులు ప్రజలను పాలిస్తూ అవివేకపు నిర్ణయాలు చేసి మానవ

సమాజాన్ని వెనక్కి నడిపిస్తున్నారు.

మనం మాట్లాడే మాతృభాషలను పక్కనబెట్టి నేరుగా సాంకేతిక భాషలనే నేర్పిస్తే సరిపోతుందని మాతృభాషలకోసం ఉపయోగించే సమయం వృథాకాకుండా చేయవచ్చని అతితెలివిని ప్రదర్శిస్తున్నారు. కూర్చున్న కొమ్మనే నరుక్కొంటున్నారు. దేని ఆధారంగా పరభాషలను సాంకేతిక భాషలను నేర్చుకొంటున్నారో ముందుగా ఆ భాష నేర్వకపోతే ఆలోచనలు ఆగిపోతాయనే ఇంగిత జ్ఞానం లేకుండాపోయింది పాలకులకు.

రాజకీయ నాయకులు అధికారం సంపాదించడం దాన్ని నిలుపుకోవడం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. మంచి పాలకులుగా మారడంలేదు. దీనికి కారణంకూడా ఈ బడులే. ఇది గతకాలంకాదు. విజ్ఞాన వికాసయుగం. ఈ యుగంలో విజ్ఞానులు, శాస్త్రవేత్తలు చెప్పినట్లు పరిపాలించాలి. పరిపాలన శాస్త్రీయంగా జరగాలి. లేకపోతే విజ్ఞానఫలితాలు వికటిస్తాయి.

మనం పరిశోధకులు శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు పాటిద్దాం. భాష మహా శక్తిమంతమైనది. సకల ఆలోచనలు, సకల శాస్త్రాలు భాషనుండే పుడుతున్నాయి. భాషతోనే మనుషుల్ని మహనీయులుగా మార్చవచ్చు. కాబట్టి మనబడుల్లో భాషకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం.

1. పిల్లలు పసితనం నుండి కథలు గాథలు వింటూ చదువుతూ పెరగాలి. చదవడం రాయడం ఈ కథా సాహిత్యాల ద్వారానే నేర్చుకొంటారు.

2. కథా సాహిత్యంతోపాటు పాటలు సంగీతం చిత్రలేఖనం వంటి లలిత కళలతో పాటు వివిధ రకాల వాయిద్యాలను పరిచయం చేయాలి.

3. సృష్టితో పోటీ పడి ప్రతిసృష్టిచేస్తున్న చేతులకు చేతివేళ్ళకు నిరంతరం పనికల్పించాలి– ఆలోచనలకు చేసే పనులకు అనుసంధానంతో మెదడులో ఆలోచనలు మరింతగా వికసిస్తాయి.

4. ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చే ఆటల్ని ప్రతిరోజు ఆడించాలి.పిల్లలు తమకు ఇష్టమొచ్చినట్లు ఆడుకొనే స్వేచ్ఛనివ్వాలి.

5. అన్నిటికంటే ప్రధానమైనది స్వేచ్ఛ. ప్రపంచంలో జరిగిన యుద్ధాలన్నీ దురాక్రమణకోసం లేదా స్వేచ్ఛకోసం జరిగినవే. కాబట్టి పిల్లలపైన ఎలాంటి వత్తిడి ఉండకూడదు. భయంలేని స్వేచ్ఛాపూరిత వాతావరణం బడిలో ఉండాలి.

6. సకల జీవులు చెట్లమీద ఆధారపడి జీవిస్తున్నాయి. బడిలో మొక్కల పెంపకం నేర్పాలి. పండ్లు, కాయగూరలు, పంటల గురించి మంచి ఆహారం గురించి అవగాహన కల్గించాలి.

7. ఉపాధ్యాయులను ఎన్నుకొనే విషయంలో కడు జాగ్రత్త వహించాలి. అది వృత్తిగా పరిగణించకూడదు. ఉత్తమ వ్యక్తుల్ని, విజ్ఞానంలో పండితుల్ని, పిల్లల్ని ప్రేమించేవాళ్లను ఉపాధ్యాయులుగా నియమించాలి. అలాంటి వారు దొరక్కపోతే తయారు చేసుకోవాలి.

మహాజనులారా! బడిలో ఏమి నేర్పాలో ఎలానేర్పాలో కొన్ని విషయాలు నేను వివరించాను. బడిని ఎలా నిర్వహించాలో ఏమిచేయాలో మరికొన్ని విషయాలు మన శుక శ్రేష్ఠులు చిలుకగారు వివరిస్తారు. అంటూ గుర్రం రంగుల చిలకను ఆహ్వానించింది.

రంగుల చిలుక వేదిక మీదకి వచ్చి అందరికీ నమస్కరించింది. “నా ప్రియమైన జనులారా, బడి అనేది జైలు కాదు. అది సరుకులు అమ్మే అంగడి కాదు. మనుషులు ప్రకృతిలో ఉన్న విశాలమైన మైదానాలు వదలి సందుగొందుల్లో ఇరుకు గదుల్లో బడులు పెట్టుకొని పిల్లల్ని బందీలు చేస్తున్నారు.

1. మన కొత్త బడులు విశాలంగా ప్రకృతికి దగ్గరగా చుట్టూ చెట్లతో రకరకాల ఆటల స్థలాలతో మొక్కలు పెంచడానికి వీలుగా ఉంటుంది. పెద్ద గ్రంథాలయం, ప్రయోగశాలలు ఉంటాయి.

2. బడి నిర్వహణ, ఉపాధ్యాయుల ఎన్నిక, తల్లిదండ్రులు విద్యార్థులు అక్కడి ప్రజలు చూసుకొంటారు.

3. అందరూ అన్నీ నేర్చుకోవాలనే నిర్బంధం ఉండదు. చదవడం రాయడం మాత్రమే అందరూ తప్పనిసరిగా నేర్చుకోవాలి. మిగిలిన విషయాలు వారి వారి అభిరుచులను బట్టి ఇష్టాన్ని బట్టి నేర్చుకొంటారు. గంటకో ఉపాధ్యాయుడు, గంటకో విషయం నేర్చుకొనే పద్ధతి ఉండదు. ఏ విషయం ఎంతసేపైనా నేర్చుకోవచ్చు.

4. పిల్లలకు ఏమీ తెలియదని వాళ్లు ఆకతాయి పిల్లలని భావించకూడదు. నేర్చుకోవడం పూర్తిగా పిల్లల బాధ్యత. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లలపై ఒత్తిడిచేయకూడదు. ఈ వత్తిడి బలవంతమే పిల్లలు నేర్చుకోకుండా ప్రతిఘటించడం ప్రారంభిస్తారు. సంవత్సరాల తరబడి నేర్చుకొనే విషయాలు వారికి ఇష్టం వచ్చినప్పుడు రెండు మూడు వారాల్లోనే నేర్చుకొంటారని రుజువైంది.

5. పరీక్షలు. మార్కులు, బహుమతులు ఉండవు. ఇవి పిల్లల్ని సిగ్గుపడేటట్లు, భయపడేటట్లు, అసూయపడేటట్లు, అవమానపడేటట్లు చేస్తాయి.

6. మన బడులు రెండు రకాలుగా ఉంటాయి. 12 సంవత్సరాలలోపు పిల్లలకు అక్షర వినోద కళాకేంద్రాలు, ఆపై వయస్సుగలిగిన వారికి విజ్ఞాన కళావికాసకేంద్రాలు.

7. అక్షర వినోదకళా కేంద్రాల్లో రాయడం చదవడంతోపాటు ఆటపాటలు, మొక్కల పెంపకం, చేతితో వివిధ రకాల వస్తువులు తయారు చేయడం, పుస్తకాలు చదవడం, వివిధ రకాల వాయిద్య పరికరాలను ఉపయోగించడం వంటివి ఉంటాయి. 6 సంవత్సరాల వయస్సు నుండి మాత్రమే ఈ కేంద్రాలలో ప్రవేశం ఉంటుంది.

8. విజ్ఞాన కళా వికాసకేంద్రాలలో అంతా ప్రయోగపూర్వకంగా స్వయంగా నేర్చుకొనేటట్లు శిక్షణ ఇస్తారు. ఇష్టమైన విషయాలు ఎన్నుకొని ఇష్టమొచ్చినంత కాలం అందులో లీనమైపోయి నేర్చుకొంటారు. అన్ని రకాల చదువులు విద్యలు ఇక్కడ ఉంటాయి.

ఇక్కడ రాజకీయ నాయకులకు పరిపాలనాధికారులకు శిక్షణ ఉంటుంది. భవిష్యత్తులో ఇక్కడ చదువుకొన్న వారినే ప్రజలు నాయకులుగా ఎన్నుకొంటారు.

మనం ఈ సభలో కొత్తరకం బడులు ఎలా ఉండాలో ఏమి నేర్చుకొంటారో వివరంగా చెప్పుకున్నాము. ఈ విషయాలన్నీ మనుషులకు వివరించాలి. మనుషుల ప్రపంచంలోకి ప్రవేశించి మీరు వెంటనే పని ప్రారంభించాలి.

ఈ రకమైన బడుల్లో చదివిన పిల్లలు మంచి విద్యావంతులుగా విజ్ఞులుగా, వివేకవంతులుగా మంచి పరిపాలకులుగా నాయకులుగా తయారై ఈ ప్రకృతిని, భూమండలాన్ని కాపాడతారని ఆశిద్దాం.

ఈ సభ ముగింపుగా మానస సరోవర నివాసి, ప్రపంచమంతా తిరిగి చూసిన హంసరాజుగారిని, మాట్లాడవలసినదిగా ఆహ్వానిస్తున్నాను” అంటూ రాజహంసను సాదరంగా ఆహ్వానించింది చిలుక.

హిమాలయ పర్వతాలలోని తెల్లని మంచు శిఖరం ఎగిరి వచ్చిందా అన్నట్లు ఆ రాజహంస రెక్కలల్లార్చుకొంటూ వేదికమీదికి వచ్చింది. సభాప్రాంగణమంతా చల్లని గాలి వీచింది. తన గంభీరమైన కంఠధ్వనితో

సత్యవాక్కులతో సభలోని జనాన్ని సమ్మోహితుల్ని చేసింది.

సభాసదులారా! మీకు నా అభినందనలు. నేను ప్రపంచంలో జరుగుతున్న అన్ని విషయాలు నిరంతరం తెలుసుకొంటూ ఉంటాను. మానవ సమాజానికి మేలు జరగాలని ఆ మనుషుల ద్వారా భూగోళంమీద ఉన్న సకల ప్రాణులు చల్లగా ఉండాలని మీరు చేస్తున్న ఈ ప్రయత్నం సఫలం అవుతుంది.

కొత్త బడుల గురించి మీరు చేసిన నిర్ణయాలన్నీ విన్నాను. మీరు సరైన దారిలో ప్రయాణిస్తున్నందుకు ఆనందంగా ఉంది. బడిలో భాషకు కథాసాహిత్యానికి ప్రాధాన్యత ఇవ్వడం అంటే నరులను మంచి వైపు నడిపించడమే.

**నరులు జంతువుల్లా పక్షుల్లా మనలాగే పుడతారు. ఆ తర్వాత వాళ్లు మనుషుల్లా తయారు చేయబడతారు. కథలు, గాథలు, పురాణాలు, సంప్రదాయాలు, నియమాలు, కుటుంబం, సమాజం, దేవుడు, దెయ్యం వీటన్నిటి ప్రభావం వల్ల మనుషులు తయారవుతారు. బడిలో ఆలోచనలతో, తర్కజ్ఞానంతో సత్యాసత్యాలు తెలుసుకొంటాడు. ఆ బడిలో భాషకు ప్రాధాన్యత ఇవ్వకపోతే మానవత్వపు ఆలోచనలు ఆగిపోతాయి. శాస్త్రజ్ఞానం మంచికి కాకుండా చెడుకు ఉపయోగిస్తారు.**

సాహిత్య కళాప్రపంచపు సువాసనలు అద్దుకొంటేనే శాస్త్ర విజ్ఞాన వృక్షానికి మానవీయ కుసుమాలు పూస్తాయి. మనిషిని భయాలనుండి క్రూరత్వంనుండి, ఒంటరి తనంనుండి కథా సాహిత్యం కళలు దూరంగా నడిపిస్తాయి.

కథలో మానవుడు ఒక విశ్వధర్మాన్ని రాసుకొన్నాడు. మంచి గెలవాలని చెడు ఓడిపోవాలనేదే ఆ ధర్మం. కథా సాహిత్యం మనుషుల్ని మహనీయులుగా, త్యాగమూర్తులుగా,గొప్పవీరులుగా తయారు చేస్తుంది.

మనిషి బుద్ధిజీవిగదా! తానొక్కడే ఒంటరిగా సుఖంగా జీవించలేడని అతని ఇంగితజ్ఞానానికి తెలుసు. అందుకనే సకల మానవులతోపాటు, సకల జీవులు చల్లగా ఉండాలని కోరుకొంటాడు. ఇందుకోసం ప్రాణాలర్పించడానికి సిద్ధపడతాడు. తన జీవితమంతా పరుల సేవచేస్తాడు. దీనికనుగుణంగా కథా ప్రపంచాన్ని సృష్టించుకొన్నాడు. అందులో ఒక ధర్మాన్ని తనకుతాను పాటించేలా అది కథలో ఉండేలా చేసుకొన్నాడు.

మనిషి మొదట కథాప్రపంచాన్ని సృష్టించుకొన్నాడు. ఆ తర్వాత కథల్లో ఉండే కల్పనలు అద్భుతాలు నిజంచేసుకొనేలా శాస్త్ర విజ్ఞాన ప్రపంచం సృష్టించుకున్నాడు. దీని గమ్యం ఏమిటి? ఆకలి దప్పులు, అజ్ఞానం, అనారోగ్యాలు, పగ ద్వేషాలు, హింస లేని, 'సంతోష ప్రపంచం' సృష్టించుకోవాలి. సృష్టించుకొంటాడు.

మంచీ చెడులు వెలుగు నీడల్లా ఒకదాని వెంట ఒకటి వస్తూ ఉంటాయి. ఇప్పుడు ప్రపంచం కాలం అనే త్రాసులో చెడువైపు మొగ్గు కనబడుతున్నది. ఇది ఎంతోకాలం సాగదు. చెడుచేసే దాడి చాలా భయంకరంగా ఉంటుంది. ఇది చూసి భయపడవలసిన అవసరం లేదు.

మనిషి ఈ భూమి మీద కథానాయకుడి పాత్ర పోషించాలి. ఇందుకోసమే ప్రకృతి మాత అతనికి మాట ఇచ్చింది. ఆలోచనలు ఇచ్చింది. విచక్షణ నేర్పింది.

వెళ్లండి. మానవ సమాజంలో ప్రవేశించి మన ఆలోచనలు చెప్పండి. మనుషులకు తమకర్తవ్యాన్ని గుర్తుచేయండి. అందరికీ మేలు జరుగుగాక!" అంటూ రాజహంస తన మాటలు ముగించింది.

అందరి హృదయాల్లో ఆశాదీపం వెలిగింది.

*(సమాప్తం)*

**39 వ పుట తరువాయి...**

## రావిశాస్త్రి వ్యాసాలు....

రసమూ రచయితకు అనవసరం అని వేదనతో చెప్పిన నిజం ఇది. రావిశాస్త్రిగారు రచయితలకు శ్రీశ్రీగారి సలహాను పాటించమని సూచించడం జరిగింది. తెలుగులో బాగా రాయాలంటే ఏం చదవాలి అని శ్రీశ్రీ గారిని అడిగితే. అందుకు శ్రీశ్రీగారు ఇంగ్లీష్‌బాగా చదవండి అన్నారు. ఎందుకన్నారా అని ఆలోచిస్తే, ఆంగ్లభాష తెలుగుకంటే చాలా ఎక్కువగా అభివృద్ధి చెందిన భాష. అందుకని ఆ భాష నేర్చుకుంటే చాలా ఎక్కువ విషయాలు తెలుస్తాయి. రచయితకి అన్ని విషయాలపై అవగాహన ఉండాలని శ్రీశ్రీగారి అభిప్రాయం కావచ్చు అని రావిశాస్త్రి గారి ఊహ.

జీవితం గురించి రచయితకి ఎంతఎక్కువ తెలిస్తే, అతని రచనలకి అది అంత ఎక్కువ ఉపయోగపడుతుంది. రామాయణం, మహాభారతం చదివితే మానవ స్వభావం గురించి, పాత్రల నిత్యజీవనం గురించి తెలుస్తుంది.

రావిశాస్త్రిగారు వారి వ్యాసాలలో, తన ఆవేశాన్ని, ఉద్వేగాన్ని, ఎపుడూ దాచుకోలేదు. చెప్పాలనుకున్న సాహితీ విషయాలను నిక్కచ్చిగా చెప్పడం కనిపిస్తుంది. ప్రత్యేకమూ విశిష్టమూ, స్వతంత్రమూ అయిన శైలి వీరిది. కద్రువ సంతానం వ్యాసంలో హాస్పిటల్‌లోని స్త్రీని దేశ ప్రధాని ఇందిరాగాంధీని పోల్చారు. చదువురాని, నిరక్షరాస్యురాలైన స్త్రీని, దేశప్రధానిని పోల్చుతూ చదువుకున్న వాళ్ళకి పుస్తకాలుంటాయి, చదువలేని వాళ్ళు చదవాలంటే వారికి జీవితం తప్ప మరేదీ ఉండదు. దానిని వాళ్ళు చదువుకోకపోతే వారికి దినం వెళ్ళదు. బతుకు, బరువు మోసే మనుష్యుల మాటలకి పదును ఎక్కువ వుంటుంది అని అభిప్రాయపడతాడు.

కథ–కమామీషూ వ్యాసంలో కథలు ఆకాశంలో జరగవు, భూమ్మీద ఏదో కాలంలో, ప్రదేశంలో జరుగుతాయి. రచయిత విషయాన్ని కళ్ళకు కట్టినట్లు చెప్పాలి. కథ ఎక్కడ జరుగుతుందో 'జాగా' చెప్పాలి. తర్వాత సమయం, ఏ సమయంలో జరుగుతుంది. ఉదయమా, సాయంకాలమా, రాత్రి, పగలా, వాతావరణం అక్కడ ఏమున్నాయి. బల్లా, కుర్చీయా, మనిషా, కొంతమంది నేను' అని రాస్తూ ఉంటారు. కథ సగం అయిపోయేదాకా కూడా అది ఆడో మగో తెలియకుండా చదువుతాం. కాబట్టి రచయిత ఇది స్పష్టం చేయాలి. పాత్ర గురించి చిత్రీకరణ ఉండాలి రచనలో అని రావిశాస్త్రిగారి కథకు సంబంధించిన కథా సూత్రాలను చర్చించారు. చిన్నప్పటి నుంచి శాస్త్రిగారిని అమ్మ పుస్తకాలు చదివించటం, నాన్నగారు తెచ్చిన పత్రికలు చదవడం, అబ్బూరి వరద రాజేశ్వరరావుగారి సహవాసంతో వీరి సాహిత్య జీవితం మొదలై గురజాడ, శ్రీశ్రీలను అభిమాన రచయితలుగా చేసుకుని సాహిత్య జీవితాన్ని ప్రారంభించి తెలుగు సాహిత్యంలో తమదైన ప్రత్యేక ముద్ర వేసారు రావిశాస్త్రిగారు. 1965లో ఎందుకు రాసేను? అన్న వ్యాసంలో తన రచనా క్రమాన్ని గురించి తెలిపారు రచయితలు ప్రజల పక్షం వహించాలి. వారిని సమర్థిస్తూ రాయాలి అన్నది వీరి లక్ష్యం.

–వ్యాస రచయిత తెలుగు విభాగం,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362



వాగ్దేవి

చిత్రకారుడు : అడివి బాపిరాజు

వ్యాసం: 38వ పుటలో...

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
November 2022 Vol :8, Issue 8

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244